
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 85
శుక్రవారం 16-6-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



బ్రిజ్‌భూషణ్‌కు ఊరటనిస్తూ...
రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై 'పోక్సో' కేసును తొలగించనున్న పోలీసులు. -13లో



మూడు రోజుల లాభాలకు బ్రేక్!
మళ్లీ 63 వేల దిగువకు సెన్సెక్స్. 18,700 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ -13లో



మతమార్పిడి నిరోధక చట్టం రద్దు
కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మత మార్పిడి నిరోధక చట్టాన్ని రద్దు చేస్తామని సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రకటించింది.
- వివరాలు 6లో



పార్లమెంట్‌లో వేధింపులకు గురయ్యా
పార్లమెంట్ సాక్షిగా తనపై లైంగిక వేధింపులు జరిగాయని ఆస్ట్రేలియా మహిళా ఎంపీ లిడియా థోర్ప్ సంచలన ఆరోపణలు చేశారు.
- వివరాలు 6లో



మా పేర్లూ తీసేయండి..
తమ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా పాఠ్యాంశాలను తొలగిస్తున్నారంటూ ఎన్సీఈఆర్టీకి విద్యావేత్తలు లేఖ రాశారు.
- వివరాలు 6లో



పవార్ 'పవర్' గేమ్!
ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఆడిన పవర్ గేమ్ సొంత పార్టీలోనే చీలికలు తెచ్చేలా కనబడుతోంది.
- వివరాలు 6లో

ఈసారి మరీ లేట్

గత పదేళ్లతో పోల్చినా ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యం

- ఆగమనానికి మరింత సమయం పట్టనున్నట్టు వాతావరణ శాఖ అంచనా
- గత మూడేళ్లలో ఈపాటికే తొలకరి వర్షాలు
- ఈసారి జూన్ మూడో వారం వరకు పత్తా లేని రుతుపవనాలు
- రెండ్రోజులపాటు ఏపీలో చురుకుగా కదిలి నెమ్మదించిన నైరుతి
- బంగాళాఖాతంలో రుతుపవనాలకు అనుకూలించని వాతావరణం
- రుతుపవనాల కదలికలపై బిపోర్‌జాయ్ తుపాను ప్రభావం




తీరాన్ని తాకిన బిపర్‌జోయ్
గుజరాత్‌లోని కఛ్, సౌరాష్ట్ర తీర ప్రాంతాల్లో కుంభవృష్టి -6లో

సాక్షి, హైదరాబాద్: గత కొన్నేళ్లలో ఎన్నడూ లేనంతగా నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమవుతోంది. సాధారణంతో పోల్చితే ఇప్పటికే వారం, పది రోజులకుపైగా ఆలస్యంకాగా.. నైరుతి ఆగమనానికి మరో వారం వరకూ సమయం పట్టవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నెల 20–22వ తేదీ నాటికి రావొచ్చని పేర్కొంటోంది. ఇది గత పదేళ్లతో పోల్చితే ఏకంగా పది, పన్నెండు రోజులు ఆలస్యం కావడం గమనార్హం. రుతుపవనాలు రాకపోవడంతో వానలు పడక వ్యవసాయంపై ప్రభావం పడుతోంది. పంటల సాగు మొదలుపెట్టేందుకు జాప్యమవుతోందని, ఇలాగైతే పంటల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యంగా వచ్చి.. మందకొడిగా మారి..

ప్రస్తుత సీజన్‌కు సంబంధించి ఈ నెల 8న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు తర్వాత క్రమంగా తమిళనాడుతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. కానీ ఆ తర్వాత మందకొడిగా మారిపోయాయి. రుతుపవనాలు చురుకుగా కదిలేందుకు బంగాళాఖాతంపై నెలకొనే వాతావరణ పరిస్థితులే కీలకం. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి, అల్పపీడనాలు వంటివి ఏర్పడితే రుతుపవనాలు
మిగతా 2వ పేజీలో ▶



ఈసారి పంటల సాగు ఆలస్యమే!
నైరుతి రాక, వానలు లేక రైతుల్లో ఆందోళన
- వివరాలు 2లో



ఖమ్మంలో కొత్తగా ఏర్పాటుచేసిన ప్రత్యేక పార్కులో వాకింగ్ కోసం చేసిన ఏర్పాట్లు

'అంధ'మైన వనం!

- ఖమ్మంలో అంధుల కోసం ప్రత్యేక పార్కు
- నేరుగా ముందుకెళ్లడం, దారి మార్చుకోవడాన్ని సూచించేలా భిన్నమైన టైల్స్
- పంచతత్వ విభాగంలో సులువుగా నడిచేలా ఏర్పాట్లు
- పడిపోకుండా ఊగేలా ఊయల, ఇతర పరికరాలు
- విభిన్నమైన సంగీత పరికరాలు, మరెన్నో సౌకర్యాలు కూడా..

- వివరాలు 5లో

న్యూస్‌రీల్

ఢిల్లీలో కేసీఆర్, ఖర్గే చేతులు కలిపారు



కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఢిల్లీ స్థాయిలో చేతులు కలిపారని తెలంగాణ బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ ఛుగ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌కు బీ టీంగా, సీ టీంగా పనిచేస్తోందన్నారు.
- వివరాలు 2లో

రెండోరోజూ ఐటీ సోదాలు



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు రెండోరోజూ కొనసాగాయి. జూబ్లీహిల్స్‌లో ఉన్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంటితోపాటు కొత్తపేటలోని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇంట్లోనూ సోదాలు జరిగాయి.
- వివరాలు 5లో

అమల్లోకి 'పీక్'లో షాక్!



విద్యుత్ టారిఫ్‌లో కీలక సంస్కరణలను కేంద్రం అమల్లోకి తెచ్చింది. డిమాండ్ గరిష్ఠంగా ఉండే (పీక్) వేళల్లో వాడిన విద్యుత్‌కు అధిక చార్జీలు విధించి, వసూలు చేసేందుకు వీలు కల్పించింది. డిమాండ్ తక్కువగా ఉండే వేళల్లో వినియోగానికి చార్జీల్లో 20 శాతం వరకు రాయితీలను అందించాలని కోరింది.
- వివరాలు 2లో

ఉత్తమ గ్రామ పంచాయతీగా జగన్నాథపురం



తెలంగాణకు మంచినీటి వనరుల విభాగంలో మరో జాతీయ అవార్డు లభించింది. దేశంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జగన్నాథపురం గ్రామం నిలిచింది.
- వివరాలు 14లో

ఇదండీ సంగతి




మీరు మాత్రం పట్టు వదలని భట్టి విక్రమార్కుడిలా మీరు చెప్పదలుచుకుంది చెప్పండి సార్!

కుల ప్రాతిపదికన భూములా?

కులరహిత సమాజం కోసం కదా ప్రభుత్వాలు కృషి చేయాల్సింది
కులాలను విభజించేలా రాష్ట్ర ప్రభుత్వం పనులు చేయడం దారుణమన్న హైకోర్టు

- కమ్మ, వెలమ కులాలకు భూకేటాయింపులను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై విచారణ
- రూ. కోట్లు విలువజేసే ఐదేసి ఎకరాల భూముల్ని కేటాయించడంపై పిటిషనర్ అభ్యంతరం
- ఈ రెండు కులాలు రాష్ట్రంలో అత్యంత ధనిక కులాలని వెల్లడి
- ఇతర కులాలకూ కమ్యూనిటీ భవన్‌ల కోసం ప్రభుత్వం స్థలాలిచ్చిందన్న ఏజీ



సాక్షి, హైదరాబాద్: కులరహిత సమాజం కోసం కృషి చేయాల్సిన ప్రభుత్వం అవి మరింత బలంగా మారే పనులు చేయడం దారుణమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కుల ప్రాతిపదికన భూములు ఎలా కేటాయిస్తారు.. వారు కట్టుకొనే కమ్యూనిటీ భవన్‌లలోకి ఇతర కులాలను అనుమతిస్తారా? అని ప్రశ్నించింది. ప్రభుత్వం అలా ఎలా భూములు కేటాయిస్తుందని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది ఆర్టికల్ 14కు విరుద్ధమని స్పష్టం చేసింది. 'కులాంతర వివాహాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందా? ఈ రకమైన వివాహాలకు ఏదైనా సాయం అందిస్తోందా? కుల నిర్మూలన కోసం ప్రభుత్వం ఇలాంటి పథకాలను అమలు చేయాలి. 21వ శతాబ్దంలో కూడా కులాల ఆధారిత విభజన ఉందంటే.. మనం ఎక్కడికి వెళ్తున్నాం? ఇలాంటి ఆలోచనలు చాలా సంకుచితమైనవి.. అసంబద్ధమైనవి'
మిగతా 2వ పేజీలో ▶

మహారాష్ట్ర నుంచే మార్పు షురూ..



నాగ్‌పూర్ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నాగ్‌పూర్‌లో సీఎం కేసీఆర్

- రైతులు మాత్రమే కావాలి.. రైతు ప్రభుత్వమే ఏర్పడాలి
- రైతులు పార్లమెంటులో నిర్ణయాలు తీసుకోలేరా?
- మహారాష్ట్రలో తెలంగాణ మోడల్ అమలుకు కొట్లాడతాం..
- మార్పు కోసం పనిచేసే రాజకీయ వాహనంగా బీఆర్ఎస్
- పార్టీ కార్యాలయం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: 'ఆందోళనలు మీరు చేయండి, చట్టాలు, విధానాల రూపకల్పన జరిగే అసెంబ్లీ, పార్లమెంటుకు మేము వెళ్తామనే రాజకీయ పార్టీల ధోరణికి కాలం చెల్లింది. నాగలి దున్ని పంటలు పండించే రైతులు పార్లమెంటులో నిర్ణయాలు తీసుకోలేరా? రైతుల సమస్యలను పక్కన పెట్టి దళారీలను ప్రోత్సహించడం దేశానికి మంచిది కాదు. రైతులు మాత్రమే కావాలి.. రైతు ప్రభుత్వమే ఏర్పడాలి. భారత్‌లో మార్పు తెచ్చే ప్రయాణం మహారాష్ట్ర నుంచే మొదలైంది. మహారాష్ట్రలో తెలంగాణ మోడల్ అమలు చేసేందుకు భూమి, ఆకాశాన్ని ఏకం చేసైనా కొట్లాడతాం. ఇక్కడ జరిగే అన్ని రకాల ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేస్తుంది..'అని ఆ పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో బీఆర్ఎస్ శాశ్వత కార్యాలయాన్ని గురువారం ప్రారంభించిన
మిగతా 2వ పేజీలో ▶

మోదీ మంచి మిత్రుడు
నాగ్‌పూర్‌లో మీడియాతో కేసీఆర్ - 2లో

ట్రిపుల్ ఐటీలో మరో మరణం

- నాలుగో అంతస్తు నుంచి పడిన పీయూసీ–1 విద్యార్థిని లిఖిత!
- ఆత్మహత్యా? ప్రమాదమా? అనే అనుమానాలు
- ప్రమాదమేనన్న బంధువులు, వర్సిటీ ఇన్‌చార్జి వీసీ
- దీపిక ఆత్మహత్య చేసుకున్న రెండురోజులకే ఆమె స్నేహితురాలి మరణంతో కలకలం

ట్రిపుల్ ఐటీలో ఏం జరుగుతోంది?
వరుస మరణాలెందుకు? - 3లో



లిఖిత (ఫైల్)

నిర్మల్: బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ–1 విద్యార్థిని లిఖిత.. బుధవారం రాత్రి తాను చదువుతున్న ఆర్జీయూకేటీలోని హాస్టల్ భవనం నాలుగో అంతస్తు పైనుంచి పడి చనిపోయింది. ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా? ప్రమాదవశాత్తూ కింద పడిందా? అన్నది స్పష్టంగా తెలియడం లేదు. ఇదే ట్రిపుల్ ఐటీలోని పీయూసీ విద్యార్థిని దీపిక ఆత్మహత్య చేసుకుని రెండ్రోజులే అయ్యింది. ఆ కలవరం నుంచే విద్యార్థులు ఇంకా తేరుకోలేదు. ఇంతలోనే దీపిక స్నేహితురాలైన లిఖిత మరణించడంతో అంతా భయాందోళనలకు గురవుతున్నారు. ఇంతకుముందు కూడా ఇలాంటి ఘటనలు ఎన్నో చోటు చేసుకోగా, గత ఏడాది కాలంలోనే ఐదుగురు మరణించడం గమనార్హం. పేదింట్లో విరిసిన విద్యా కుసుమాలు చదువుల తల్లి ఒడిలో అర్ధాంతరంగా నేలరాలడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పలు రాజకీయ పార్టీలు,
మిగతా 3వ పేజీలో ▶

మోడల్ అంటే తెలంగాణ

- సమగ్ర, సమ్మిళిత, సమీకృత, సమతుల్య అభివృద్ధి: మంత్రి కేటీఆర్
- 3 శాతం రాష్ట్ర జనాభాకు 30 శాతం అవార్డులు
- రాష్ట్రంలో 2.41 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు
- లక్షన్నర మెజార్టీతో హరీశ్‌రావును గెలిపించాలని ప్రజలకు పిలుపు
- కేటీఆర్ లాంటి ఐటీ మంత్రి కావాలని ఇతర రాష్ట్రాల్లో యువత కోరుతోంది: మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేటలో ఐటీ టవర్ ప్రారంభం

సాక్షి, సిద్దిపేట: తెలంగాణ మోడల్ అంటే.. సమగ్ర, సమ్మిళిత, సమీకృత, సమతుల్య అభివృద్ధి అని పురపాలక, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. వ్యవసాయం, ఐటీ పరిశ్రమలు, హరితహారంలో రాష్ట్రం దూసుకుపోతోందన్నారు. హరితహారంతో పచ్చదనాన్ని 7.7 శాతానికి పెంచామని, రూ.2.41 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులతో అగ్రభాగాన ఉన్నామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో ఐటీ ఉద్యోగులు 3.23 లక్షలుండగా, ఇప్పుడు 9.05 లక్షల మంది ఉన్నారన్నారు. 142 కోట్ల భారత్‌లో కేంద్రం 0.5 శాతం (59 లక్షలు)ఉద్యోగాలు మాత్రమే కల్పిస్తోందని, రాష్ట్రంలో 6.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. కేటీఆర్ గురువారం సిద్దిపేటలో ఐటీ టవర్, స్లాటర్‌హౌస్, వాటర్ రింగ్‌మెన్
మిగతా 3వ పేజీలో ▶



సిద్దిపేట సభలో హరీశ్‌రావు, కేటీఆర్ ఆలింగనం

ప్రొ. హరగోపాల్‌పై దేశద్రోహం కేసు

- 2022 ఆగస్టు 19న తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో నమోదు
- మరో 152 మందిపైనా 'ఉపా' చట్టం కింద కేసులు పెట్టిన పోలీసులు
- పీపుల్స్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ అధ్యక్షుడు చంద్రమౌళి బెయిల్ పిటిషన్‌తో వెలుగులోకి
- మావోల పుస్తకాల్లో పేర్లుంటే దేశద్రోహం కేసులా?: హరగోపాల్
- నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపు



సాక్షి, హైదరాబాద్/ఎస్ఎస్ తాడ్వాయి: ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్‌పై పోలీసులు దేశద్రోహం కేసు పెట్టిన విషయం తాజాగా బయటపడింది. ప్రజాప్రతినిధులను చంపేందుకు కుట్ర చేశారంటూ బీరెల్లి కుట్ర కేసులో హరగోపాల్‌తోపాటు మరో 152 మందిపై ములుగు జిల్లా తాడ్వాయి మండల పోలీస్ స్టేషన్‌లో 2022 ఆగస్టు 19న కేసులు నమోదైన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ చట్టం–1967 (ఉపా), ఆర్మ్స్ యాక్ట్‌తోపాటు మొత్తం పది రకాల చట్టాల కింద ఈ కేసులు నమోదయ్యాయి. 2022 ఆగస్టు 19న తాడ్వాయి
మిగతా 3వ పేజీలో ▶

ఆడిటర్ సహా.. విశాఖ ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్

4 గంటల్లోనే కథ సుఖాంతం..

- రెండ్రోజుల క్రితం ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లో చొరబడిన దుండగులు
- అతడితోనే ఫోన్ చేయించి తల్లిని రప్పించిన కిడ్నాపర్లు
- ఆమె ద్వారా ఆడిటర్ జీవీని పిలిపించి నిర్బంధం
- ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బు ఇవ్వాలంటూ బెదిరింపులు
- సినీ ఫక్కీలో కిడ్నాపర్లను నాలుగు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

- వివరాలు 10లో

ఆగస్టులో గురుకుల కొలువుల పరీక్షలు

రెండ్రోజుల్లో పరీక్షల షెడ్యూల్ విడుదల.. స్పష్టత ఇచ్చిన గురుకుల బోర్డు



సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువులకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. ఆగస్టులో అర్హత పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఆగస్టు 1వ తేదీ నుంచి 23వ తేదీ మధ్యన అర్హత పరీక్షలను నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన స్పష్టమైన తేదీలను రెండ్రోజుల్లో ప్రకటించనున్నట్లు వెల్లడించింది. పూర్తి పరీక్షల షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు గురువారం టీఆర్ఈఐఆర్‌బీ కన్వీనర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. 9 కేటగిరీల్లో 9,210 పోస్టుల భర్తీకి టీఆర్ఈఐఆర్‌బీ ప్రకటనలు విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం దరఖాస్తుల్లో పొరపాట్ల సవరణకు అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియ నెలాఖరులో పూర్తి కానుంది. 9,210 కొలువులకు 2,63,045 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన ఒక్కో పోస్టుకు సగటున 29 మంది పోటీ పడుతున్నట్లు అంచనా.

సీబీటీ పద్ధతిలో పరీక్షలు: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్వహించే అర్హత
మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రెండు రోజుల పాటు తెలంగాణలో పర్యటించనున్నారు. శుక్రవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నాక రాష్ట్రపతి ముర్ము, శనివారం ఉదయం దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీకి చేరుకుంటారు. అక్కడ జరుగనున్న కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌ను ముర్ము పర్యవేక్షించనున్నారు.

రఘురాం పిల్లారిశెట్టికి అమెరికన్ సర్జికల్ అసోసియేషన్ ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: అమెరికన్ సర్జికల్ అసోసియేషన్ (ఏఎస్ఏ) 144వ వార్షిక సదస్సుకు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రఘురాం పిల్లారిశెట్టికి ఆహ్వానం అందింది. ఈ సదస్సులో ఏఎస్ఏ నుంచి డాక్టర్ రఘురాం ప్రతిష్టాత్మక హానరరీ ఫెలోషిప్ అందుకోనున్నారు. డాక్టర్ రఘురాం కిమ్స్–ఉషా లక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజ్ వ్యవస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అమెరికా బయట నుంచి ఈ ఫెలోషిప్ అందుకుంటున్న తొలి వ్యక్తి డాక్టర్ రఘురాం అని అమెరికన్ సర్జికల్ అసోసియేషన్ సెక్రటరీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ సర్జరీ విభాగం చైర్మన్ ప్రొఫెసర్ మేరీ హాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో 2024 ఏప్రిల్‌లో ఈ సదస్సు జరగనుంది.

నవభారత నిర్మాణమే మోదీ లక్ష్యం: జవదేకర్



కాచిగూడ (హైదరాబాద్): నవభారత నిర్మాణమే లక్ష్యంగా, అభివృద్ధిలో అగ్రదేశాలకు దీటుగా భారత్‌ను ప్రధాని మోదీ తీర్చిదిద్దుతున్నారని కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. గురువారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మోదీ 9 ఏళ్ల పాలనపై ముద్రించిన పుస్తకాన్ని జవదేకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రదేశాలకు దీటుగా భారత్‌ను అభివృద్ధి పథంలో మోదీ ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. మోదీ పాలనపై ప్రతిపక్షాలు అవినీతి ఆరోపణలు చేయకపోవడం మోదీ సుపరిపాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

17న కిషన్‌రెడ్డి 'రిపోర్ట్ టు పీపుల్' ప్రజంటేషన్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న ఉదయం 10.30 గంటలకు ఆర్టీసీ కళాభవన్‌లో 'రిపోర్ట్ టు పీపుల్'పేరిట కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ రాష్ట్రాభివృద్ధికి విశేషంగా సహకరించిన తీరును ఈ ప్రజంటేషన్‌లో వివరించనున్నట్లు బీజేపీ అధికారప్రతినిధి ఎన్వీ సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2014 నుంచి ఇప్పటి దాకా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందించిన సహకారాన్ని, కృషిని రాష్ట్ర ప్రజలకు కిషన్‌రెడ్డి వివరించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఎంతో కృషి చేసినా కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం కేంద్రం పాత్రను తక్కువ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

మోదీ మంచి మిత్రుడు

మేం ఆలోచనలు పంచుకోవడంలో వింతేమీ లేదు

- కేంద్రం తమ పథకాలను కాపీ కొడుతోందన్న అంశంపై నాగ్‌పూర్‌లో కేసీఆర్ వ్యాఖ్య
- సందర్భాన్ని బట్టి విపక్షాల ఐక్యతపై ఆలోచిస్తాం
- ఓట్ల చీలిక బీజేపీకి అనుకూలమనే వాదనతో మాకు సంబంధం లేదు
- మా ఎజెండాతో కలిసి వచ్చేవారితో కలిసి పనిచేస్తాం

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ తనకు మంచి మిత్రుడని, నీతి ఆయోగ్ వంటి సమావేశాల్లో తాము ఆలోచనలు పంచుకోవడంలో వింతేమీ లేదని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. కేంద్రం మీ పథకాలు కాపీ కొడుతోందని నాగ్‌పూర్‌లో కొందరు మీడియా ప్రతినిధులు అనడంతో కేసీఆర్ పై విధంగా స్పందించారు. మా ఎజెండాతో కలిసి వచ్చే వారితో కలిసి పనిచేస్తామని, విపక్షాల ఐక్యతపై సందర్భాన్ని బట్టి ఆలోచిస్తామని తెలిపారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో గురువారం బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలు వెల్లడించారు.

గతంలో ఫ్రంట్‌లతో ఫలితం సాధించలేక పోయాం..

'గతంలో యునైటెడ్ ఫ్రంట్, నేషనల్ ఫ్రంట్ లాంటివి అనేకం చూసినా ఫలితం సాధించలేకపోయాం. మాది ప్రాంతీయ పార్టీ కాదు, జాతీయ పార్టీగా మారాం. ఓట్ల చీలిక బీజేపీకి అనుకూలిస్తుందనే వాదనతో మాకు సంబంధం లేదు. ఎవరికో బీ టీమ్, సీ టీమ్ అనే విమర్శలు మాకు అక్కరలేదు. దేశ ప్రజల కోసమే మా పార్టీ పనిచేస్తుంది. మహారాష్ట్రలోనూ పొత్తుల గురించి మేము ఆలోచించడం లేదు. అవసరమవుతుందని అనుకోవడం లేదు. మహారాష్ట్రలో అన్ని ఎన్నికల్లోనూ పోటీ చేస్తాం. గెలుపోటములతో సంబంధం లేకుండా సంపూర్ణ లక్ష్యం చేరుకునే వరకు మా ప్రయాణం సాగుతుంది' అని కేసీఆర్ పేర్కొన్నారు.

విపక్ష నేతలపై ఐటీ దాడులు సరికాదు

'దేశంలో అనేక చోట్ల ప్రత్యేక రాష్ట్రాల కోరిక ఉంది. మిథిలాంచల్ ఏర్పాటుకు ఎప్పటి నుంచో ఉద్యమాలు జరుగుతున్నాయి. రాష్ట్రాల ఏర్పాటులో శాస్త్రీయ విధానం కావాలి. దేశంలో మరో పది పన్నెండు రాష్ట్రాలు ఏర్పడితే ఏమవుతుంది? కొత్త రాష్ట్రాలు ఏర్పడితే విదర్భ కూడా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడుతుంది. మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టే మా పార్టీ కార్యకలాపాలు మహారాష్ట్ర నుంచి ప్రారంభించాం. గతంలో తెలంగాణ రైతులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. ఇప్పుడు 14 రాష్ట్రాల వారు తెలంగాణలో పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే తెలంగాణ తరహాలో మహారాష్ట్రలోనూ అభివృద్ధి జరుగుతుంది. ప్రజాస్వామ్యంలో విపక్ష నేతలపై ఐటీ దాడులు సరికాదు. పార్టీలు బ్రతికి ఉంటేనే ప్రజాస్వామ్యం మనుగడ సాధిస్తుంది. అప్పుడే మోదీ సహా పార్టీలకు అవకాశాలు లభిస్తాయి. పార్టీలను వేధించకుండా బ్రతకనివ్వాలి. ఐటీ దాడులను ఖండిస్తున్నాం..' అని అన్నారు.

విమానాలు అందరికీ అందుబాటులోకి రావాలి..

'మహిళల భాగస్వామ్యంతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదిలోపే పార్లమెంటుతోపాటు అసెంబ్లీల్లోనూ స్త్రీలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేస్తాం. రైతులను అసెంబ్లీ, పార్లమెంటుకు పంపిస్తాం. పార్టీలో చేర్చుకునేందుకు మహారాష్ట్రకు ప్రైవేటు విమానం పంపడం తప్పేమీ లేదు. అది మా పార్టీ విమానం. నేను అందులోనే వెళ్తున్నా. అమెరికాలో రైతుల వద్ద కూడా విమానాలు ఉన్నాయి. ఇక్కడా అందరికీ విమానాలు అందుబాటులోకి రావాలి. 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీజేపీ నేతలు (బండి సంజయ్) చెప్పడం పెద్ద బక్వాస్' అని సీఎం అన్నారు.

బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరగాలి...

'మనకంటే అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాలు, అమెరికా గతంలో ఎన్నికల్లో ఈవీఎంలు ఉపయోగించినా తిరిగి బ్యాలెట్ విధానం పాటిస్తున్నాయి. ఇక్కడా ఈవీఎంలపై అనుమానాలు ఉన్నందున బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరగాలి. భారత్ పనితీరులో మార్పు కోసం రాజ్యాంగంతో పాటు ఆర్థిక, న్యాయ, పాలన, ఎన్నికల రంగాల్లో వ్యవస్థాగత మార్పులు రావాలి. మూస విధానాల నుంచి బయట పడకుంటే ప్రపంచంతో పోటీ పడలేం. దేశ జల, విద్యుత్ విధానాల్లోనూ మార్పులు రావాల్సిన అవసరముంది. ఎయిర్ పోర్టులు, పోర్టులు, రోడ్లు, రైల్వే వ్యవస్థల్లో మౌలిక వసతులు పెరుగుదల.. దేశంలో గుణాత్మక మార్పుతోనే సాధ్యం. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఈ రంగాలను మెరుగు పరుస్తాం. త్వరలో ఢిల్లీలో మా మేనిఫెస్టోను ప్రకటిస్తాం. దేశంలో దళితుల అభ్యున్నతి, ఉచిత విద్య వంటివి ఇందులో ఉంటాయి. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ సరికాదు, తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎన్నో ఒత్తిళ్లు వచ్చినా ప్రభుత్వ రంగంలోనే కొత్త ప్లాంట్లు నిర్మిస్తున్నాం. లోపాలు సరిదిద్దితే ఆర్థిక రంగం మెరుగవుతుందనే భావనతో మేము తీసుకున్న నిర్ణయాలు తెలంగాణలో ఆర్థిక వృద్ధికి దోహదం చేశాయి. దేశంలో మార్పులకు గడువేమీ పెట్టుకోలేదు, మా లక్ష్యం సాధించే వరకు పోరాటం కొనసాగుతుంది..' అని కేసీఆర్ వెల్లడించారు. దేశంలో ద్రవ్యోల్బణం అదుపు చేయనందు వల్లే ధరలు పెరుగుతున్నాయని, చట్ట సభల్లో చర్చ లేకుండా బిల్లులు ఆమోదం జరగడం వంటి అంశాల్లో మార్పులు రావాలని అన్నారు.



నాగ్‌పూర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో బాల్కసుమన్, తోట చంద్రశేఖర్, కేకే, బీబీ పాటిల్, జీవన్‌రెడ్డి

మహారాష్ట్ర నుంచే మార్పు షురూ

▶ మొదటి పేజీ తరువాయి

అనంతరం సురేశ్ భట్ ఆడిటోరియంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే గెలవాలి..

'దేశంలో అనేక వనరులున్నా మహారాష్ట్రతో సహా దేశమంతా వెనుకబాటుకు గురైంది. దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు అవుతున్నా లక్ష్యం లేకుండా పయనించడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో సుమారు 70 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడినా సాగునీరు, మద్దతు ధర దొరకడం లేదు. దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేని రీతిలో మహారాష్ట్రలో కృష్ణా, గోదావరి, పెన్‌గంగా, వెన్‌గంగ, ప్రాణహిత, ప్రవర వంటి నదులు ప్రవహిస్తున్నా అకోలా, షోలాపూర్, ఔరంగాబాద్ వంటి చోట్ల వారం పది రోజులకోమారు కూడా తాగునీరు రావడం లేదు. దేశ రాజధాని ఢిల్లీలోనూ తాగునీటి కొరత, విద్యుత్ కోతలు ఉన్నాయి. ప్రజాస్వామ్య దేశంలో ఉల్లి ధర కోసం వేలాది మంది రైతులు పాదయాత్రలు చేయడం చింతించాల్సిన విషయం. తెలంగాణలో రైతు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉచిత విద్యుత్, నీటి తీరువా రద్దు, ధరణి, రైతుబంధు, రైతుబీమా తదితర నిర్ణయాలతో రైతులు పండుగ చేసుకుంటున్నారు. పంటల ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించాం. తెలంగాణ విధానాలు అమలు చేస్తే మహారాష్ట్ర ఆర్థికంగా దివాళా తీస్తుందని కొందరు అంటున్నారు. కానీ అలా చేస్తే దివాళా తీసేది నేతలు మాత్రమే. రూ.10 లక్షల కోట్లుగా ఉండాల్సిన మహారాష్ట్ర బడ్జెట్ రూ.6 లక్షల కోట్లుగానే ఎందుకు ఉంది? పార్టీలకు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మారింది. నిజమైన ప్రజాస్వామ్యంలో పార్టీలు, నేతలకు బదులుగా ప్రజలు గెలవాలి..' అని కేసీఆర్ చెప్పారు.

మార్పు రాకపోతే సమస్యలు పరిష్కారం కావు

'ఒక పార్టీని, వ్యక్తిని విమర్శించడం బీఆర్ఎస్ విధానం కాదు, భారత్‌లో మార్పు కోసం పని చేసే ఒక రాజకీయ వాహనం మా పార్టీ. దేశంలో మార్పు రానంత కాలం సమస్యలకు పరిష్కారం దొరకదు. దేశంలో ఆలోచనా విధానం మారనంత కాలం పరిస్థితులు మారవు. మహారాష్ట్రలో ఇప్పుడున్న పార్టీలన్నింటికీ అధికారం వచ్చింది. ఆ పార్టీల నేతలు ముఖ్యమంత్రులై ఒక్కరూ మార్పు కోసం కృషి చేయలేదు. భారత్‌లో సాగు, తాగు, పరిశ్రమల అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉన్నా ఇవ్వడం లేదు. దేశ జల విధానాన్ని బంగాళాఖాతంలో వేసి కొత్త విధానం రూపొందించాల్సిన అవసరముంది..'అని అన్నారు.

రైతు ప్రభుత్వం నినాదం కాదు..నిజం

'దేశంలో 3 లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా ఎవరికీ పట్టడం లేదు. మతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఉన్న వారి విధానాలను ప్రజలకు వివరించాలి. నేను చెప్పే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్‌కు మద్దతు కూడగట్టండి. మహారాష్ట్రలో ఇప్పటికే 4 లక్షల మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు. రాబోయే రోజుల్లో ఇది 25- 30 లక్షలకు చేరుతుంది. పార్టీ కమిటీల్లో రైతులు, యువతకు కూడా ప్రాధాన్యత నివ్వడం ద్వారా వారిని ఎన్నికల్లోనూ గెలిపిద్దాం. ఔరంగాబాద్‌లో శాశ్వత కార్యాలయ భవనాన్ని కొనుగోలు చేశాం. పుణేలోనూ కార్యాలయం ఏర్పాటు చేసి నిత్యం భోజన వసతి కల్పిస్తాం. అందరి శ్రేయస్సు కోరే రైతు ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. ఇది నినాదం కాదు.. నిజం..'అని కేసీఆర్ అన్నారు. మధ్యప్రదేశ్‌కు కూడా రావాల్సిందిగా తనకు ఆహ్వానం అందిందని ఆయన చెప్పారు. కర్ణాటకకు 27 లక్షల టన్నుల బియ్యం కావాలంటూ ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య తనకు ఫోన్ చేసినట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లోకి పలువురు నేతలు

గురువారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు చేరుకున్న కేసీఆర్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ జెండాను ఎగురవేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అందులోని వసతులను పరిశీలించారు. అనంతరం సురేశ్ భట్ ఆడిటోరియంలో వివిధ పార్టీల నేతలకు కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. వేదికపై ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ, పూలే, సావిత్రీబాయి, అంబేడ్కర్, బసవేశ్వర్, అన్నాబాహు సాఠే చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంపీలు కె.కేశవరావు, సంతోష్‌కుమార్, బీబీ పాటిల్, పార్టీ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మహారాష్ట్ర నేతలు మాణిక్ కదమ్, శంకరన్న దోండ్గె, చరణ్ సింగ్ వాంగ్మోరే తదితరులు పాల్గొన్నారు.

కుల ప్రాతిపదికన భూములా?

▶ మొదటి పేజీ తరువాయి

కులాల మధ్య మరింత అంతరాలు పెంచేలా ప్రభుత్వ నిర్ణ యం ఉన్నట్లు అనిపిస్తుంది. అని సీజే ధర్మాసనం వ్యాఖ్యానించింది. కర్ణాటకలోనూ లింగాయత్ కమ్యూనిటీ విద్యాసంస్థలు, చారిటీ ఆస్పత్రుల నిర్మాణం కోసం మార్కెట్ విలువకే ప్రభుత్వం నుంచి భూములు తీసుకుందని.. ఇలా కుల ప్రాతిపదికన భూములు కేటాయించడం సమర్థనీయమా అని ప్రశ్నించింది. ప్రభుత్వాలు ఇలా చేయడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. కమ్మ, వెలమ కులాలకు 5 ఎకరాల చొప్పున హైటెక్ సిటీ సమీపంలోని అత్యంత విలువైన భూములను కేటాయించడాన్ని సవాల్ చేస్తూ ప్రొఫెసర్ ఎ.వినాయక్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది.

ఎకరం విలువ రూ. 50 కోట్లకుపైనే...

పిటిషనర్ తరఫున సీనియర్ అడ్వొకేట్ సత్యంరెడ్డి వాదనలు వినిపించారు. 'ఖానామెట్ విలేజ్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) రహదారికి ఆనుకొని హైటెక్ సిటీ రోడ్డుకు పక్కన ఉన్న 5 ఎకరాల భూమిని ఆలిండియా వెలమ అసోసియేషన్‌కు, అయ్యప్ప సొసైటీ రోడ్డుకు ఆనుకొని ఉన్న మరో 5 ఎకరాల భూమిని కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్యకు ప్రభుత్వం కేటాయించింది. ఈ రెండూ రాష్ట్రంలో అత్యంత ధనిక కులాలు. కేటాయించిన భూములు కూడా అత్యంత విలువైనవి. ఎకరం రూ. 50 కోట్లకుపైనే ఉంటుంది'అని వాదించారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ 'ప్రభుత్వం ఈ రెండు కులాలకు మాత్రమే భూములు ఇవ్వలేదు.. అనేక ఇతర కులాలకు కూడా కమ్యూనిటీ భవన్ల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించింది. జీవో నంబర్ 571 ఆధారంగా మార్కెట్ విలువ మేరకు భూములు కేటాయించింది. ఇతర కులాల్లో పేదలు ఎక్కువ శాతం ఉన్నందున వారికి మార్కెట్ విలువలోనూ తగ్గింపు ఇచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కులాలకు భూకేటాయింపులపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌లో ఇప్పటివరకు ఎలాంటి కౌంటర్ దాఖలు చేయని కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్యకు ఎక్స్‌పార్టీ ఆదేశాలు జారీ చేస్తామని చెప్పింది. వెలమ అసోసియేషన్‌కు మాత్రం రెండు వారాలు సమయం ఇస్తున్నామని పేర్కొంటూ విచారణను జూన్ 28కి వాయిదా వేసింది.

మరికొన్ని సంస్థలకు భూ కేటాయింపులపైనా...

రెడ్డి హాస్టల్, శారదా పీఠం, జీయర్ ట్రస్టు, దర్శకుడు ఎన్.శంకర్‌కు భూ కేటాయింపులపై దాఖలైన పిల్ కూడా సీజే ధర్మాసనం వద్ద విచారణకు వచ్చింది. రెడ్డి హాస్టల్ కేటాయింపు పిటిషన్‌లో పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. అయితే 2018లో భూమి కేటాయిస్తే ఇప్పుడు ఎందుకు పిల్ వేయాల్సి వచ్చిందని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను జూన్ 23కు వాయిదా వేసింది.

ఢిల్లీలో కేసీఆర్, ఖర్గే చేతులు కలిపారు

- రేవంత్ పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలి
- కాంగ్రెస్ బీఆర్ఎస్‌కు బీ, సీ టీంగా పోటీపడుతోంది
- సంజయ్‌ను మార్చం: తరుణ్ ఛుగ్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఢిల్లీ స్థాయిలో చేతులు కలిపారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ ఛుగ్ ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌కు కొన్ని సందర్భాల్లో బీ టీంగా, కొన్నిసార్లు సీ టీంగా పనిచేసేందుకు పోటీ పడుతోందని ఛుగ్ ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తన పరిస్థితి ఏంటో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆలోచించుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరిన విషయం రేవంత్ రెడ్డి ఎలా మరిచిపోయారని, ఇది బీఆర్ఎస్ – కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శించారు. అయితే ఇందుకు భిన్నంగా బీజేపీ- బీఆర్ఎస్ ల మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని రేవంత్ మాట్లాడడం కేవలం అభూత కల్పన అని అన్నారు. గురువారం ఢిల్లీ సౌత్ ఎవెన్యూలోని తన నివాసంలో తరుణ్ ఛుగ్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ని మార్చేది లేదని పార్టీ జాతీయ నాయకత్వం స్పష్టత ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఛుగ్ మండిపడ్డారు.

25న నాగర్ కర్నూల్‌కు నడ్డా

ఈనెల 25న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణ పర్యటనకు వస్తున్నారని తరుణ్ ఛుగ్ తెలిపారు. నాగర్ కర్నూల్ సభలో నడ్డా పాల్గొంటారన్నారు. గుజరాత్‌లో బిపర్ జోయ్ తుపాను వల్ల అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయ్యిందని, త్వరలో ఖమ్మంలోనే షా సభ ఉంటుందన్నారు.


నేడు ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌కు ఏఐసీసీ నుంచి ఇన్‌చార్జి కార్యదర్శులుగా నియమితులైన విష్ణునాథ్ (కేరళ), మన్సూర్ అలీ ఖాన్ (కర్ణాటక)లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవలే తెలంగాణ ఇన్‌చార్జులుగా నియమితులైన వీరిద్దరూ విడివిడిగా గురువారం హైదరాబాద్‌కు వచ్చారు. టీపీసీసీ నేతలు ఎం.ఎ. ఫహీమ్, మెట్టు సాయికుమార్, రోహిణ్‌రెడ్డి తదితరులు వీరికి శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం నేరుగా ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు చేరుకున్న ఇద్దరు ఏఐసీసీ కార్యదర్శులు రాత్రి అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం గాంధీభవన్‌లో జరగనున్న కార్యక్రమంలో వీరు ఇన్‌చార్జి కార్యదర్శులుగా బాధ్యతలు తీసుకోనున్నారు.

అమల్లోకి 'పీక్'లో షాక్!

విద్యుత్ గరిష్ట డిమాండ్ వేళల్లో మోగనున్న చార్జీల మోత

- గెజిట్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- పరిశ్రమలు, వాణిజ్య కేటగిరీలపై కనీసం 20%.. వ్యవసాయం మినహా ఇతర కేటగిరీలపై 10% వడ్డన



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ చార్జీల విధానంలో కేంద్రం కీలక సంస్కరణలు తెచ్చింది. విద్యుత్ డిమాండ్ గరిష్టంగా ఉండే (పీక్) వేళల్లో వాడిన విద్యుత్‌కు అధిక చార్జీలు విధించేందుకు వీలు కల్పించింది. డిమాండ్ తక్కువగా ఉండే వేళల్లో వినియోగానికి 20శాతం వరకు రాయితీలను అందించాలని కోరింది. ఈ మేరకు విద్యుత్ సవరణ నిబంధనలు–2023ను అమల్లోకి తెస్తూ గురువారం కేంద్ర విద్యుత్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని అమల్లోకి తేవాల్సి ఉంటుంది.

పగటి పూట మోతే!

పీక్ సమయాల్లో వాడిన విద్యుత్‌కు సంబంధించి.. వాణిజ్య, పారిశ్రామిక కేటగిరీల నుంచి కనీసం 20 శాతం, వ్యవసాయం మినహా ఇతర అన్ని కేటగిరీల నుంచి కనీసం 10 శాతం అధిక 'టైమ్ ఆఫ్ డే టారిఫ్' వసూలును ఈఆర్సీ నిర్ణయించనుంది. డిమాండ్ గరిష్టంగా ఉండే పగటిపూట విద్యుత్ వినియోగానికి చార్జీలు పెరిగే అవకాశముంది.

స్మార్ట్ మీటర్లు బిగించిన వెంటనే బాదుడు

విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను బిగించిన వెంటనే 'టైమ్ ఆఫ్ డే టారిఫ్'ను వర్తింపజేయాలని కేంద్రం ఆదేశించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి 10 కిలోవాట్లలోపు డిమాండ్ గల పారిశ్రామిక, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు.. 2025 ఏప్రిల్ 1 నాటికి వ్యవసాయం మినహా మిగిలిన కేటగిరీల వినియోగదారులకు 'టైమ్ ఆఫ్ డే టారిఫ్'ను అమలు చేయాలని గడువు విధించింది. ఈ గడువుల్లోగా ఆయా కేటగిరీల వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను బిగించాల్సి ఉంటుంది. రోజువారీ వినియోగం లెక్కలను మొబైల్ యాప్, వెబ్‌సైట్, ఎస్ఎంఎస్ ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని కేంద్రం సూచించింది.

ప్రస్తుత విధానంలో మార్పు ఏమిటి?

సాధారణంగా పగటివేళల్లో విద్యుత్ డిమాండ్ భారీగా, రాత్రివేళల్లో తక్కువగా ఉంటుంది. డిమాండ్ గరిష్టంగా ఉన్నప్పుడు అవసరమైన అదనపు విద్యుత్‌ను ఎనర్జీ ఎక్స్ఛేంజీల నుంచి అధిక ధరలకు విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కొనుగోలు చేస్తున్నాయి. మరోవైపు రాత్రివేళ డిమాండ్ లేక విద్యుత్ మిగిలిపోతోంది. దీనికి పరిష్కారంగా రాత్రివేళ డిమాండ్‌ను పెంచి పగటివేళ తగ్గించడం కోసం 'టైమ్ ఆఫ్ డే' విధానాన్ని డిస్కంలు అమలు చేస్తున్నాయి. డిమాండ్ అధికంగా ఉండే ఉదయం 6–10 గంటల మధ్య, సాయంత్రం 6–10 గంటల మధ్య వినియోగించిన ప్రతి యూనిట్ విద్యుత్‌కు అదనంగా రూపాయి చార్జీ విధిస్తున్నాయి. డిమాండ్ తక్కువగా ఉండే రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య వాడిన ప్రతి యూనిట్ విద్యుత్‌కు ఒక రూపాయి రాయితీ ఇస్తున్నాయి. ప్రస్తుతం ఇది హెచ్‌టీ కేటగిరీలోని–పరిశ్రమలు, పౌల్ట్రీ ఫారాలు, హెచ్‌టీ–2 (బీ) ఇతరత్రా వినియోగదారులు, ప్రార్థనా స్థలాలు, ఎయిర్‌పోర్టులు, బస్ స్టేషన్‌లు, రైల్వేస్టేషన్లు, ఈవీ చార్జింగ్ స్టేషన్లకు మాత్రమే అమలవుతోంది. కేంద్ర నిర్ణయం నేపథ్యంలో వ్యవసాయం మినహా అందరు వినియోగదారులకు ఈ విధానం అమల్లోకి రానుంది.

వెబ్‌సైట్‌లో టారిఫ్ వివరాలు

రోజులో విద్యుత్ డిమాండ్ ఎన్ని గంటలపాటు గరిష్టంగా ఉంటుందనే విషయాన్ని ఈఆర్సీ/ఎస్ఎల్డీసీలు ప్రకటిస్తాయి. దీని ఆధారంగా టైమ్ ఆఫ్ డే టారిఫ్‌ను ఖరారు చేస్తాయి. అయితే పగటి వేళ సూర్యుడు ఉండే వ్యవధికన్నా పీక్ డిమాండ్ గంటల నిడివి ఎక్కువ ఉండరాదు. అన్ని కేటగిరీల వినియోగదారులకు సంబంధించిన టారిఫ్‌ను డిస్కంల వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. ఇంధన సర్దుబాటు సర్‌చార్జీ, ఇతర చార్జీల విధింపుతో టారిఫ్‌లో జరిగే మార్పులను కూడా కనీసం నెల రోజుల ముందే వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పాటు విద్యుత్ బిల్లు/ఎస్ఎంఎస్/మొబైల్ యాప్ ద్వారా తెలియజేయాలి. స్మార్ట్ మీటర్లను బిగించాక నమోదయ్యే గరిష్ట లోడ్ ఆధారంగా అంతకుముందటి విద్యుత్ వినియోగంపై జరిమానాలు విధించడానికి వీల్లేదు. కనెక్షన్ శాంక్షన్డ్ లోడ్ కన్నా అధిక లోడ్‌తో విద్యుత్ వినియోగిస్తే.. దాని ఆధారంగానే ఆ నెలలో బిల్లులను జారీ చేస్తారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు వడ్డించాల్సిందే!

- ఎప్పటికప్పుడే వసూలు చేసుకోవాలని డిస్కంలకు స్పష్టం చేసిన ఈఆర్సీ
- భవిష్యత్తులో వీటిని 'ట్రూఅప్'గా వసూలుకు అనుమతించడం కుదరదని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారుల నుంచి ప్రతి నెలా ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్ఎస్ఏ)ను వసూలు చేయాల్సిందేనని డిస్కంలకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) స్పష్టం చేసింది. లేనిపక్షంలో ఆ చార్జీలను మరిచిపోవాలని, భవిష్యత్తులో ఈ సొమ్మును ట్రూఅప్ చార్జీల రూపంలో వసూలు చేసేందుకు అనుమతించబోమని తేల్చి చెప్పింది. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించిన ఎఫ్ఎస్ఏ చార్జీలను గురువారం నాటికే ప్రకటించాల్సి ఉంది. కానీ మరింత గడువు ఇవ్వాలని కోరుతూ, పలు అంశాలపై స్పష్టత ఇవ్వాలంటూ డిస్కంలు బుధవారం ఈఆర్సీకి లేఖ రాశాయి. కానీ ఈఆర్సీ ఈ విజ్ఞప్తిని తోసిపుచ్చింది.

చట్టప్రకారం వసూలు చేయాల్సిందే..

కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఎలక్ట్రిసిటీ రూల్స్–2021కు అనుగుణంగా ఎఫ్ఎస్ఏ చార్జీల వసూలుకు అనుమతిస్తూ ఈఆర్సీ జనవరిలోనే మూడో సవరణ నిబంధనలు–2023ను జారీ చేసినట్టు గుర్తు చేసింది. అసెంబ్లీ ఆమోదంతో దీనికి చట్టబద్ధత చేకూరిందని, అందువల్ల తప్పనిసరిగా ఎఫ్ఎస్ఏ చార్జీలను వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఎఫ్ఎస్ఏ చార్జీలపై ప్రకటన జారీ చేసేందుకు శుక్రవారం వరకు గడువు ఇచ్చింది. ఏప్రిల్ విద్యుత్‌కు సంబంధించి ఒక్కో యూనిట్‌కు 30పైసల చొప్పున వచ్చే నెల బిల్లుల్లో వసూలు చేసుకోవాలని, మిగతా సొమ్మును త్రైమాసిక ఎఫ్ఎస్ఏ రూపంలో వసూలు చేసుకోవాలని ఈఆర్సీ సూచించినట్టు సమాచారం. దీనితో ఎఫ్ఎస్ఏ చార్జీలపై డిస్కంలు శుక్రవారం బహిరంగ ప్రకటన చేసే అవకాశం ఉందని.. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎఫ్ఎస్ఏ చార్జీల భారాన్ని భరించాలని అధికార వర్గాలు చెప్తున్నాయి.

ఈసారి మరీ లేట్

▶ మొదటి పేజీ తరువాయి

వేగంగా వ్యాప్తి చెందుతాయని అధికారులు చెప్తున్నారు. కానీ ఈసారి బంగాళాఖాతంలో అలాంటి పరిస్థితులేవీ లేవని.. పైగా అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపోర్‌జాయ్ తుపాను ప్రభావంతో నైరుతి మందకొడిగా మారిందని అంటున్నారు.

ఇంతకు ముందు కాస్త లేటయినా..

నైరుతి రుతుపవనాలు మే చివరి నుంచి జూన్ తొలి వారం మధ్య కేరళలో ప్రవేశిస్తాయి. తర్వాత క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. అల్పపీడనాలు, తుఫానులు వంటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రుతుపవనాల కదలికలు ఉంటాయి. గత పదేళ్లలో రుతుపవనాల రాకను పరిశీలిస్తే 2014, 2016, 2019 సంవత్సరాల్లో ఆలస్యంగా వచ్చాయి. చివరిసారిగా 2019లో లేటుగా ప్రవేశించినా.. వాతావరణం పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో, వేగంగా పది రోజుల్లోనే దేశంలోని మెజారిటీ రాష్ట్రాలకు విస్తరించాయి. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు.

ప్రస్తుతం ఈనెల 8న కేరళను తాకిన రుతుపవనాలు తదుపరి మూడు రోజుల్లోనే తమిళనాడు, ఏపీ, కర్ణాటకల్లోకి ప్రవేశించాయి. ఈ నెల 15 నాటికి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని అధికారులు తొలుత అంచనా వేశారు. కానీ రుతుపవనాల కదలిక మందకొడిగా ఉందని.. తెలంగాణలోకి రావడానికి మరో వారం పడుతుందని వివరిస్తున్నారు. తొలకరి వానల కోసం ఎదురుచూడక తప్పదని అంటున్నారు. రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒకట్రెండు వర్షాలకే విత్తనాలు నాటితే.. సాగుకు అనుకూలించే అవకాశాలు తక్కువగా ఉంటాయని సూచిస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రత.. ఉక్కపోత..

నైరుతి మందగమనంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగానే నమోదవుతున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారం తర్వాత గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే తగ్గిపోతాయి. కానీ ఈసారి చాలాచోట్ల 40 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. దీనికితోడు వాతావరణంలో తేమ శాతం పెరగడం వల్ల ఉక్కపోత కొనసాగుతోందని.. ఈ పరిస్థితి మరో వారంపాటు ఉండొచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

పంటల సాగూ ఆలస్యమే!

నైరుతి రాక, వానలు లేక రైతుల్లో ఆందోళన

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు ఇంకా రాకపోవడం, వర్షాలు మొదలవకపోవడంతో రాష్ట్రంలో పంటల సాగు చతికిలపడింది. రుతుపవనాలు వచ్చే సాధారణ సమయం కంటే ఇప్పటికే వారం ఆలస్యమైంది. మరో వారం రోజుల వరకు ఆలస్యమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్తున్న నేపథ్యంలో.. కీలకమైన సీజన్‌లో పంటల సాగుపై ప్రభావం పడుతోంది. జూన్ 10 నుంచి 25వరకు మృగశిర కార్తె ఉంటుందని.. ఈ సమయంలో పత్తి, మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, రాగులు, సజ్జలు వేయాలని, వరి నార్లు పోయాలని రైతులు చెప్తున్నారు. కానీ వర్షాలు లేకపోవడంతో పంటలు వేసే పరిస్థితి లేకుండా పోయిందని.. సాగు ఆలస్యం తప్పేలా లేదని అంటున్నారు. అదను దాటిన తర్వాత పంటలు వేస్తే వివిధ తెగుళ్లు ఆశిస్తాయని, దిగుబడులు తగ్గి నష్టపోవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాటిన విత్తనాలకు నష్టం

రాష్ట్రంలో సాగునీటి వసరులు, బోర్లు, బావుల కింద అనేక మంది రైతులు లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. కానీ ఎండల తీవ్రతతో మాడిపోతున్నాయి. రైతులు మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి. సాధారణంగా జూన్ మొదటి వారంలో పత్తి వేస్తారు. గరిష్టంగా జూలై 15 వరకు వేసుకోవడానికి వీలవుతుంది. ముందుగా వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని.. లేకుంటే దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. ఇక దీర్ఘకాలిక వరి నారును జూన్ 1 నుంచి జూన్ 15 మధ్య వేస్తారు. ప్రస్తుత పరిస్థితితో అవి సాగుచేసే వీలు లేకుండా పోతోంది. మధ్యకాలిక, స్వల్పకాలిక రకాలే వేసుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా వ్యవసాయ సీజన్ ముందుకు జరపాలన్న ప్రభుత్వ ప్రయత్నానికి.. నైరుతి రుతుపవనాల ఆలస్యంతో గండి పడుతోంది. యాసంగి సీజన్ ప్రారంభంపైనా ఇది ప్రభావం చూపే అవకాశం ఉంది.

ప్రొ. హరగోపాల్‌పై
దేశద్రోహం కేసు

▶ మొదటి పేజీ తరువాయి

పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరెల్లి గ్రామంలో తెల్లవారుజామున నిషేధిత మావోయిస్టు పార్టీ దళ సభ్యులతో సుమారు 20 సంఘాలకు చెందిన నేతలు సమావేశమవుతున్నట్లు సమాచారం మేరకు కూంబింగ్ చేపట్టగా వారంతా అడవిలోకి పారిపోయారని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అక్కడ లభించిన విప్లవ సాహిత్యం, పలు వస్తువుల ఆధారంగా సమావేశానికి వచ్చిన వారిపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వాన్ని కూలదోయడానికి, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులను హత్య చేయడానికి వారంతా మావోయిస్టు పార్టీతో కలసి కుట్ర చేసినట్లు అభియోగాలు మోపారు. మావోయిస్టు పుస్తకాల్లో హరగోపాల్ పేరు ఉందని పేర్కొంటూ పోలీసులు ఆయన పేరును ఈ కేసులో చేర్చినట్లు తెలుస్తోంది.

వివరాలు ఇలా బయటకు...

పీపుల్స్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ (పీడీఎం) అధ్యక్షుడు చంద్రమౌళిని రెండు నెలల కిందట పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా చంద్రమౌళిపై మరిన్ని కేసులు ఉన్నట్లు రంగారెడ్డి కోర్టుకు పోలీసులు తెలిపారు. ఆ వివరాలు అందజేయాలని కోర్టు ఆదేశించడంతో తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను పోలీసులు బయటపెట్టారు. దీంతో హరగోపాల్‌పైనా కేసు నమోదైన విషయం బయటపడింది. హరగోపాల్‌పై ఉపా (యూఏపీఏ) కింద పోలీసులు కేసు పెట్టడాన్ని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

ఇది తెలంగాణ విషాదం: ప్రొఫెసర్ హరగోపాల్

తనపై పోలీసులు దేశద్రోహం కేసు నమోదు చేయడంపై ప్రొఫెసర్ హరగోపాల్ స్పందించారు. 'ఇది తెలంగాణ విషాదం. దశాబ్ది ఉత్సవాల వేళ ప్రజాస్వామ్య విలువల విధ్వంసానికి ప్రభుత్వం పాల్పడటం దారుణం. తెలంగాణ భవిష్యత్తు పట్ల నాకు ఆందోళన కలుగుతోంది. మావోయిస్టుల పుస్తకాల్లో నాతో సహా అనేక మంది పేర్లు ఉండవచ్చు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు కూడా ఉండవచ్చు. పేర్లు ఉన్నంత మాత్రాన దేశద్రోహ కేసులు పెడితే ఎలా? సరైన ఆధారాలు ఉండాలి కదా. నేను శాంతి చర్చల్లో పాల్గొన్నాను. మావోయిస్టుల లోపాలను, పొరపాట్లను కూడా ఎత్తిచూపాను. రెండు వైపులా శాంతి కోసం ఎంతో కృషి చేశాం. ఒకవైపు ఉపా చట్టాన్ని ఎత్తేయాలని దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం ఏకంగా 152 మందిపై దేశద్రోహం కేసులు పెట్టడం చూస్తుంటే ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఎలాంటి తీవ్రమైన ప్రమాదంలో పడిందో తెలుస్తోంది. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి. ఉపా వంటి చట్టాలను ఎత్తేయాలి. ఇందు కోసం అన్ని వర్గాల ప్రజలు కలసి రావాలి' అని హరగోపాల్ పిలుపునిచ్చారు.

తీవ్ర విస్మయకరం: టీయూడబ్ల్యూజే

హరగోపాల్, ఇతరులపై రాష్ట్ర ప్రభుత్వం 'ఉపా' చట్టం కింద కేసు నమోదు చేయడం తీవ్ర విస్మయకరమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హరగోపాల్ వంటి ప్రముఖులను ఇలాంటి కేసుల్లో ఇరికించడం వెనక కుట్ర దాగి ఉందని భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఆగస్టులో
గురుకుల కొలువుల పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) మోడ్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు స్పష్టం చేసింది. తొలుత ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించాలని భావించినప్పటికీ... టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం నేపథ్యంలో పరీక్ష నిర్వహణకు సీబీటీ పద్ధతిని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో సీబీటీ పరీక్షల సామర్థ్యం కూడా అభ్యర్థుల సంఖ్యకు తగినట్లుగా ఉండడంతో టీఆర్ఈఐఆర్‌బీ ఈ దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

లాసెట్‌లో 80.21 శాతం పాస్

- బీకాం విద్యార్థులే ఎక్కువ మంది
- త్వరలో కౌన్సెలింగ్ ప్రక్రియ
- ఫలితాలు విడుదల చేసిన ప్రొఫెసర్ లింబాద్రి


శ్రీరామ్ బొడ్డు (ఫస్ట్) మూడేళ్ల లా కోర్సు


మహ్మద్ మహబూబ్ (ఫస్ట్) ఐదేళ్ల లా కోర్సు


తుపిలి రవీంద్రబాబు (ఫస్ట్) రెండేళ్ల పీజీ కోర్సు

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద కోర్సుల్లో ప్రవేశానికి గత నెల ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ లాసెట్–2023) ఫలితాలను ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి గురువారం విడుదల చేశారు. వివరాలను ఆయన మీడియాకు వివరించారు. ఈ పరీక్షకు 43,692 మంది దరఖాస్తు చేసుకోగా, 36,218 మంది పరీక్ష రాశారని, ఇందులో 29,049 (80.21 శాతం) మంది అర్హత సాధించారని తెలిపారు. మొత్తం 120 మార్కులకు జరిగిన ఈ పరీక్షలో ఎస్సీ, ఎస్టీలకు 25 శాతం, ఇతరులకు 35 శాతం అర్హత మార్కులుగా నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల పరిధిలో 7,560 లా సీట్లున్నాయి. ఇందులో మూడేళ్ల లా కోర్సుల్లో 4,630, ఐదేళ్ల లా కోర్సులో 2 వేలు, పీజీ లా కోర్సులో 930 సీట్లున్నాయి. త్వరలో లాసెట్ కౌన్సెలింగ్ చేపడతామని లింబాద్రి వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్లు పైబడిన వాళ్లకూడా...

న్యాయవాద వృత్తి చేపట్టాలనే ఆకాంక్ష 16 ఏళ్ల నుంచి 60 ఏళ్లు పైబడిన వాళ్లలోనూ కనిపించింది. 60 సంవత్సరాలకు పైబడి మూడేళ్ల లాసెట్ రాసిన వాళ్లలో 185 మందికిగాను 149 మంది, ఐదేళ్ల లాసెట్‌లో 10కి 9 మంది, పీజీ లాసెట్‌లో 68 మందికి 65 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే మూడేళ్ల లాసెట్ రాసిన వాళ్లలో బీకాం నేపథ్యం ఉన్నవాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. బీకాం ప్రధాన కోర్సుగా ఉన్నవాళ్లు 8,164 మంది పరీక్ష రాయగా 5,861 మంది అర్హత సాధించారు. ఆ తర్వాత స్థానంలో బీఎస్సీ, బీటెక్ నేపథ్యం వాళ్లున్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వాళ్లు 53 మంది లాసెట్ రాశారు.

లాసెట్ రాసినవాళ్లు... అర్హులు

కోర్సు	దరఖాస్తు చేసినవాళ్లు	పరీక్ష రాసినవాళ్లు	అర్హులు	శాతం
3 ఏళ్ల లా	31,485	25,747	22,234	78.59
ఐదేళ్ల లా	8,858	7,529	6,039	80.21
రెండేళ్ల పీజీ	3,349	2,942	2,776	94.36

టాపర్స్ వీరే...

పేరు	జిల్లా	మార్కులు
3 ఏళ్ల లా..		
శ్రీరాం బొడ్డు	తూ.గో (ఏపీ)	97
తాళ్లూరి నరేశ్	ఖమ్మం	94
5 ఏళ్ల లా		
మహ్మద్ మహబూబ్	ఉత్తరప్రదేశ్	100
అతిథి జాధాని	హైదరాబాద్	94
రెండేళ్ల పీజీ లా		
తుపిలి రవీంద్రబాబు	ఎన్టీఆర్ జిల్లా (ఏపీ)	93
బొడ్డికురుపతి సాయి నాగ సిరిబాల	పశ్చిమగోదావరి	89

మోడల్ అంటే తెలంగాణ


ఐటీ హబ్‌లో ఉద్యోగాలు పొందిన యువతీ యువకులతో ముచ్చటిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభోత్సవం, కప్పలకుంట చెరువు సుందరీకరణ పనులకు ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో తెలంగాణకు అవార్డులు వస్తున్నాయని, 3 శాతం గ్రామీణ జనాభా ఉన్న రాష్ట్రం దేశంలో 30 శాతం అవార్డులను దక్కించుకుందని చెప్పారు. చాలా మంది సిద్దిపేట మీద ప్రత్యేక ప్రేమ ఎందుకని అడుగుతున్నారని, సిద్దిపేట తెలంగాణకు నాయకుడితోపాటు తెలంగాణకు జన్మనిచ్చిందని చెప్పారు. ఇక్కడ కేసీఆర్ పుట్టకపోతే, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలు అవకాశం ఇవ్వకపోతే టీఆర్ఎస్ పుట్టేదా, తెలంగాణ వచ్చేదా? అని అన్నారు. మిషన్ భగీరథ, హరితహారం, దళితబంధుకు పునాది పడిన గడ్డ సిద్దిపేట అని, మిషన్ భగీరథను కేంద్రం కాపీ కొట్టి హర్ ఘర్ జల్‌గా అమలు చేస్తోందన్నారు. స్వచ్ఛ బడి స్ఫూర్తితో పాత జిల్లా కేంద్రాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ బడి ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

తిట్టినవారే శభాష్ అంటున్నారు: హరీశ్‌రావు

తెలంగాణ వస్తే మత కలహాలు జరుగుతాయని, కరెంట్, సాగు, తాగునీరు ఉండవని తిట్టినవారే ఇప్పుడు శభాష్ అంటున్నారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అస్సాంలో విద్యుత్ కొరత ఉందని స్వయంగా మంత్రినే విద్యుత్ వినియోగం తక్కువ చేయాలని చెప్పారని, ప్రధాని సొంత రాష్ట్రంలో పరిశ్రమలకు పవర్ హాలిడే ప్రకటించారని గుర్తు చేశారు. దిగ్గజ ఐటీ కంపెనీలన్నింటినీ హైదరాబాద్‌కు తెచ్చి కేటీఆర్ యువతకు ఉపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. కేటీఆర్ ఐటీలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్ స్థాయికి తీసుకువెళ్లారన్నారు. మరోసారి సీఎం కేసీఆర్‌ని గెలిపించి హ్యాట్రిక్ అందించాలని ప్రజలను కోరారు. కాగా, సిద్దిపేట ఐటీ హబ్ పర్యావరణహితంగా ఉండటంతో ఐజీబీసీ వారు గోల్డ్ రేటింగ్ ప్లేట్‌ను మంత్రి కేటీఆర్, హరీశ్‌రావుకు అందించారు. కార్యక్రమంలో టీఎస్ ఐఐసీ చైర్మన్ బాలమల్లు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

బావ కాబట్టి అప్పుడప్పుడు ఏడిపిస్తా..

'సిరిసిల్లకు వెళ్లినప్పుడల్లా సిద్దిపేటకు రాగానే ఫోన్ చేసి బావా మళ్లీ ఏదో కొత్తది కట్టినవ్ అంటాను. ఇంత పెద్ద రోడ్లు వేశావ్ అంటా. అరె య్ మళ్లీ వెళ్లినప్పుడు కళ్లు మూసుకొని పో.. ప్రతీసారి వెళ్లినప్పుడు ఇలా ఫోన్ చేస్తున్నావు అంటడు. సిరిసిల్లకు పోయేటప్పుడు వచ్చేటప్పుడు బావ కాబట్టి అప్పుడప్పుడు ఏడిపిస్తా. ప్రతీ నియోజకవర్గం సిద్దిపేటలాగా మారినప్పుడే బంగారు తెలంగాణ, బంగారు భారతదేశం అవుతుంది' అని కేటీఆర్ అన్నారు. ఆనాడు కేసీఆర్ అభివృద్ధిని ప్రారంభిస్తే దాన్ని నాలుగింతలు పైకి తీసుకెళ్లిన నాయకుడు హరీశ్‌రావు అని చెప్పక తప్పదన్నారు. ఈసారి 1.50 లక్షల మెజార్టీతో హరీశ్‌ను గెలిపించి, కేసీఆర్‌కు హ్యాట్రిక్ గెలుపు ఇవ్వాలని ప్రజలను కోరారు.

ట్రిపుల్ ఐటీలో మరో మరణం

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. విద్యార్థుల మరణాల వెనుక కారణాలు బయట పెట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

రాత్రి 11 గంటలకు బాగానే మాట్లాడింది..!

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం తిప్పారం గ్రామానికి చెందిన బుర్ర రాజుగౌడ్, రేణుక దంపతులు ఉపాధి నిమిత్తం గజ్వేల్ పట్టణంలో ఉంటున్నారు. ఇక్కడే మిర్చిబండి నడుపుతూ ముగ్గురు పిల్లలను చదివించుకుంటున్నారు. పెద్ద బిడ్డ లిఖిత (17) చిన్నప్పటి నుంచి చదువుల్లో రాణిస్తోంది. గజ్వేల్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి వరకు చదివింది. మంచి మార్కులు రావడంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఇక తమ బిడ్డ భవిష్యత్తుకు ఢోకా లేదని తల్లిదండ్రులు భావించారు. ఇంతలోనే.. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 సమయంలో వర్సిటీలో తను ఉంటున్న బ్లాక్ నాలుగో అంతస్తు పైనుంచి కింద పడి చనిపోయింది. అంతకుముందు 11 గంటల సమయంలో లిఖిత ఇంటికి ఫోన్ చేసింది. తల్లిదండ్రులతో మాట్లాడింది. భోజనం చేశానని, పరీక్ష బాగానే రాశానని కూడా తెలిపింది. ఈ నేపథ్యంలో దీపిక ఆత్మహత్యపైనా కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు.

ఘటనపై అనుమానాలు..

సంగారెడ్డి జిల్లాకు చెందిన పీయూసీ–1 విద్యార్థిని వడ్ల దీపిక ఈనెల 13న ట్రిపుల్ ఐటీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ బాత్రూంలోనే చున్నీతో ఉరేసుకుంది. ఈ ఘటన జరిగిన రెండురోజులకే ఆమె స్నేహితురాలైన బుర్ర లిఖిత మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లిఖిత నాలుగో అంతస్తుపై నుంచి పడి చనిపోయిన విషయం తెలియగానే వర్సిటీ సిబ్బంది ముందుగా భైంసా ఆస్పత్రికి, అక్కడినుంచి పోస్టుమార్టం కోసం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్ నుంచి తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు నిర్మల్‌కు చేరుకున్నారు. తమ బిడ్డ రాత్రి బాగానే మాట్లాడిందని, ఇంతలోనే ఆమె మరణించడంపై తమకు అనుమానాలు ఉన్నాయని వారు అన్నారు. దీంతో వారిని బాసర ట్రిపుల్ ఐటీకి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి.. లిఖిత ఎక్కడి నుంచి పడింది, ఎక్కడ పడిందీ వారికి చూపించారు.


నిర్మల్ ఆస్పత్రిలో రోదిస్తున్న లిఖిత తల్లిదండ్రులు

ప్రమాదమే అన్న బంధుమిత్రులు..

వర్సిటీలో ఎవరు, ఏం చెప్పారో తెలియదు కానీ.. నిర్మల్ తిరిగి వచ్చిన తర్వాత తల్లిదండ్రులు కాకుండా, వారి బంధుమిత్రులు మీడియాతో మాట్లాడారు. లిఖిత ప్రమాదవశాత్తే చనిపోయిందని, మీడియాలో వచ్చినట్లు కుక్కలు వెంటపడటం, ఆత్మహత్య చేసుకోవడం జరగలేదని చెప్పారు. పరీక్షలు కొనసాగుతున్నందున రాత్రిపూట యూట్యూబ్‌లో పాఠాలు చూస్తూ ప్రమాదవశాత్తు జారి పడిందని పేర్కొన్నారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని గజ్వేల్ తీసుకెళ్లారు. ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ కూడా యూట్యూబ్‌లో పాఠాలు చూస్తూనే ప్రమాదవశాత్తు లిఖిత కిందపడి చనిపోయిందని, ఆత్మహత్య చేసుకోలేదని చెప్పారు.

ఆ విద్యార్థుల్లో వీరూ ఉన్నారా..?

పరీక్షల సందర్భంగా ఈనెల 13న సెల్‌ఫోన్ తీసుకువచ్చి పట్టుబడ్డ విద్యార్థుల్లో దీపిక, లిఖిత ఉన్నట్లు సమాచారం. అదేరోజు విద్యార్థులను చీఫ్ వార్డెన్ ఆఫీస్‌లో పలువురు అధ్యాపకులు తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో కలత చెందిన వడ్ల దీపిక అప్పటికప్పుడే పక్కనున్న ఏబీ బ్లాక్‌లోని బాత్రూంలోకి వెళ్లి ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. ఈ ఘటనతో మిగిలిన విద్యార్థులు షాక్‌కు గురైనట్లు సమాచారం. ఇదే క్రమంలో అర్ధరాత్రి దాటిన తర్వాత లిఖిత చనిపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాల ఆందోళన

దీపిక ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ రాకపోవడం విమర్శలకు దారి తీసింది. దీంతో లిఖిత చనిపోయిన విషయం తెలియగానే ఆయన వెంటనే గురువారం ఉదయం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో బీజేపీ నాయకులు వీసీని అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లిఖిత మృతదేహాన్ని నిర్మల్ నుంచి తరలించే వరకూ బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ,ఏబీవీపీ ఇలా ఆయా పార్టీలు, సంఘాల నేతలు వరుసగా ఆందోళనలు చేపట్టారు.

ట్రిపుల్ ఐటీలో ఘటనలు బాధాకరం: మంత్రి సబిత

వికారాబాద్: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థినుల వరుస మరణాలు బాధాకరమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్‌లో ఆమె మాట్లాడుతూ.. మూడురోజుల క్రితం జరిగిన ఘటనపై కమిటీతో విచారణకు ఆదేశించామని తెలిపారు. గురువారం మరో విద్యార్థిని మరణించడంపై నివేదిక కోరతామని చెప్పారు.

ట్రిపుల్ ఐటీలో
ఏం జరుగుతోంది?

- వరుస మరణాలెందుకు?... ప్రాణం తీసుకునేంత ఒత్తిడేంటి?
- విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడం లేదా..!
- తల్లిదండ్రులు, సాధారణ ప్రజల్లో సందేహాలు

నిర్మల్: చదువుల తల్లులుగా నిలవాల్సిన వాళ్ల చావుల వెనుక కారణాలేంటి.? ఆత్మహత్యలు చేసుకునేంత నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారు? మొన్న దీపిక ఎందుకు ఆత్మహత్య చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత లిఖిత చనిపోవడం వెనుక సరైన కారణమేంటి..? భవిష్యత్తుకు భరోసా ఇవ్వాల్సిన విద్యాక్షేత్రం ఇలా విద్యార్థుల బతుకులను ఎందుకు బలి తీసుకుంటోంది..? అసలు బాసర ట్రిపుల్ ఐటీలో ఏం జరుగుతోంది? ఇవీ..సాధారణ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణుల్లో వ్యక్తమవుతున్న సందేహాలు.

ఈనెల 13న బలవన్మరణానికి పాల్పడిన సంగారెడ్డికి చెందిన వడ్ల దీపిక (17) మృతిపై ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. అదేరోజు నలుగురు సభ్యుల నిజనిర్ధారణ కమిటీ వేసినా ఇప్పటికీ కారణాలు బయటపెట్టకపోవడం సందేహాలకు, క్యాంపస్ వాతావరణంపై అనుమానాలకు తావిస్తోంది. ఇక బుధవారం అర్ధరాత్రి తర్వాత గంగాబ్లాక్ నాలుగో అంతస్తుపై నుంచి పడి చనిపోయిన లిఖిత మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబసభ్యులు, వర్సిటీ వర్గాలు చెబుతున్నా.. ఏదో మిస్టరీ ఉందన్న వాదనలూ బలంగా ఉన్నాయి. రాత్రి 2.30 గంటల సమయంలో లిఖిత బయటకు ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆమె మరణంపై గురువారం ఉదయం సెక్యూరిటీ గార్డులు, అధికారులు చెప్పిన వివరణలు వేర్వేరుగా ఉండటం గమనార్హం.

ఎన్నో ప్రశ్నలు..మరెన్నో అనుమానాలు

- విద్యార్థుల మృతిపై ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు అనేక అనుమానాలు లేవనెత్తుతున్నాయి. పలు ప్రశ్నలూ సంధిస్తున్నాయి.
- పరీక్షలు రాస్తున్న సమయంలో కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థిని ప్రాణం తీసుకునేదాకా ఎందుకు తీసుకువచ్చారు? • తన మానసిక పరిస్థితిని అంచనా వేయకుండా ఎందుకు బెదిరింపులకు పాల్పడ్డారు..?
- వర్సిటీలో విద్యార్థుల కోసం ఏకంగా ముగ్గురు కౌన్సిలర్లతో కూడిన డిపార్ట్‌మెంట్ ఉండగా, వారి దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదు? • విద్యార్థులు ఎందుకు ప్రాణాలు తీసుకుంటున్నారో ఎవరూ, ఎందుకు లోతుగా పరిశీలించడం లేదు? • స్థానికంగా ఉంటానని ఇన్‌చార్జిగా వచ్చిన వీసీ వెంకటరమణ గెస్ట్‌గానే ఎందుకు వ్యవహరిస్తున్నారు? • ఇలాంటి ఎన్నో ప్రశ్నలు వర్సిటీలో వాతావరణాన్ని, అక్కడి అధ్యాపకులు, ఇన్‌చార్జీల తీరును నిలదీస్తున్నాయి. దీనిపై సర్కారు సీరియస్‌గా దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

22న అమరవీరుల స్మారక కేంద్రాన్ని ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్ శాంతి కుమారి

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22న సాయంత్రం అమరవీరుల స్మారక కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రారంభిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై శాంతికుమారి గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. డీజీపీ అంజనీ కుమార్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, అమరవీరుల స్మారక కేంద్రం ప్రారంభోత్సవం అనంతరం సభా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దీనికి ముందు అంబేడ్కర్ విగ్రహం ఆవరణనుంచి అమరవీరుల స్మారక కేంద్రం వరకు దాదాపు ఐదు వేల మంది కళాకారులతో ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నందున వారికి సరిపడే పార్కింగ్, సీటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాల మాదిరిగానే, దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులను సీఎస్ కోరారు. సమావేశంలో డీజీపీ అంజనీకుమార్, పంచాయితీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, అడిషనల్ డీజీ స్వాతి లక్రా, వాటర్ వర్క్స్ ఎండీ దానకిషోర్, హైదరాబాద్ కలెక్టర్ అమయ్ కుమార్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం, ఉద్యోగ సంఘాల నాయకులతో సీఎస్ సమావేశమయ్యారు.

ఆశ తీరకుండానే.. అనంతలోకాలకు

గజ్వేల్/ గజ్వేల్ రూరల్: తల్లిదండ్రులకు చేదోడుగా ఉండాలనే లిఖిత కల నెరవేరకుండానే మృత్యుఒడికి చేరుకుంది. కన్నవారికి అంతులేని దుఃఖాన్ని మిగిల్చింది. రాజుగౌడ్, రేణుక దంపతులకు కూతుళ్లు లిఖిత (17), లోహిత, కొడుకు భరత్‌లు ఉన్నారు. లిఖిత చిన్న వయసు నుంచే చదువుల్లో అద్భుతమైన ప్రతిభతో రాణించింది. గతేడాది టెన్త్‌లో 10 జీపీఏ సాధించింది. అయితే రోజంతా కష్టపడితే గానీ పూటగడవని పేదరికంలో ఉన్న తల్లిదండ్రులకు అండగా నిలవాలనే పట్టుదల లిఖితను ట్రిపుల్ ఐటీ వైపు నడిపించింది. ప్రస్తుతం పీయూసీ మొదటి సంవత్సరం చదువుతోంది. నెల క్రితం గజ్వేల్‌లోని ఇంటికి వచ్చింది. కొద్దిరోజులు తల్లిదండ్రులు, తోబుట్టువులతో సంతోషంగా గడిపింది. పరీక్షలున్నాయని చెప్పి వారం రోజుల క్రితమే ఇక్కడి నుంచి ట్రిపుల్ ఐటీకి తిరిగి వెళ్లింది. ఇంతలోనే లిఖిత మృతి చెందినట్లు తెలియడంతో తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. విగత జీవిగా పడి ఉన్న తమ కూతుర్ని చూసి గుండెలవిసేలా రోదించారు. ఉన్నతోద్యోగం పొంది తమ బతుకులు మారుస్తానని చెప్పిన కూతురు తమను వదిలేసి పోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఓటరు పరిశీలన ఎక్కడ?

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ ప్రచారానికి అధికార యంత్రాంగాన్ని వినియోగించుకుంటున్న ప్రభుత్వం ఓటర్ల వెరిఫికేషన్ చేసే బాధ్యతను మరిచిపోయిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మే 24న నోటిఫికేషన్ జారీ చేసిందని, దీని ప్రకారం ఐదు రాష్ట్రాలలో జరిగే ఎన్నికల కోసం స్పెషల్ సమ్మరి రివిజన్ విడుదల చేశారని వివరించారు. దీని ప్రకారం 25 మే నుంచి 23 జూన్ వరకు బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఇంటింటికీ తిరిగి ఓటర్ లిస్ట్ లో ఉన్న పేర్లు వెరిఫై చేయాల్సి ఉంటుందన్నారు. కానీ జూన్ 2 నుంచి 22 వరకు ఆవిర్భావ ఉత్సవాలకు మొత్తం అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని అన్నారు. దీంతో ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని దీనిపై ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తున్నట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఓ విశ్వాసులారా! మీలో ఎవరూ ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు. బహుశా వారే శ్రేష్ఠులు కావచ్చు!
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 16 జూన్ 2023

మనం మారాల్సిందే!

గణాంకాలు వాస్తవ పరిస్థితికి సూచికలు. అనేక సందర్భాల్లో భవిష్యత్ దృశ్యాన్ని ముందుగా కళ్ళ ముందు నిలిపి, గాఢనిద్ర నుంచి మేల్కొలిపే అలారం మోతలు. భారతదేశంలో మధుమేహ రోగుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందనీ, అధిక రక్తపోటు సహా జీవనశైలి వ్యాధుల బారిన పడే వారి సంఖ్య అధికమవుతోందనీ తాజా దేశవ్యాప్త సర్వే వెల్లడించిన అంశాలు అలాంటివే. లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఈ సర్వేలోని అనేక విషయాలు ఇటు ప్రజల్నీ, అటు ప్రభుత్వాలనూ అప్రమత్తం చేస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న మధుమేహం, స్థూలకాయం, అధిక రక్తపోటు లాంటి జీవనశైలి వ్యాధులపై తక్షణ కార్యాచరణ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి.

మధుమేహం, అసాంక్రమిక వ్యాధుల (ఎన్సీడీ)పై అతి పెద్ద సర్వే ఇది. ఇందులో 2008 నుంచి 2020 మధ్యకాలంలో దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 20 ఏళ్ళు, ఆ పైబడిన వయసువాళ్ళను దాదాపు 1.13 లక్షల మందిని సర్వే చేశారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిధులతో భారత వైద్య పరిశోధన మండలితో కలసి మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ ఈ అధ్యయనం నిర్వహించింది. ఈ సర్వేలో వెల్లడైన అంశాలు ఆందోళన రేపుతున్నాయి. 2017లో భారతీయుల్లో 7.5 శాతం మందికే మధుమేహం ఉండేది. 2021 నాటికి ఆ సంఖ్య 11.4 శాతానికి, మరో మాటలో 10.1 కోట్ల మందికి పెరిగింది. అలాగే 15.3 శాతం మంది, అంటే 13.6 కోట్ల మంది మధుమేహం వచ్చే ముందస్తు లక్షణాలతో జీవితం సాగిస్తున్నారు. అంటే 'టైప్–2 డయాబెటిస్' అన్న మాట. ఇక, దేశంలో 28.6 శాతం (25.4 కోట్ల మంది) సాధారణ స్థూలకాయంతో, 39.5 శాతం (35.1 కోట్ల మంది) ఉదర ప్రాంత స్థూలకాయంతో ఉన్నట్టు తేలింది. చెడ్డ కొవ్వు (ఎల్డీఎల్ కొలెస్ట్రాల్)తో 18.5 కోట్ల మంది అనారోగ్యం పాలవుతున్నారు. నూటికి 35.5 మందిని అధిక రక్తపోటు వేధిస్తోంది.

అసాంక్రమిక వ్యాధులు దేశంపై ఎంతటి భారం మోపుతున్నాయో కనుగొనేందుకు గాను దేశంలోని ప్రతి రాష్ట్రాన్నీ అధ్యయనంలో భాగం చేసిన తొలి విస్తృత స్థాయి అధ్యయనం ఇది. దేశంలో ఎక్కువగా మధుమేహం ఉన్న రాష్ట్రాలు – గోవా (26.4 శాతం), పుదుచ్చేరి (26.3 శాతం), కేరళ (25.5 శాతం). అలాగే, షుగర్ వ్యాధిపీడితులు తక్కువగా ఉన్న ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, అరుణాచల్ ప్రదేశ్‌లలో సైతం వ్యాధిపీడితుల సంఖ్య సత్వరన పెరిగే అవకాశం ఉందని ఈ అధ్యయనం హెచ్చరిక. ముందుగా అనుకున్నదాని కన్నా భారత జనాభాలో మధుమేహం అధికంగా ఉందని ఈ సర్వేతో తేలిందని పరిశోధకులు చెబుతున్నారు. 'ఇది గడియారం ముల్లు ముందుకు కదులుతున్న టైమ్ బాంబ్' అని ఈ అధ్యయన సారథి అంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రపంచంలో ప్రతి 11 మంది వయోజనుల్లో ఒకరిని మధుమేహం పీడిస్తోందని లెక్క. షుగర్‌తో గుండె పోటు, అంధత్వం, కిడ్నీల వైఫల్యం ముప్పుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చేస్తున్న హెచ్చరిక సరేసరి. ఈ నేపథ్యంలో కాయకష్టం, క్రమబద్ధమైన జీవనశైలి ఉండే గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే, ఆధునిక జీవనశైలి నిండిన పట్టణాల్లోనే మధుమేహం ఎక్కువగా ఉందనేది ఈ అధ్యయన ఫలితం. ఇది ఓ కీలక సూచిక. మనం మార్చుకోవాల్సింది ఏమిటో చెప్పకనే చెబుతున్న కరదీపిక. మధుమేహం, అధిక రక్తపోటు, స్థూలకాయం వగైరా వంశపారంపర్యం, ఆహారపుటలవాట్లు, జీవనశైలి ద్వారా వస్తాయనేది నిపుణుల మాట. జన్యుపరంగా కుటుంబంలోనే ఉంటే ఏమో కానీ, ఇతరులు మాత్రం తినే తిండి, బతికే తీరులో జాగ్రత్తల ద్వారా ఈ అనారోగ్యాలు రాకుండా జాగ్రత్తపడవచ్చు. ఒకవేళ వచ్చినా... జీవనశైలి మార్పులతో యథాపూర్వ ఆరోగ్యాన్ని పొందవచ్చు. వైద్యులు పదేపదే చెబుతున్న సంగతే తాజా అధ్యయనం సైతం తేల్చింది. ఈ మాటను ఇకనైనా చెవికెక్కించుకోవాలి.

మారిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడు అనివార్యంగా జీవన శైలి మారింది. అది మన ఆహారపుటలవాట్లలో మార్పు తెచ్చింది. చివరకు తెలియకుండా మన ఆరోగ్యాన్ని మనమే బలిపెట్టుకొనే దశకు చేరుకున్నాం. అందుకే ఇకనైనా అనారోగ్యం తెచ్చే ఆహారపుటలవాట్లు, జీవన శైలి సహా అనేకం మనం మార్చుకోవాలి. మరోపక్క అందుకు తగ్గట్టు ప్రజల్లో చైతన్యం పెంచే బాధ్యత ప్రభుత్వాల పైనా ఉంది. అది ఈ అధ్యయనం చెబుతున్న పాఠం. అలాగే, దేశంలో ఆరోగ్య రక్షణ రంగంలో చేయాల్సిన ప్రణాళిక, చేపట్టాల్సిన చర్యలకు ఈ తాజా సర్వే ఫలితాలు మార్గదర్శకమే. అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో మధుమేహ ధోరణి ఒక స్థిరీకరణ దశకు చేరుకుంటే, అనేక ఇతర రాష్ట్రాల్లో అది పెరుగుతోంది. ఫలితంగా ఆయా రాష్ట్రాల తక్షణ చర్యలకీ అధ్యయనం ఉపకరిస్తుంది.

మరోపక్క అన్నిచోట్లా, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య వసతులు మరింత అందుబాటులో ఉండేలా చూడాలి. ఫాస్ట్‌ఫుడ్ మోజు, సోమరితనం వల్ల పిల్లల్లోనూ జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న వేళ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు ముఖ్యం. ఆరోగ్యకరమైన తిండి, శారీరక శ్రమ వల్ల టైప్–2 మధుమేహాన్ని నూటికి 60 కేసుల్లో తగ్గించవచ్చట. అందుకని ప్రభుత్వాలు పౌరసరఫరా వ్యవస్థ ద్వారా చిరుధాన్యాలు పంపిణీ చేసి, ప్రజలను ఆరోగ్యదాయక ఆహారం వైపు మళ్ళించవచ్చు. ప్రజల్ని అటువైపు ప్రోత్సహించడంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలూ చైతన్యశీల పాత్ర పోషించాలి. ఈ జీవనశైలి వ్యాధులు జాతిని నిర్వీర్యం చేసి, అభివృద్ధిని కబళించే ప్రమాదం పొంచివుంది గనక తక్షణమే తగిన విధానాల రూపకల్పన అవసరం. పరిస్థితులు చేయి దాటక ముందే నష్ట నివారణ చర్యలకు నడుంకట్టడం వివేకవంతుల లక్షణం.

మన ప్రజాస్వామ్యం కాగితపు పులా?

విశ్లేషణ



మల్లెపల్లి లక్ష్మయ్య

ఉదార ప్రజాస్వామ్య సూచికలో మన దేశం 97వ స్థానంలో, ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థల్లో 108వ స్థానంలో ఉందని 'వి–డెమ్' నివేదిక చెబుతోంది. బయటి ప్రపంచంలో ప్రజాస్వామ్యం అంటే భావప్రకటనా స్వేచ్ఛ, ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ, పత్రికా స్వాతంత్ర్యం లాంటి అంశాలు పరిగణనలోకి వస్తాయి. కానీ భారత్ లాంటి దేశంలో ప్రభుత్వాల విధానాలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని నిర్ణయించలేవు. వేల సంవత్సరాలుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ ఈ దేశ పాలననూ, ప్రగతినీ నిర్ణయిస్తున్నది. ప్రజాస్వామిక విధానాలకు ఊతం ప్రజల భావాల్లో ఉంది. కులవ్యవస్థను నిర్మూలించే దిశగా ఒక బలమైన ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళకపోతే, ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఒక కాగితపు పులిగా మాత్రమే మిగిలిపోతుంది.

భారతదేశం పెద్ద ప్రజాస్వామ్య దేశం. మానవ హక్కులూ, ప్రజాస్వామ్య భావాలూ, సమానత్వ అంశాలూ మేళవింపుగా ఉన్న ఆధునిక రాజ్యాంగం కలిగిన దేశం కూడా. అయితే ఇటీవల ప్రజాస్వామ్య దేశం తన ఉదార ప్రజాస్వామ్య వ్యవస్థ నుంచి నియంతృత్వ పోకడలకు దగ్గరవుతున్నట్టు, 'వి–డెమ్' తన పరిశోధనలో తేల్చింది. ఉదార ప్రజాస్వామ్య సూచికలో మన దేశం 97వ స్థానంలో, ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థల్లో 108వ స్థానంలోకి వెళ్ళింది. మత స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, మహిళా స్వేచ్ఛ, ఆదిమ తెగలు, ఇతర వర్గాలకు సంబంధించిన స్వేచ్ఛల్లో మనం ఇతర దేశాలకన్నా వెనుకబడి ఉన్నామన్న విషయాన్ని చాలా మంది చాలాసార్లు ప్రస్తావించారు.

బయటి ప్రపంచంలో ప్రజాస్వామ్యం అనగానే ఒక ఐదారు అంశాలు ప్రస్తావనకు వస్తాయి. భావప్రకటనా స్వేచ్ఛ, ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకునే స్వేచ్ఛతో పాటు పత్రికా స్వాతంత్ర్యం లాంటి అంశాలు పరిగణనలోకి వస్తాయి. స్వీడన్ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వి–డెమ్ (విభిన్న ప్రజాస్వామ్యాలు) సర్వే కూడా ప్రభుత్వ పాలనకు సంబంధించిన అంశాలనే పేర్కొంటుంది. అయితే భారత్ సహా మరికొన్ని దక్షిణాసియా దేశాలలో ఈ పరిశీలన మాత్రమే సరిపోదు. ఇక్కడ ప్రభుత్వాల విధానాలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని నిర్ణయించలేవు. వేల సంవత్సరాలుగా పాతుకుపోయిన కుల వ్యవస్థ ఈ దేశ పాలననూ, ప్రగతినీ నిర్ణయిస్తున్నది.

మూల కారణం

ప్రస్తుతం మన దేశంలో మోదీ పాలన నియంతృత్వాన్ని అమలు చేస్తున్నదనే విషయం ఎక్కువగా చర్చకు వస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతున్నది. రాజ్యాంగ విలువలకు స్థానం లేకుండా పోతున్నది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో, ముఖ్యంగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీని విధించి అణచివేతను కొనసాగించారు. కానీ ఇందిరాగాంధీ నియంతృత్వానికీ, మోదీ నియంతృత్వానికీ గుణాత్మకమైన తేడా ఉన్నదన్న విషయాన్ని గమనించాల్సి ఉంది. ఇందిరాగాంధీ తన పాలనను కాపాడుకోవడానికి తాత్కాలికంగా నిర్బంధాన్ని అమలు జరిపారు. తదనంతరం తన తప్పు తెలుసుకొని ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. మోదీ పాలన ప్రజాస్వామ్యాన్ని పాతరేసి, ప్రజలను విభజించి, రాజ్యాంగం ప్రకటించిన 'మేమంతా భారతీయులం' అనే భావనకు చరమగీతం పాడుతున్నది. రెండువేల సంవత్సరాలకు పైగా కొనసాగుతున్న కుల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి కావాల్సిన చర్యలన్నింటినీ తీసుకుంటున్నది.

అయితే మోదీకి గానీ, భారతీయ జనతా పార్టీకి గానీ ఆ ధైర్యం కలగడానికి, అంత బహిరంగంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘించడానికి పునాది ఇక్కడి కుల వ్యవస్థలో ఉంది. దానితో పాటు రోజురోజుకీ



గుత్తాధిపత్యం వైపు వెళ్ళిపోతున్న ఆర్థిక వ్యవస్థ. ఇప్పుడు ఏర్పడిన ఈ ప్రమాదాన్ని రాజ్యాంగ ముసాయిదాను సమర్పించిన 1949 నవంబర్ 25 రోజున బాబాసాహెబ్ అంబేడ్కర్ బహిరంగంగా దేశం ముందుంచారు. ''ఒక మనిషి, ఒక ఓటు, ఒక విలువ ద్వారా మనం రాజకీయ సమానత్వాన్ని సాధించాం. కానీ సామాజిక, ఆర్థిక రంగాల్లో ఇంకా ఆ తేడాలు కొనసాగుతూనే ఉన్నాయి. సాధ్యమైనంత త్వరలో ఆ వ్యత్యాసాలను తొలగించుకోకపోతే, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది'' అంటూ ఆనాడు చేసిన హెచ్చరిక ఈరోజు మరింత సత్యంగా కనపడుతున్నది.

సోదరభావం కీలకం

ఇతర దేశాల ప్రజాస్వామ్య భావనకూ, భారత దేశంలోని ప్రజాస్వామ్య అవగాహనకూ తేడా ఉన్న విషయాన్ని కూడా అంబేడ్కర్ స్పష్టంగా చెప్పారు. 1936లో రాసిన కుల నిర్మూలనలోనే ఆయన తన ఆలోచనలను ప్రపంచం ముందు పెట్టారు. ప్రజాస్వామ్యం అనగానే అది ఎన్నికలు, పాలన, ప్రభుత్వాల విధానాలు అని అనుకోవడం పొరపాటనీ, అది ప్రజల మధ్య ఉండే సంబంధాలను నిర్వచిస్తుందనీ కూడా అంబేడ్కర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి మూడు ముఖ్యమైన అంశాలను పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం కీలకమని చెపుతూ, ఇందులో అత్యంత ముఖ్యమైనది సోదరత్వం అంటారు. ఇది భారత దేశంలో కొరవడిన అంశమని తేల్చారు.

గత డెబ్బై అయిదు సంవత్సరాలుగా అటు కాంగ్రెస్ గానీ, ఇతర పార్టీలు గానీ అంబేడ్కర్ హెచ్చరికలను పట్టించుకోలేదు. కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది. కులవ్యవస్థను నిర్మూలించే ఎటువంటి ప్రయత్నాన్ని గానీ, ప్రణాళికను గానీ కాంగ్రెస్ తన సుదీర్ఘ పాలనలో ఏనాడూ చేయలేదు. కేవలం ఆర్థిక తోడ్పాట్ల వంటివి మాత్రమే ఈ దేశంలో దళితులు, ఆదివాసుల జీవితాల్లో సమూలమైన మార్పులు తీసుకురాలేవనీ, కులవ్యవస్థను కూకటి వేళ్ళతో పెకిలించగలిగే పక్కా ప్రణాళిక అవసరమనీ గుర్తించడంలో కాంగ్రెస్ వైఫల్యం చెందింది. అదే ఇప్పుడు బీజేపీకి ఆయుధంగా మారింది.

ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోకూడదు. భారత దేశంలో ప్రభుత్వాల కన్నా ప్రజలే బలవంతులు. ప్రజల్లో తరతరాలుగా నాటుకొని పోయిన కుల వ్యత్యాసాలు, కుల అసమానతలు ఇక్కడి ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధం. గత పదేళ్ళలో ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో బీజేపీ ప్రభుత్వం మనగలుగుతుందంటే కులాలలోని విభేదాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడమే. దానితో పాటు, హిందూ మతంలోని పలు అంశాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నది. గ్రామాల్లో ఏ కులాలైతే ఆధిపత్యంలో ఉన్నాయో వాటిని తమ బలంగా మార్చుకోవడం, అత్యధిక జనాభా కలిగిన కులాలను సమీకరించడం చూస్తే బీజేపీ ఎత్తుగడ ఏమిటో అర్థం చేసుకోవడం సులభం అవుతుంది.

అదే సమయంలో గత వందల ఏళ్ళుగా ముస్లింలు, హిందువుల మధ్య ఉన్న వైషమ్యాలను ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో చాలా బలంగా వాడుకుంటున్నది. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిన మాట నిజమే కానీ, దాని బలమేమీ తగ్గలేదు. కులాల పట్ల ప్రజల్లో ఉన్న భావాలను రెచ్చగొట్టడం ఇటీవలి కాలంలో ప్రభుత్వాల విధానాల్లో, న్యాయస్థానాల తీర్పుల్లో స్పష్టంగా కనపడుతున్నది. ఇటీవల దళితుల్లో పెరిగిన చైతన్యం అత్యాచారాల విషయంలో కేసులు నమోదు కావడానికి ఉపయోగపడింది. ఎస్సీ, ఎస్టీల కేసుల విషయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధిపత్య కులాలకు అండగా నిలబడే ప్రయత్నం చేసింది బీజేపీ. తమ పార్టీ పునాదిగా ఉన్న ఆధిపత్య కులాలను మరింత సంతృప్తి పరిచేందుకు ఆర్థికంగా వెనుకబడి న వర్గాలకు రిజర్వేషన్ల పేరుతో అసలు రాజ్యాంగాన్నే అపహాస్యం చేసింది.

చివరగా ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఈ దేశంలో ఉదార వాద ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పాలన వంటి విధానాలు ఏవి అమలు జరగాలన్నా కుల వ్యవస్థ ప్రధానమైన అవరోధం. దీనికి ప్రభుత్వాల బాధ్యత కన్నా, ప్రజల్లో కుల భావనలను తొలగించడం ముఖ్యం. ప్రజల్లో కుల అసమానతల పట్ల సానుకూలత ఉన్నంత వరకూ, గ్రామాల్లో ఇంకా ఈ కులవ్యవస్థ కొనసాగుతున్నంత వరకూ ప్రజాస్వామ్యమనే భావనకు ఆస్కారమే లేదు. తాత్కాలికంగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామిక విధానాలకు ఊతం ప్రజల భావాల్లో ఉంది. అంబేడ్కర్ చెప్పినట్టు, ప్రజాస్వామ్యం, అంటే సమానత్వంతో కూడిన సామాజిక జీవన గమనం కోసం... ప్రభుత్వాల నిర్బంధాలు, నియంతృత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే... ప్రజల్లో ఉన్న కులవ్యవస్థను నిర్మూలించే దిశగా ఒక బలమైన ప్రజాస్వామ్య ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళకపోతే, ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఒక కాగితపు పులిగా మాత్రమే మిగిలిపోతుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇప్పుడే ఇలా ఉంటే...



రాజస్థాన్ నుంచి రోత పుట్టించే కథనాలు వచ్చాయి. పోలీసుల సమక్షంలో యువ ఐపీఎస్ అధికారులు హోటల్ స్టాఫ్‌ను కొట్టారు. ఇద్దరూ 2019 బ్యాచ్‌కు చెందినవారు. అపరాధులు సస్పెండ్ అయ్యేలా సంబంధిత నాయకులు కల్పించుకోవాలి. ముస్సోరీలోని ఎల్బీఎస్ అకాడెమీ వారికి ఏం నేర్పుతోంది? యూపీఎస్సీలో ఎథిక్స్ పేపర్ ఉంటే?

– పుష్పేశ్ పంథ్, హిస్టారియన్

వాస్తవం చెబితే...



ల్యాబ్ నుంచి కోవిడ్ వైరస్ లీక్ అయివుండొచ్చని సూచించడం కూడా జాత్యహంకారం అనడాన్ని గుర్తుతెచ్చుకోండి. చూస్తుంటే ఇప్పుడదే ఏకాభిప్రాయంలా కనబడుతోంది.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

ఏమీ జరగదా?



ఢిల్లీ పోలీసులు 'పోక్సో' ఎఫ్ఐఆర్ మూసేయాలని అడగడం ద్వారా, బ్రిజ్ భూషణ్‌కూ, ప్రభుత్వానికీ కావాల్సినంత ఊపిరి పీల్చుకునే వీలు కల్పించారు. ఇతర ఆరోపణలు బెయిల్ ఇవ్వదగినవే. ఇక న్యాయ పోరాటం ఎంత సుదీర్ఘంగా సాగుతుందో మనకు తెలుసు.

– హరీందర్ బవేజా, జర్నలిస్ట్

వదిలించుకో!



గట్టి దెబ్బలు తిన్న తర్వాత వెంచర్ క్యాపిటల్‌లో నేను నేర్చుకున్న ఒక పాఠం ఏమిటంటే, 'ఎప్పటికీ ఒక చెడ్డ వ్యక్తితో మంచి ఒప్పందం కుదుర్చుకోలేవు'. ఒక మనిషి విషపూరితమైనవాడు అని ఎప్పుడైతే గుర్తిస్తావో అతడిని వదిలెయ్. జీవితం చాలా చిన్నది.

– వెంకీ గణేశన్, ఆంత్రప్రెన్యూర్

అందువల్లే అయ్యాను




మీరు ఇంత చదువుకుని, ఎంబీయే చేసి నటి ఎందుకయ్యారని జనాలు కొందరు అడుగుతుంటారు. అరే... సృజన అనేది మన మెదడులోని గ్రంథాలయం నిర్వహించే కార్యం కదా!

– సౌమ్యా టాండన్, నటి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఈ మద్దతు ధరలు... అశాస్త్రీయం

సందర్భం



సారంపల్లి మల్లారెడ్డి

2023–24 ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర క్యాబినేట్ ఇటీవల 23 పంటలకు మద్దతు ధరలను ప్రకటించింది. గత ఏడాది నిర్ణయించిన మద్దతు ధరలకు అదనంగా క్వింటాల్ వరి ధాన్యానికి 143 రూపాయలు పెంచి రూ. 2,346గా, వేరుశనగకు రూ. 527 పెంచి రూ. 6,904లుగా మద్దతు ధరలు నిర్ణయించినట్లు సగర్వంగా ప్రకటించింది. నిజానికి మోదీ ప్రభుత్వం ప్రకటించిన ఈ మద్దతు ధరలకు శాస్త్రీయత లేదు. 29 రాష్ట్రాల్లో ఉత్పత్తి ఖర్చుల్లో తేడాలు ఉంటాయి. కాబట్టి దేశ సగటు పెట్టుబడిని లెక్కగట్టి, అందులో 50 శాతాన్ని సగటు పెట్టుబడికి కలిపి ఏ పంటకైనా మద్దతు ధర నిర్ణయించాలి. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సగటు పెట్టుబడికి యాభై శాతాన్ని కలపకుండానే మద్దతు ధర ప్రకటించారు. ఈ ఏడాది కూడా ఇదే మోసపూరిత విధానాన్ని అనుసరించి పంటలకు మద్దతు ధర ప్రకటించింది కేంద్రం. ఈ మద్దతు ధరలకు పంటలను ప్రభుత్వ సంస్థలు ఎఫ్‌సీఐ, సీసీఐ, నాఫెడ్ కొనుగోలు చేయాలి. 'వ్యవసాయ ఖర్చులు, ధరల నిర్ణాయక సంఘం' (సీఏసీపీ) సూచనలను గత 9 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం పాటించడం లేదు.

రాజ్యాంగం రీత్యా వ్యవసాయోత్పత్తుల ధరలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించి అమలు చేయాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నిర్ణయించడం లేదు. కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కూరగాయలతో సహా పండ్లకు కూడా ధరలను నిర్ణయించి అమలు చేస్తున్నాయి. కర్ణాటక, కేరళ రాష్ట్రాలు ధాన్యంపై బోనస్ ప్రకటించి సేకరిస్తున్నాయి. ఆ లోటును తమ బడ్జెట్ నుండి భరిస్తున్నాయి.

కనీస మద్దతు ధరలు శాస్త్రీయంగా లేకపోవడమేగాక, ప్రకటించిన ధరలు కూడా మార్కెట్‌లో అమలు కావడం లేదు. పంటల కోత కాలంలో మార్కెట్ కమిటీలు, మధ్య దళారీలు కుమ్మక్కై రైతులను వేలకోట్ల రూపాయల మేర నష్ట పరుస్తున్నారు. నాణ్యతా ప్రమాణాల పేరు చెప్పి ధరలు దిగగోస్తున్నారు. మద్దతు ధరలు నిర్ణయించేటప్పుడే కేంద్రం ప్రతి వ్యవసాయోత్పత్తికీ నాణ్యతా ప్రమాణాలు కూడా నిర్ణయిస్తున్నది. ఆ ప్రమాణాలను శాస్త్రీయంగా పరిశీలించి రైతులకు మద్దతు ధరలు లభించే విధంగా చూడాలి.



ఒకవైపున ఉపకరణాల ధరలు పెంచి రైతులకు పెట్టుబడి పెంచుతున్నారు. మరోవైపున ఉత్పత్తి అయిన పంటల ధరలు తగ్గించి మధ్య దళారీలు, పెట్టుబడి దారులు లాభాలు సంపాదిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీలు తగ్గించి రైతులను భారాలకు గురి చేస్తోంది. పంటలు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఉత్పత్తిపై దృష్టి తగ్గిస్తున్నారు. ఫలితంగా వంటనూనెలు, పప్పు ధాన్యాలు, ముతక ధాన్యాల ఉప ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, ఇతర దేశాల నుండి లక్షల కోట్ల విలువ కలిగినవి దిగుమతులు చేసుకుంటున్నాం.


దేశ రైతాంగానికి లాభాలు కలిగించకున్నా... పెట్టిన పెట్టుబడి రావడానికి వీలుగా పెట్టుబడిపై 50 శాతం కలిపి ధరలు నిర్ణయించాలని స్వామినాథన్ కమీషన్ 2006లో ప్రకటించింది. నేటికి 13 సంవత్సరాలు గడిచినా స్వామినాథన్ సిఫారసులు అమలుకు నోచలేదు. అదే సందర్భంలో అంతర్జాతీయ మార్కెట్ పోటీలో భారత రైతు నిలబడలేకపోతున్నారు. అమెరికా, జర్మనీ, జపాన్, కెనడా లాంటి దేశాలు తమ బడ్జెట్‌లో 7 శాతానికి పైగా రాయితీలు ఇచ్చి అక్కడి రైతులను కాపాడుకుంటున్నాయి. అమెరికాలో 100 పంటలకు మద్దతు ధరలు నిర్ణయించుకున్నారు. మద్దతు ధరలకు తక్కువ అమ్మకాలు జరిగితే ఆ లోటును బడ్జెట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. 'మార్కెట్ జోక్యం' పథకం పేరుతో గతంలో ప్రభుత్వం బడ్జెట్‌లో కొంత కేటాయింపు చేసినా ప్రస్తుతం ఆ బడ్జెట్‌ను పూర్తిగా రద్దు చేశారు.

గత సంవత్సరం 11 మాసాలు కోట్ల మంది రైతులు పోరాటం చేసి సాధించుకున్న మద్దతు ధరల లక్ష్యాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం వమ్ము చేసింది. కనీసం తన ప్రభుత్వంలోని శాఖ సీఏసీపీ సూచించిన ధరలను కూడా అమలు జరపకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పునరాలోచించి శాస్త్రీయంగా ధరలను నిర్ణయించి అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రైతు నిలబడే విధంగా చర్యలు చేపట్టాలి. కార్పొరేట్లకు, మధ్య దళారీలకు లాభాలు కట్టబెట్టడం కాకుండా దేశంలోని 14.57 కోట్ల కుటుంబాలకు, వారిపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి.

వ్యాసకర్త ఏఐకెఎస్ సీనియర్ నాయకులు

వానకాలమొస్తె పట్నమంత చెర్ల పండ్గనే

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల కరెంటు దీపాలు ఎల్గినయి. గా దినం ఎప్పటి తీర్గనే ఆనంద్‌బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్ డబ్బ కాడ జమైతరు.

''తెలంగాన వొచ్చి తొమ్మిదేండ్లే అయ్యింది. పదేండ్లు గాకున్నా బిఆర్ఎస్ సర్కార్ పదేండ్ల పండ్గను షురువు జేసింది'' అని యాద్గిరి అన్నడు.

''ఒక్కొక్క దినం ఒకొక్క పండ్గ జెయ్య బట్టింది. గా నడ్మ చెర్ల పండ్గ జేసింది గదా'' అని సత్నారి అన్నడు.

''అవ్ జేసింది.''

''చెర్లనిట్ల నీల్లున్నయా? అన్ని చెర్లు నిండుగున్నయా?''

''చెర్లు నీల్లతోని నిండుగుండ బట్కెనే చెర్ల పండ్గ చేసింద్రు. బట్టుపల్లిల చెరువు ఎండిపోయిందని కొందరు అబద్దాలు జెప్పింద్రు. ఎండిన చెర్ల ట్యాంకర్లతోని నీల్లు బోసింద్రని అపొజిసనోల్లు అన్నరు. అర్గీజ్ నమ్మొద్దు. నెలకు మూడు వానలు గురుస్తుండగా చెర్లు యాడనన్న ఎండుతయా?''

''యాటలు గోసి చెర్ల పండ్గ జెయ్యాలని సర్పంచ్‌లకు జెప్పింద్రట కదా?''

''చెప్పింద్రు గని యాటలు గోసి దావత్ జేసె తండ్కు సర్కార్ ఫండ్స్ ఇయ్యలేదు. యాడికెల్లి దావత్ జెయ్యాలనుకుంట సర్పంచ్‌లు మొత్తుకుంద్రు.''

''ఫండ్స్ ఇయ్యకున్నా పండ్గ జెయ్యాలె. సర్పంచ్‌లు గీయింత త్యాగం జెయ్యకుంటె ఎట్ల అని బిఆర్ఎస్ లీడర్లు అడ్డబట్టింద్రు.''

''అల్లాదుర్గంల జెనం చెర్ల పండ్గ జెయ్యలేదని ఎవలన్న అంటె నమ్మకుంద్రి. గాడ పంచాయతి జీతగాల్లు, అంగన్ వాడి పంతులమ్మలు, రొండు బోనాలు, రొండు బత్కమ్మలతోని ఊరంత దిరుక్కుంట చెర్వు కాడికి బోయింద్రంటె అస్సల్ నమ్మొద్దు.''

''చెర్ల పండ్గను జెనం ధూమ్ దామ్గ జేసింద్రంటవు. చెర్ల పండ్గను జేసెతందుకు రాష్ట్రమంత చెర్లున్నయా?''



''ఎందుకు లెవ్వు. తుర్కయాంజాల్‌ల మాసాబ్ చెర్వును గదే తీర్గ పీకాన్ చెర్వును కబ్జ జేస్తుంద్రంటి నమ్మొద్దు. చెర్లను కబ్జ జేసుడే చెర్ల పండ్గనా అని ఎవలన్న అడిగితె గాల్లు రాష్ట్రం బంగారి రాష్ట్రమైతుంటె ఓర్వలేనోల్లని అనుకోవాలె.''

''వాన కాల మొస్తున్నది.''

''వొస్తేంది?''

''పట్నంల తొవ్వలు చెర్లయితయి. ఇండ్లు గుడ్క చెర్లయితయి. బస్సు సర్వీసులను బందుబెడ్తె బాగుంటది.''

''బస్సు సర్వీసులను బందుబెట్టి ఏం జెయ్యాలె?''

''పడ్వ సర్వీసులను బెట్టాలె. తొవ్వ చెర్లల్ల బత్కమ్మలను ఎయ్యాలె. గప్పుడు పట్నమంత పూల చెర్వు లెక్క గండ్లబడ్తది.''

''పట్నం చెర్ల పండ్గ ఫోట్వలను పత్రికలల్ల చపాయిస్తరు. టివిలల్ల గుడ్క సూబెడ్తరు.''

''కొన్ని ఊర్లల్ల ముక్కు నేలకు రాసుడు పండ్గ జేసింద్రు.''

''మోటర్ గుర్తుకు ఓటు ఏసినందుకు గా ఊర్లల్లోల్లు ముక్కు నేలకు రాసుడు పండ్గ జేసింద్రు. చెంపలేస్కునే పండ్గను కొన్ని ఊర్లల్లోల్లు జేసింద్రు.''

''మహబూబ్ నగర్ల మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను పాలతోని అభిసేకం జేసింద్రట గదా?''

''అవ్ ఇంతకుముందు మంత్రుల ఫోట్వలకు, ముక్యమంత్రి ఫోట్వకు అభిసేకం జేసెటోల్లు గని గీపారి కుద్దు మంత్రికే పాలతోని అభిసేకం జేసింద్రు. నా ఫోట్వకు అభిసేకం జేసింద్రు. గని ఇదువరదాంక ఒక్కడు గుడ్క నాకు పాలతోని అభిసేకం జెయ్యకపాయె. నేనేమన్న మంత్రి కన్న తక్వనా అని ముఖ్యమంత్రి మనసుల అనుకున్నడు.''

''కాంగ్రెస్ లీడర్లు అందరం కల్సి ఉన్నమని జెప్పెతందుకు ఒక్క తీర్గ కోషిష్ జేస్తుంటరు. బట్టి విక్రమార్క పాదయాత్ర జేస్తున్నడు గదా. గాయనకు నేను ముందుగాల్ల పూలదండ ఏస్త అనుకుంట కాంగ్రెస్ లీడర్లు కొట్లాడుకుంద్రు.''

''బస్సు యాత్ర జేస్తె నేనె కిట్కి పక్కన గూసుంట అంటె నేను కిట్కి పక్కన గూసుంట అని కొట్లాడ్తరేమొ.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.త్రయోదశి ఉ.8.36 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: కృత్తిక ప.3.25 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.8.06 నుండి 8.58 వరకు తదుపరి ప.12.26 నుండి 1.19 వరకు, అమృతఘడియలు: ప.1.01 నుండి 2.34 వరకు, రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.29, సూర్యాస్తమయం: 6.31.

క్లుప్తంగా...

7 నుంచి పాతబస్తీ బోనాలు

చాంద్రాయణగుట్ట (హైదరాబాద్): తెలంగాణలో అత్యంత వైభవంగా నిర్వహించే పాత బస్తీ లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను జూలై 7న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 16న తెల్లవారుజామున బలిహరణ, దేవి అభిషేకం, అనంతరం బోనాల సమర్పణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 17వ తేదీ మధ్యాహ్నం పోతరాజు స్వాగతం, 4 గంటలకు భవిష్యవాణిని వినిపించే రంగం కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. 23వ తేదీన మారుబోనం, అమ్మ ప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ నెల 19, 20, 21 తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 19న ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆలయ 115 ఏళ్ల చరిత్రకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 20న ఇండియా గేట్ నుంచి అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి తెలంగాణ భవన్‌లో ప్రతిష్ఠాపన చేస్తామని తెలిపారు. 21న ఉదయం 11 గంటలకు పోతరాజు స్వాగతం, బోనాల సమర్పణ, అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగిస్తామన్నారు.

నిమ్స్ సరే.. ఉస్మానియా సంగతేమిటి?: షర్మిల



సాక్షి, హైదరాబాద్: 'నిమ్స్ విస్తరణకు కొబ్బరికాయ కొట్టారు సరే.. గత శంకుస్థాపనల సంగతి ఏంటో జర చెప్పు సారూ' అంటూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. రూ.15 వందల కోట్లతో కడతామని చెప్పిన ఉస్మానియా దవాఖానా ట్విన్ టవర్స్ ఎక్కడని నిలదీశారు. కొబ్బరికాయ కొట్టి 14 నెలలైనా పునాదిరాయి పడకపాయే అన్నారు. హైదరాబాద్ నలుమూలల నాలుగు పెద్దాసుపత్రులు ఎక్కడో చెప్పాలన్నారు. 'కార్పొరేట్ వైద్యం ఏమాయే.. ఎయిమ్స్‌ను మించిన ట్రీట్మెంట్ కనపడదాయే'అని ఎద్దేవా చేశారు. దొర విలాసాలకు కొత్త సచివాలయం మీద పెట్టిన శ్రద్ధ ప్రజల ఆరోగ్యం మీద లేదని విమర్శించారు. కొబ్బరికాయలు, శంకుస్థాపనలు.. ఇదే కేసీఆర్ 10 ఏళ్లలో సాధించిన ఆరోగ్య తెలంగాణ అని వ్యాఖ్యానించారు. కమీషన్లకు కాళేశ్వరం మీద పెట్టిన దృష్టి వైద్యాభివృద్ధి మీద లేదన్నారు. కరోనా కంటే మించిన వైరస్‌లు వస్తాయనడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తూ.. కేసీఆర్ పాలనకు మించిన వైరస్ ఏదీ రాదన్నారు.

కోటి మంది మహిళలకు బతుకమ్మ చీరలు

సిరిసిల్ల: రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు బతుకమ్మ చీరలను అందిస్తామని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీపీటీడీసీ) చైర్మన్ గూడూరి ప్రవీణ్ తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో బతుకమ్మ చీరల సేకరణకు గురువారం శ్రీకారం చుట్టారు. సిరిసిల్లలోని నేతకార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లను నేత కార్మికులకు ఇచ్చారని, 139 మ్యాక్స్ సంఘాలు, 127 ఎస్ఎస్ఐ యూనిట్ల ద్వారా 5.60 కోట్ల మీటర్ల బతుకమ్మ చీరల బట్టను ఉత్పత్తి చేస్తున్నామని ఆయన వివరించారు. రూ.350 కోట్ల విలువైన బతుకమ్మ చీరలను బార్డర్ అంచులతో నేతకార్మికులు ఉత్పత్తి చేశారని పేర్కొన్నారు. ఈసారి బతుకమ్మ పండుగకు ముందే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చీరలు చేరుతాయని ప్రవీణ్ వెల్లడించారు.

'పేదల ఇళ్ల స్థలాల కోసం 18 నుంచి బస్సు యాత్ర'

సాక్షి, హైదరాబాద్: పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం ఈ నెల 18 నుంచి 27 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించనున్నామని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక (డీవైఎఫ్ఐ) కన్వీనర్ ఎస్ వీరయ్య, ప్రధాన కార్యదర్శి టి సాగర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలు వేసుకున్న అన్ని గుడిసె కేంద్రాలను ఈ బస్సు యాత్రలో సందర్శించి వారికి అండగా నిలబడతామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్సు యాత్ర జూన్ 18న మహబూబ్‌బాద్‌లో బహిరంగసభతో ప్రారంభమవుతుందని, ఈ సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుతారన్నారు. జూన్ 27న రంగారెడ్డి జిల్లాలో బహిరంగ సభతో యాత్ర ముగుస్తుందని చెప్పారు.

పతంజలి ఆయిల్ పామ్ ప్లాంటేషన్

సాక్షి, హైదరాబాద్: పతంజలి ఫుడ్స్ భారీగా ఆయిల్ ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఆత్మనిర్భర మిషన్‌లో భాగంగా 64వేల హెక్టార్లలో ఈ సాగుకు నిర్ణయించినట్టు ఒక ప్రకటనలో తెలిసింది. వచ్చే ఐదేళ్లలో ప్లాంటేషన్ విస్తీర్ణాన్ని 0.4 మిలియన్ హెక్టార్లకు పెంచాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వివరించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా 4 లక్షల మంది రైతులకు తమ మద్దతు లభిస్తుందని, ఈశాన్య ప్రాంతంలోనూ ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం తమ కు దేశంలో 26 నర్సరీలు ఉన్నాయని తెలిపింది.

'అంధ'మైన వనం!

పార్కు అంటే అందరికీ ఆహ్లాదం కలిగించేదే. కానీ లోకాన్ని చూడలేని అంధులు పార్కుకు వెళితే.. ఎలా నడవాలి, ఎటు వెళ్లాలి? ఊయలలోనో, మరో ఆట పరికరంపైనో పడిపోకుండా ఎలా ఆహ్లాదం పొందాలి? ఇలాంటి ప్రశ్నల నేపథ్యంలోనే.. ఖమ్మంలోని వినూత్నమైన పార్కును సిద్ధం చేశారు. అంధులైన చిన్నారులతోపాటు ఇతర దివ్యాంగులు, వయో వృద్ధులకు సౌకర్యవంతంగా ఉండేలా అభివృద్ధి చేశారు. అంధుల కోసం ప్రత్యేక లిపిని సృష్టించిన లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని కూడా ఇందులో ఏర్పాటు చేశారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మంత్రి పువ్వాడ అజయ్ ప్రారంభించనున్న ఈ పార్కు విశేషాలివీ..

- ఖమ్మం మయూరి సెంటర్



పార్కులో ఏర్పాటు చేసిన సంగీత పరికరాలు



పడిపోకుండా..
పట్టుకోల్పోకుండా..

ఖమ్మంలో అంధుల కోసం ప్రత్యేక పార్కు

- నేరుగా ముందుకెళ్లడం, దారి మార్చుకోవడాన్ని సూచించేలా భిన్నమైన టైల్స్
- పంచతత్వ విభాగంలో సులువుగా నడిచేలా ఏర్పాట్లు
- పడిపోకుండా ఊగేలా ఊయల, ఇతర పరికరాలు
- విభిన్నమైన సంగీత పరికరాలు, మరెన్నో సౌకర్యాలు కూడా..



అంధుల కోసం ప్రత్యేక టైల్స్‌తో రూపొందించిన వాకింగ్ ట్రాక్

సులువుగా నడిచేలా..

చేతికర్ర సాయంతో నడిచే అంధులు పార్కులో ఇబ్బంది పడకుండా వాకింగ్ ట్రాక్‌పై ప్రత్యేక టైల్స్ ఏర్పాటు చేయించారు. దారిలో ముందుకు వెళ్లాలని సూచించేలా పొడవుగా ఉండే బుడిపెలతో కూడిన టైల్స్‌ను ట్రాక్ మధ్యలో పెట్టారు. మలుపు తీసుకోవాల్సిన చోట, మధ్యలో పక్క నుంచి మరోదారి ఉన్న చోట.. ఈ విషయాన్ని గుర్తించగలిగేలా చిన్న బుడిపెలతో కూడిన 'అలర్ట్ టైల్స్'ను ఏర్పాటు చేశారు. చేతికర్ర, లేదా పాదాలతో తాకడం ద్వారా అంధులు వీటిని గుర్తిస్తూ.. సులువుగా నడిచి వెళ్లేందుకు వీలుంటుంది.

అంధులతోపాటు ఇతర దివ్యాంగులు, వయో వృద్ధులకు కూడా ప్రయోజనకరంగా ఉండేలా ఆట వస్తువులను ఈ పార్కులో ఏర్పాటు చేశారు. సీ-సా (రెండు వైపులా ఇద్దరు కూర్చుని పైకి కింది ఊగే పరికరం), ఊయల, జారుడు బల్ల వంటి వాటికి.. రెండు పక్కలా, వెనకాల కుర్చీల తరహాలో పట్టుకునేలా తయారు చేయించారు.

- పార్కులో ఏర్పాటు చేసిన పంచతత్వ విభాగం (ఇసుక, సన్నని రాళ్లు, గడ్డి, సాధారణ మట్టి, నీళ్లు.. ఇలా ఐదు రకాలతో కూడిన వాకింగ్ ట్రాక్)లో కూడా రెండు వైపులా ఇనుప కడ్డీలను అమర్చారు. అంధులతోపాటు వయో వృద్ధులు వాటిని పట్టుకుని సులువుగా నడవడానికి వీలవుతుంది.

ప్రత్యేక సంగీత పరికరాలు కూడా..

దివ్యాంగులు, అంధులు మరింత ఏకాగ్రత సాధించేందుకు మ్యూజిక్ థెరపీ ఉపయోగపడుతుందని చెప్తుంటారు. ఈ క్రమంలో పార్కులో వారికోసం ప్రత్యేకంగా సంగీత పరికరాలను ఏర్పాటు చేశారు. కాండెజా, కాంగస్ డ్రమ్స్, సోప్రానో పెంటాటోనిక్, బెబల్ డ్రమ్ వంటి వాయిద్య పరికరాలను అమర్చారు. ఇక పార్క్ ఆవరణలో స్థానిక కార్పొరేటర్ మక్బూల్ సొంత నిధులతో చిన్న గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేయించారు.

రెండోరోజూ ఐటీ సోదాలు

- బీఆర్ఎస్ నేతల వ్యాపారాల్లో పన్నుల ఎగవేతపై ఆరా
- ఎమ్మెల్యేలు మర్రి, పైళ్లకు చెందిన కంపెనీల ఐదేళ్ల ఆర్థిక లావాదేవీల పరిశీలన



ఆర్‌కేపురం గ్రీన్‌హిల్స్ కాలనీలోని పైళ్ల శేఖర్‌రెడ్డి నివాసం

సాక్షి, హైదరాబాద్/దిల్‌సుఖ్‌నగర్/ముషీరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో బుధవారం మొదలైన ఐటీ సోదాలు గురువారం రెండోరోజూ కొనసాగాయి. జూబ్లీహిల్స్‌లోని రోడ్డు నంబర్ 36లో ఉన్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంటితోపాటు కొత్తపేటలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో ఉన్న భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇంట్లోనూ సోదాలు జరిగాయి. తనిఖీల్లో వారి కంపెనీలకు చెందిన బ్యాంకు ఖాతాలు, లాకర్లు, బ్యాలెన్స్ షీట్లను అధికారులు సేకరించారు. ఒక్కో కంపెనీకి చెందిన ఐదేళ్ల ఆర్థిక లావాదేవీల రికార్డులను పరిశీలించారు.

ఉమ్మడి వ్యాపారాలపై దృష్టి...

పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి కలసి చేసిన రియల్ ఎస్టేట్, మైనింగ్ సహా ఇతర వ్యాపారాలపై ఐటీ శాఖ దృష్టి పెట్టింది. ఇందులో హిల్ ల్యాండ్, మైన్స్‌ల్యాండ్, తీర్థ ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్, శ్రీలార్వెన్ సిండికేట్ సంస్థల్లో ఈ ముగ్గురికీ చెందిన కుటుంబ సభ్యులే భాగస్వాములుగా ఉండటంతో ఇందుకు సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు సేకరిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరులో సాగించిన వెంచర్లు, విల్లాల అమ్మకాల్లో నగదు రూపంలో జరిగిన లావాదేవీలపైనా ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలు వారి కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్న బ్యాంకు లాకర్లను గుర్తించి తెరవగా కీలక డాక్యుమెంట్లు, విలువైన ఆభరణాలు బయటపడ్డట్లు తెలిసింది. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి బ్యాంకు లాకర్స్‌ను సైతం అధికారులు తెరిపించారు. పన్నుల ఎగవేతపై ఆరా తీశారు.

సోదాలయ్యాక వారి సంగతి చూస్తా: ఎమ్మెల్యే మర్రి

ఐటీ దాడులను వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నినాదాలు చేయగా తన ఇంటి నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి ఐటీ అధికారులు వారి పని చేస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మరోవైపు తమ సిబ్బందిని ఐటీ అధికారులు బెదిరించారని... కొందరిపై చేయి చేసుకున్నారని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. అధికారులకు చేయి చేసుకొనే హక్కు లేదని... అలా జరిగితే తాము కూడా తిరిగి దాడులు చేస్తామని హెచ్చరించారు. సోదాలు ముగిశాక వారి సంగతి చూస్తామన్నారు. కాగా, ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కొండపల్లి మాధవ్ నివాసంపై బుధవారం ఉదయం 5 గంటలకు మొదలైన ఐటీ దాడులు రాత్రి 12 గంటలకు ముగిశాయి. తన ఇంటిపై ఐటీ దాడులు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని మాధవ్ ఆరోపించారు.

'ప్రగతీ' మనదే.. అవార్డులూ మనవే..

- 'పల్లెప్రగతి'వేడుకల్లో మంత్రి ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్/గన్‌ఫౌండ్రి: పల్లెప్రగతి వంటి కార్యక్రమాలు దేశంలో ఎక్కడా లేవని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో మంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి పల్లెప్రగతి దినోత్సవం ఘనంగా జరిగింది. ఎర్రబెల్లి మాట్లాడుతూ 2014 నుండి 2022 వరకు జాతీయస్థాయిలో 81 అవార్డులు సాధించామని, 2023లో కేంద్రం ప్రకటించిన 46 జాతీయ పంచాయతీ అవార్డుల్లో 13 తెలంగాణకే దక్కాయన్నారు. ఇంకా స్వచ్ఛభారత్ మిషన్‌లో 28, రూర్బన్ మిషన్‌లో 2 అవార్డులు తెలంగాణ దక్కించుకోగా, సంసద్ ఆదర్శ యోజనలో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, డైరెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. పల్లెప్రగతి వేడుకల సందర్భంగా రవీంద్రభారతితో తొమ్మిదేళ్లలో తెలంగాణ పల్లెల్లో చోటుచేసుకున్న మార్పులపై ఏర్పాటుచేసిన వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మిషన్ భగీరథ పథకం నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



మట్టి పాత్రలను చేస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి తదితరులు

మేడిగడ్డ బ్యాక్‌వాటర్‌పై మహారాష్ట్ర అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్ వల్ల తమ భూభాగంలో ఏర్పడిన ముంపు ప్రభావంపై చర్చించేందుకు తక్షణమే అంతర్రాష్ట్ర మండలి (ఇంటర్‌స్టేట్ బోర్డు) సమావేశం నిర్వహించాలని మహారాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది. చివరిసారిగా 2016 ఆగస్టు 23న నిర్వహించిన ఇంటర్‌స్టేట్ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఏడేళ్లు గడిచినా అమలు చేయకపోవడాన్ని తప్పుబట్టింది. ఈ మేరకు మహారాష్ట్ర జలవనరుల శాఖ తాజాగా తెలంగాణ నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. 2022 జూలైలో గోదావరికి వచ్చిన భారీ వరదలో మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్ వల్ల మహారాష్ట్రలోని సిరోంచ, ఇతర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని స్పష్టం చేసింది. వరదలు సంభవించి ఏడాది గడుస్తున్నా రక్షణ చర్యలు తీసుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. మేడిగడ్డ బ్యారేజీకి మహారాష్ట్రలో భూసేకరణ కోసం రూ. 25.64 కోట్లను గడ్చిరోలి జిల్లా కలెక్టర్‌కు 2016లో జమ చేయాల్సి ఉండగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదని ఆరోపించింది. 2022 జూలైలో వచ్చిన వరదలను ప్రామాణికంగా తీసుకొని మేడిగడ్డ బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం జరపాలని కోరింది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి రెండు రాష్ట్రాల మధ్య గతంలో జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పందాన్ని సవరించడం ద్వారా వార్ధా బ్యారేజీ నిర్మాణానికి సమ్మతి తెలపాలని ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రకు లేఖ రాయగా, ఆ రాష్ట్రం మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్ ప్రభావం అంశాన్ని తెరపైకి తీసుకురావడం గమనార్హం.

11 ఎకరాలు హక్కుదారులవే

- హైదర్‌నగర్ భూములపై తేల్చిన సుప్రీంకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వం, ట్రినిటీ సంస్థ పిటిషన్లు కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మొత్తం 196.20 ఎకరాల్లోని 11 ఎకరాలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే విచారణలో పరిగణనలోకి తీసుకొని ఆయా భూములు హక్కుదారులవేనన్న హైకోర్టు తీర్పును సమర్థించింది. మిగిలిన భూములకు హక్కుదారులు తేల్చాలంటే పలు చట్టాలు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. దీంతో, కోర్టు ముందున్న పార్టీషన్ సూట్‌లో టైటిల్ నిర్ణయం చేయట్లేదని స్పష్టంచేసింది. భూములు తమవే అంటూ తెలంగాణ ప్రభుత్వం, గోల్డ్‌స్టోన్ (ట్రినిటీ) సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లు కొట్టివేసింది. తమ మాతృక భూములంటూ కొంతమంది దాఖలు చేసిన పిటిషన్లు కొట్టివేసింది. నిజాం కాలంలో సాగుచేసినట్లుగా పట్టాలున్న వారి నుంచి కొనుగోలు చేసిన వారికే భూములపై హక్కులుంటాయన్న హైకోర్టు తీర్పును సమర్థించింది. జస్టిస్ వి.రామసుబ్రమణియం, జస్టిస్ పంకజ్ మిత్తల్ ఇచ్చిన ఈ తీర్పులో నిజాం కాలం నాటి ఔట్ సోర్సింగ్, పైఘా ఎస్టేట్, పర్వానా, సనద్‌ల కింద భూములివ్వడం వంటి అంశాలు ప్రస్తావించింది. హైదరాబాద్ నగర శివారులోని హైదర్‌నగర్‌లో సర్వే నంబర్ 172లోని 196.20 ఎకరాలకు సంబంధించి ఏడు దశాబ్దాలుగా వివాదం నడుస్తోంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ భూములు తమవేనంటూ ట్రినిటీ సంస్థ, తెలంగాణ ప్రభుత్వంతోపాటు పలువురు దాఖలు చేసిన పిటిషన్లు విచారించిన ధర్మాసనం పై తీర్పు వెలువరించింది.

'రాష్ట్రంలో బతుకు భారంగా మారింది'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తామని చెప్పుకున్న సీఎం కేసీఆర్ చివరికి బొందల తెలంగాణగా మార్చారని టీటీడీపీ ధ్వజమెత్తింది. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, అధికార ప్రతినిధి ఎ.ఎస్.రావు, తెలుగు మహిళ అధ్యక్షురాలు షకీలా రెడ్డి మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్లు ఖర్చు చేసి ప్రకటనలు ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, వాస్తవ పరిస్థితిని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఒక డైరెక్టర్, ఇద్దరు హీరోయిన్లు!

- చాటింగ్ చేసిన కేపీ చౌదరి
- గుర్తించిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: టాలీవుడ్ పరిశ్రమలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. కబాలీ తెలుగు సినిమా నిర్మాత కృష్ణ ప్రసాద్ చౌదరి అలియాస్ కేపీ చౌదరి గోవా నుంచి హైదరాబాద్‌కు 82.75 గ్రాముల కొకైన్‌ను సరఫరా చేస్తూ సైబరాబాద్ పోలీసులకు చిక్కిన సంగతి తెలిసిందే. నిందితుడు కేపీ చౌదరి నుంచి స్వాధీనం చేసుకున్న నాలుగు సెల్‌ఫోన్లలోని డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటికే పలువురు సినీ సెలబ్రిటీలతో ఫొటోలు, పార్టీ వీడియోలను పోలీసులు గుర్తించారు. గోవాతో పాటు హైదరాబాద్‌లో కిస్మత్‌పూర్‌లోని విల్లాలో కూడా ప్రైవేట్ పార్టీలు నిర్వహించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఆయా ప్రముఖులు, సెలబ్రిటీల జాబితాను పోలీసులు సిద్ధం చేస్తున్నారు.

ఎలా దొరికాడంటే..: గత నెల 5న మాదాపూర్ స్పెషల్ ఆపరేషన్ టీం, రాయదుర్గం పోలీసు లు నానక్‌రాంగూడ సమీపంలో 300 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



ఈ కేసులో ప్రధాన నిందితు డు రాకేష్ రోషన్ వాట్సాప్ ద్వారా కేపీ చౌదరి లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతని కదలికలపై నిఘా పెట్టిన సైబరాబాద్ పోలీసులు.. బుధవారం కిస్మత్‌పూర్ క్రాస్ రోడ్‌లో కొకైన్‌ను సరఫరా చేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

900 మందికిపైగా కస్టమర్లు: రాకేష్, కేపీ చౌదరిల నుంచి స్వాధీనం చేసుకున్న 9 సెల్‌ఫోన్లను పోలీసులు విశ్లేషిస్తున్నారు. వీటిల్లో 900 మందికి పైగా కస్టమర్లతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఒక డైరెక్టర్, ఇద్దరు హీరోయిన్లు, నలుగురు మహిళా ఆర్టిస్టులతో వాట్సాప్ చాటింగ్‌లు, పలు లావాదేవీలు సైతం జరిపినట్లు పోలీసులు గుర్తించారు. కేపీ చౌదరికి డ్రగ్స్ సరఫరా చేసిన నైజీరియాకు చెందిన గ్యాబ్రియల్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అతన్ని పట్టుకుంటే కేసులో వినియోగదారులు అందరూ పట్టుబడతారని, నోటీసులు జారీ చేసి వారిని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు..

యాక్సిడెంట్లో తనయుడు.. ఆత్మహత్య చేసుకుని తండ్రి

- టిప్పర్ లారీ రూపంలో కుమారుడిని కబళించిన మృత్యువు.. తట్టుకోలేక తండ్రి బలవన్మరణం
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో విషాద ఘటన



తులసీరాం (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రేమించిన అమ్మాయిని మనువాడేందుకు పెద్దలను ఒప్పించాడు. సంతోషంగా నిశ్చితార్థం చేసుకుని.. ఆ శుభ కార్యక్రమానికి వచ్చిన బంధువును ఊళ్లో దిగబెట్టి వస్తూ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఇది తట్టుకోలేని అతని తండ్రి పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటనలు గురువారం కొమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని సామెల గ్రామంలో చోటుచేసుకున్నాయి. గ్రామానికి చెందిన వసాకే తులసీరాం(21) అదే ఊరికి చెందిన యువతిని ప్రేమించగా, ఇరు కుటుంబాల అంగీకారంతో బుధవారం నిశ్చితార్థం జరిగింది. దీనికి హాజరైన బంధువుల్లో ఒకరైన ఆసిఫాబాద్ మండలం ఎల్లారానికి చెందిన అంజన్నను గురువారం స్కూటీపై అతడి గ్రామంలో దింపి తులసీరాం ఇంటికి బయలుదేరాడు. బుదల్‌ఘాట్ వాగు దాటిన తర్వాత జైత్‌పూర్ రోడ్డు వద్ద కంకర క్రషర్ సమీపంలో జాతీయ రహదారి- 363పై వేగంగా వచ్చిన డీబీఎల్ కంపెనీకి చెందిన టిప్పర్ స్కూటీని ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. లారీ టైర్ల కింద స్కూటీ ఇరుక్కుపోగా తులసీరాం అక్కడికక్కడే మృతిచెందాడు.

కొడుకు మృతి తట్టుకోలేక: కుమారుడి మరణ వార్త విన్న తండ్రి భీంరావు(45) తీవ్ర మనస్తాపంతో ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. స్థానికులు అంబులెన్స్‌లో ఆసిఫాబాద్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

తనయుడికి తాయత్తు కట్టించి వస్తూ...

- ఇసుక ట్రాక్టర్ ఢీకొని తండ్రీకొడుకుల దుర్మరణం
- సింగరేణి శ్రీరాంపూర్ వద్ద 363 హైవేపై దుర్ఘటన



సూర్యతేజ(ఫైల్)



రమేశ్(ఫైల్)

శ్రీరాంపూర్: రోడ్డు దాటుతున్న మోటార్‌సైకిల్‌ను అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో తండ్రీకొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం సింగరేణి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద 363 జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామానికి చెందిన దర్నాల రమేశ్, అతడి భార్య వెన్నెల, కుమారుడు సూర్యతేజ ముగ్గురూ కలిసి ఒకే మోటార్‌సైకిల్‌పై గోదావరిఖనికి వెళ్లారు. సూర్యతేజకు ఇటీవల ఒంట్లో నలతగా ఉండటంతో అక్కడ ఓ భూత వైద్యుడికి చూపించి తాయత్తు కట్టించి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో శ్రీరాంపూర్ నుంచి ఇందారం వైపు సిమెంటు బస్తాల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో రమేశ్(40) నడుం కింది భాగం నుజ్జునుజ్జు కాగా, సూర్యతేజ(12)కు ఛాతీలో బలంగా తాకడంతో ఇద్దరూ కొద్ది నిమిషాల్లోనే మృత్యువాతపడ్డారు. వెన్నెలకు రెండు కాళ్లు, ఎడమ చేయి విరిగి తీవ్ర రక్తస్రావం కావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. శ్రీరాంపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

వంట నూనెలపై దిగుమతి సుంకం తగ్గింపు

ధరల నియంత్రణకు కేంద్రం నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా పెరుగుతున్న వంట నూనెల ధరలను తగ్గించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రిఫైన్డ్ సోయాబీన్, రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ నూనెలపై ఉన్న దిగుమతి సుంకాన్ని 17.5 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపు వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. దేశీయ విపణిలో వంటనూనెల ధరలను తగ్గించేందుకు గతంలో తీసుకున్న చర్యలకు ఈ నిర్ణయం తోడ్పడనుందని శాఖ వెల్లడించింది. వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని చివరిసారిగా 2021 అక్టోబర్‌లో 32.5% నుంచి 17.5%కి తగ్గించింది.

మతమార్పిడి నిరోధక చట్టం రద్దు


ప్రకటించిన కర్ణాటక కాంగ్రెస్ సర్కార్

బెంగళూరు: కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మత మార్పిడి నిరోధక చట్టాన్ని రద్దు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. జూలైలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెడతామని సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం తెలిపింది. 'మత మార్పిడి నిరోధక బిల్లుపై మంత్రివర్గం చర్చించింది. 2022లో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 3 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో దీనిని ప్రవేశపెడతాం' అని రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ గురువారం తెలిపారు. సామూహికంగా, తప్పుడుమార్గాల్లో బలవంతంగా చేపట్టే మత మార్పిడులను శిక్షార్హం చేస్తూ గత ఏడాది సెప్టెంబర్‌లో బీజేపీ ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలిసిందే.

నితీశ్‌కు తప్పిన ప్రమాదం



పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం పాట్నాలోని తన నివాసం సమీపంలో మార్నింగ్ వాక్ చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై ఆయనకు అత్యంత సమీపంలోకి దూసుకురావడం తీవ్ర కలకలం సృష్టించింది. రోడ్డుపై నడుస్తుండగా అకస్మాత్తుగా మోటార్ సైకిల్ వేగంగా తనవైపు దూసుకురావడం గమనించిన నితీశ్ వెంటనే అప్రమత్తమై పక్కనున్న ఫుట్‌పాత్‌పైకి చేరుకున్నారు. లేకపోతే పెను ప్రమాదమే జరిగేదని సమాచారం. దేశ్‌రత్నా మార్గ్‌లో ఉదయం 6.40 గంటలకు ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు మైనర్లని, వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నామని తెలిపారు. వారు ఎవరన్నది పోలీసులు బయటపెట్టలేదు. సదరు మైనర్లు ఉదయం 5.40 గంటలకు బంగారం చైన్ దొంగతనం చేసి, ఎవరికీ దొరకకూడదన్న ఉద్దేశంతో అటువైపు వేగంగా వచ్చినట్లు వెల్లడించారు.



ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఆడిన పవర్ గేమ్ సొంత పార్టీలోనే చీలికలు తెచ్చేలా కనబడుతోంది. ప్రజాకర్షణ కలిగిన నాయకుడు, తన అన్న కుమారుడు అజిత్ పవార్ బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నాడన్న ఉప్పందగానే పవార్ ఆయనకు చెక్ చెప్పడానికి తన కుమార్తె సుప్రియా సూలే, కేంద్ర మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్‌లను ఈ నెల 10న కార్యనిర్వాహక అధ్యక్షులుగా ప్రకటించారు. ఈ ప్రకటన కార్యకర్తలకు, నాయకులకు పెద్దగా ఆశ్చర్యం కలిగించనప్పటికీ అజిత్ పవార్ తదుపరి ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్సీపీ రజతోత్సవాలు జరుపుకుంటున్న వేళ పవార్ తన కుమార్తెకే పార్టీ పగ్గాలు అప్పగించడం చూస్తుంటే ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కోవడానికి సిద్ధపడినట్టుగా కనిపిస్తోంది. పార్టీని స్థాపించిన ఈ 25 ఏళ్లలో శరద్ పవార్ తీసుకున్న ఈ నిర్ణయం అంత ఆషామాషీదేమీ కాదు. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో పార్టీలో గట్టి పట్టున్న నాయకుడు అజిత్ పవార్ తప్ప మరెవరూ అంతగా కనిపించరు. ఆయనను కాదని ఎవరూ ముందుకు వెళ్లే పరిస్థితి లేదు.





పవార్ 'పవర్' గేమ్..!

ఎన్సీపీలో చీలికలు తెస్తుందా?

సుప్రియా సూలే సవాళ్లను ఎదుర్కోగలరా? ● అజిత్ పవార్ అడుగులు ఎటు?

పార్టీలో చీలిక తప్పదా?

ఒకప్పుడు శరద్ పవార్ వారసుడిగా అజిత్ పవార్‌నే చూసేవారు. పార్టీలో సెకండ్ పొజిషన్‌ను అనుభవించారు. వివాదరహితుగా పేరు తెచ్చుకున్నారు. కొన్నాళ్ల క్రితం బీజేపీలో దూకడానికి అజిత్ పవార్ ఎమ్మెల్యేలతో కలిసి మంతనాలు సాగిస్తున్నారన్న ఊహాగానాలు వచ్చాయి. ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంటూ ముంబై నగర వీధుల్లో పోస్టర్లు వెలిశాయి. రాజకీయాల్లో తలపండిన శరద్ పవార్ ఇవన్నీ పార్టీకి ముప్పు తెస్తాయని భావించి అత్యంత నాటకీయంగా ఎన్సీపీ జాతీయ అధ్యక్ష పదవి నుంచి తాను వైదొలుగుతున్నట్టు ప్రకటించి అందరికీ షాక్ ఇచ్చారు. ఆ తర్వాత కార్యకర్తలు, ఇతర నాయకులు పట్టుబట్టడంతో ఉద్వేగ భరిత వాతావరణంలో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పార్టీపై ఎప్పటికీ పట్టు తనదేనన్న సంకేతాలను అజిత్ పవార్‌కు పంపారు. ఇది జరిగిన కొద్ది వారాలకే శరద్ పవార్ తన కుమార్తెకే నేరుగా పార్టీ పగ్గాలు అప్పగించి మరో పవర్ గేమ్ మొదలు పెట్టారు. సుప్రియకు పార్టీ బాధ్యతలు అప్పగించడంపై తనకెలాంటి అసంతృప్తి లేదని అజిత్ పవార్ బయటకి చెబుతున్నప్పటికీ ఆయన రాష్ట్రంలో మరో ఏక్‌నాథ్ షిండేలా మారే అవకాశాలున్నాయన్న చర్చ జరుగుతోంది. అజిత్ పవార్ పార్టీని చీలుస్తారా లేదా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్సీపీకి 53 మంది సభ్యుల బలం ఉంది. అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ కలిసి ఎమ్మెల్యేలను తమ వైపు లాక్కొనే వ్యూహరచన చేయడంతో శరద్ పవార్ వ్యూహాత్మకంగా అజిత్‌ను బలహీనపరచడం కోసం పటేల్‌కు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే త్వరలోనే అజిత్ పవార్ తీసుకునే నిర్ణయాలు మహారాష్ట్ర రాజకీయాల్లోనే కీలకమైన మార్పులు తీసుకువస్తాయని రాజకీయ విశ్లేషకుడు విజయ్ క్రోమర్ వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత అజిత్ పవార్ ఎన్సీపీపై చేసిన తిరుగుబాటు విఫలమైంది. బీజేపీ నేత ఫడ్నవీస్ సీఎంగా, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ఏర్పాటైన ప్రభుత్వం మూడు రోజుల్లోనే కూలిపోయిన విషయం తెలిసిందే. కొందరు ఈ ఉదంతాన్ని ఉదాహరణగా చూపిస్తూ ముఖ్యమంత్రి కావాలన్న అజిత్ పవార్ కల నెరవేరాలంటే ఎన్సీపీలో ఉంటేనే సాధ్యపడుతుందని, బీజేపీతో చేతులు కలిపితే సాధ్యం కాదన్న విషయం ఆయనకీ తెలుసునని అంటున్నారు. మొత్తమ్మీద అజిత్ పవార్ వేసే అడుగులే ఆయన భవిష్యత్, ఎన్సీపీ భవిష్యత్‌ని నిర్దేశించడంతో పాటు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్ని కూడా శాసించబోతున్నాయి.

సుప్రియ ఎదుట సవాళ్లు..!

సుప్రియ సూలే గత 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఒక ఎంపీగా ఆమె జాతీయ రాజకీయాల్లోనే కీలక పాత్ర పోషించారు. అజిత్ పవార్ మాదిరిగా ఆమెకి రాష్ట్ర రాజకీయాల్లో పట్టు లేదు. నాయకత్వ లక్షణాలు కూడా ఇప్పటివరకు ఎక్కడా ప్రదర్శించే అవకాశం రాలేదు. వచ్చే ఏడాది అత్యంత కీలకమైన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టిక్కెట్ల పంపిణీ, పార్టీలో అసమ్మతుల బుజ్జగింపు, ఎన్నికల్లో వ్యూహరచనలు వంటివన్నీ ఆమె ఎలా నిర్వహించగలరనే సందేహాలైతే ఉన్నాయి. సుప్రియ నియామకంతో పార్టీకి ఒక అర్బన్ ఇమేజ్ వచ్చిందేమో కానీ, అజిత్ పవార్ మాదిరిగా గ్రామాల్లోకి చొచ్చుకుపోయి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే సామర్థ్యం లేదు. అయితే తండ్రి మాదిరిగానే సుప్రియకు ఎలాంటి సంక్షోభాన్నయినా తట్టుకునే నిలబడే సామర్థ్యం ఉందన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

అజిత్ పవార్ క్రౌడ్ పుల్లర్

అజిత్ పవార్ తన చిన్నాన్న శరద్ పవార్ అడుగు జాడల్లో నడుస్తూ 1982లో తన 20 ఏళ్ల వయసులోనే రాజకీయాల్లోకి వచ్చారు. చక్కెర సహకార సంఘాల ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గారు. 1991లో తొలిసారిగా ఎన్సీపీ తరఫున బారామతి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత పవార్ కోసం ఆ సీటుని వదులుకొని మహారాష్ట్ర అసెంబ్లీకి పోటీ చేశారు. అప్పట్నుంచి రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యారు. బారామతి అసెంబ్లీ సీటు నుంచి ఓటమి లేకుండా ఎన్నికవుతూనే ఉన్నారు. 2012, 2014లో ఉప ముఖ్యమంత్రిగా పని చేసి పాలనలోనూ తన సామర్థ్యాన్ని ప్రదర్శించారు. కార్యకర్తల్ని ప్రేమగా పలకరించడం, నాయకులతో మంతనాలు, తాను చెప్పదలచుకున్నదేదో సూటిగా స్పష్టంగా చెప్పడం, గ్రామాల్లో ఉన్న పట్టు వంటివెన్నో ఆయనను క్రౌడ్ పుల్లర్‌గా మార్చాయి.

-సాక్షి, నేషనల్ డెస్క్

ఈడీ అరెస్ట్ వేళ సెంథిల్ తలకు గాయం?

పరామర్శ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ సభ్యుడికి సెంథిల్ ఫిర్యాదు

సాక్షి, చెన్నై: ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలపై నమోదైన కేసులో తమిళనాడు విద్యుత్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీని అరెస్ట్‌చేసినపుడు ఈడీ ఆయన పట్ల అత్యంత దురుసుగా ప్రవర్తించిందా అనే అనుమానాలను తమిళనాడు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(టీఎన్ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యుడొకరు వ్యక్తంచేశారు. అదే జరిగితే ఆ అంశాన్ని టీఎస్ఎస్‌హెచ్‌ఆర్‌సీ తప్పక పరిశీలిస్తుందని సంస్థ సభ్యుడు కన్నదాసన్ చెప్పారు. రవాణా శాఖలో ఉద్యోగాలిప్పిస్తానంటూ పలువురి నుంచి భారీఎత్తున నగదు తీసుకున్నారనే ఆరోపణలపై సెంథిల్‌ను విచారించిన ఈడీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి దాటాక అరెస్ట్ చేశారు. అరెస్ట్‌వేళ సెంథిల్ బిగ్గరగా రోదించడం, వెంటనే ఆస్పత్రిలో చేర్పించి యాంజియోగ్రామ్ చేయించడం, గుండె నాళంలో బ్లాక్‌లను గుర్తించడం విదితమే. అయితే అర్ధరాత్రి అరెస్ట్ సందర్భంగా తన పట్ల ఈడీ అధికారులు దురుసుగా ప్రవర్తించారని తనను ఆస్పత్రికి కలవడానికి వచ్చిన కన్నదాసన్‌కు సెంథిల్ ఫిర్యాదుచేశారు. 'ఈడ్చుకెళ్లారని ఆయన చెప్పన్నారు. లాక్కెళ్లినపుడే ఆయన తలకు గాయమైందట. ఈడీ దురుసు ప్రవర్తన అంశాన్ని టీఎన్ఎస్‌హెచ్‌ఆర్‌సీ పరిశీలిస్తుంది' అని కన్నదాసన్ చెప్పారు. కాగా, చెన్నై ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను కావేరి ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్సకు అనుమతి ఇవ్వాలని మంత్రి భార్య మేఘల మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కావేరి ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్స, వైద్య సేవలకు చర్యలు తీసుకోవాలని కోర్టు ఈడీ అధికారులను ఆదేశించింది.



రెచ్చ గొట్టొద్దు: కేంద్రంపై స్టాలిన్ ఫైర్

ఈడీ దాడులు, మంత్రి అరెస్టు నేపథ్యంలో డీఎంకే చీఫ్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ట్విట్టర్ ఖాతాలో ఒక వీడియో పోస్ట్‌చేశారు. 'డీఎంకే వాడిని. రెచ్చగొట్టొద్దు తట్టుకోలేరు' అని కేంద్రాన్ని హెచ్చరించారు. కరుణానిధి చేసిన హెచ్చరికలను ఉటంకిస్తూ.. 'డీఎంకే వాళ్లు తిప్పి కొట్టడం మొదలెడితే భరించలేరు. రాజకీయంగా ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు మేం చేయని రాజకీయాలు లేవు. మేం చూడని పోరాటాలు లేవు. ఒకసారి చరిత్రను చూసుకోండి' అని హెచ్చరించారు. 'ఇది బెదిరింపు కాదు. హెచ్చరిక' అని అన్నారు. సెంథిల్ అరెస్ట్‌పై స్పందించారు. 'ఈడీ ద్వారానే రాజకీయాలు చేద్దామని బీజేపీ చూస్తోంది. ఈడీని అడ్డుపెట్టుకుని పదేళ్ల నాటి పాత కేసులో మానసికంగా, శారీరకంగా సెంథిల్‌ను వేధిస్తున్నారు. ఈడీ అధికారులు పెట్టిన మానసిక ఒత్తిడితోనే ఆయనకు హృద్రోగ సమస్యలొచ్చాయి. 18 గంటలు నిర్బంధించిమరీ ప్రశ్నల పరంపర కొనసాగించారు. ఎవ్వరినీ కలవనివ్వలేదు. దాంతో ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించాక ఆస్పత్రికి తరలించారు' అని ఆరోపించారు.

పార్లమెంట్‌లో లైంగిక వేధింపులు

- ఆస్ట్రేలియా ఎంపీ లిడియా థోర్ప్ సంచలన ఆరోపణలు
- ఎంపీ డేవిడ్ వాన్‌ను సస్పెండ్ చేసిన లిబరల్ పార్టీ



సిడ్నీ: పార్లమెంట్ భవనం సాక్షిగా తనపై లైంగిక వేధింపులు జరిగాయని ఆస్ట్రేలియా మహిళా ఎంపీ లిడియా థోర్ప్ గురువారం సంచలన ఆరోపణలు చేశారు. మహిళలు పనిచేసేందుకు పార్లమెంట్ సురక్షితమైన చోటు కాదని పేర్కొన్నారు. పలుకుబడి కలిగిన ఒక నేత తనపట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ, తాకరాని చోట తాకుతూ కోరిక తీర్చాలంటూ వేధించేవారంటూ లిబరల్ పార్టీ ఎంపీ డేవిడ్ వాన్ పేరును ఆమె పార్లమెంట్‌లో ప్రస్తావించారు. బుధవారం పార్లమెంట్‌లో ఇవే ఆరోపణలను థోర్ప్ చేయగా డేవిడ్ వాన్ ఖండించారు. థోర్ప్ ఆరోపణలతో షాక్‌కు గురయ్యాయనని, అవి పూర్తిగా అవాస్తవమని మీడియాతో అన్నారు. పార్లమెంట్ ఆంక్షలు విధిస్తుందనే భయంతో వాటిని వెనక్కి తీసుకుంటున్న ప్రకటించారు. గురువారం థోర్ప్ ఇవే ఆరోపణలు మరోసారి చేశారు. 'పార్లమెంట్ భవనంలోని నా ఆఫీసు నుంచి బయటకు ఒంటరిగా రావాలంటేనే భయమేసేది. తోడుగా ఒకరిని వెంటబెట్టుకుని భవనంలో తిరిగేదాన్ని. ఇలాంటి అనుభవాలను చాలామందే ఎదుర్కొన్నా. తమ కెరీర్‌పై ప్రభావం పడుతుందనే ఎవరూ బయటకు రావడం లేదు'అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ఆరోపణలతో వాన్‌ను లిబరల్ పార్టీ సస్పెండ్ చేసింది. 2019 మార్చిలో బ్రిటనీ హిగ్గిన్స్ అనే పార్టీ కార్యకర్తపై తోటి కార్యకర్త పార్లమెంట్ కార్యాలయం గదిలోనే అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ ఘటనపై విచారణ ఇప్పటికీ ముందుకు పడలేదు. దీనిపై బుధవారం ఎంపీ వాన్ ఖండిస్తూ ప్రసంగిస్తుండగానే స్వతంత్ర ఎంపీ లిడియా థోర్ప్ అడ్డుతగులుతూ ఆయనపై ఆరోపణలు చేశారు. ఆస్ట్రేలియా పార్లమెంట్ మహిళా సభ్యుల్లోని 63 శాతం మంది ఏదో ఒక విధమైన వేధింపులకు గురవుతున్నారంటూ ప్రభుత్వం నియమించిన కమిటీ తేల్చడం గమనార్హం.

తీరాన్ని తాకిన భీకర బిపర్‌జోయ్

గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్ర తీర ప్రాంతాల్లో కుంభవృష్టి

కచ్(గుజరాత్)/న్యూఢిల్లీ: అరేబియా సముద్రంలో పది రోజులకుపైగా ప్రచండ వేగంతో సుడులు తిరుగుతూ భీకర గాలులతో పెను భయాలు సృష్టించిన బిపర్‌జోయ్ తుపాను ఎట్టకేలకు గురువారం సాయంత్రం గుజరాత్‌లో తీరాన్ని తాకింది. దాదాపు 50 కిలోమీటర్ల వెడల్పు ఉన్న తుపాను కేంద్రస్థానం(సైక్లోన్ ఐ) సాయంత్రం 4.30 గంటలకు తీరాన్ని తాకగా పూర్తిగా తీరాన్ని దాటి భూభాగం మీదకు రావడానికి ఆరు గంటల సమయం పడుతుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తుపాను కచ్ జిల్లాలోని జఖౌ పోర్ట్ సమీపంలో తీరం దాటి దాని ప్రతాపం చూపిస్తోంది. ఖచ్, దేవభూమి ద్వారక, ఓఖా, నలియా, భుజ్, పోర్‌బందర్, కాండ్లా, అమ్రేలీ జిల్లాల్లో గురువారం ఉదయం నుంచే కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. కచ్ జిల్లాలోని జఖౌ, మండ్వీ పట్టణాల్లో పెద్ద సంఖ్యలో చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. నిర్మాణ దశలో ఉన్న చిన్నపాటి ఇళ్లు కూలిపోయాయి. గురువారం రాత్రి ఏడింటికి అందిన సమాచారం మేరకు ఎక్కడా ప్రాణనష్టం లేదని గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ చెప్పారు. దేవభూమి ద్వారక జిల్లాలో చెట్టు మీదపడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి.

లక్ష మంది సురక్షిత ప్రాంతాలకు

తీర ప్రాంతాలకు చెందిన లక్ష మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 15 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 12 రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, భారత వాయు సేన, నేవీ, ఆర్మీ బలగాలు, తీరగస్తీ దళాలు, బీఎస్ఎఫ్ సిబ్బంది తుపాను సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. 'కచ్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, పోర్‌బందర్, రాజ్‌కోట్, మోర్బీ, జునాగఢ్ జిల్లాల్లో 25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. ముంపు ప్రాంతాల్లో వరద బీభత్సం ఉండొచ్చు. పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్‌సరఫరా దెబ్బతినే ప్రమాదముంది. దాదాపు 14 మీటర్ల ఎత్తున అలలు ఎగసిపడొచ్చు' అని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర చెప్పారు. నష్టం జరగొచ్చనే భయంతో ముందస్తుగా సముద్రప్రాంతంలో చమురు అన్వేషణ, నౌకల రాకపోకలు, చేపల వేటను నిలిపేశారు.



గురువారం కచ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

నష్టం తగ్గించేందుకు..

తుపాను కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాన్ని వీలైనంతమేర తగ్గించేందుకు ఎన్డీఆర్ఎఫ్ పలు చర్యలు తీసుకుంది. చేపల పడవల్ని దూరంగా లంగరు వేశారు. భారీ నౌకలను సముద్రంలో చాలా సుదూరాలకు పంపేశారు. ఉప్పు కార్మికులు, గర్భిణులుసహా లక్ష మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 4,000 భారీ హోర్డింగ్‌లను తొలగించారు. గుజరాత్, మహారాష్ట్రలో 33 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయని ఎన్డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అతుల్ కార్వాల్ చెప్పారు. ఎడతెగని వానలకు జలమయమయ్యే ముంపుప్రాంతాల ప్రజలను తరలించేందుకు రబ్బరు బోట్లను సిద్ధంచేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బందిని పురమాయించారు. ఉత్తర దిశలో పంజాబ్ బలగాలో, తూర్పున ఒడిశాలో, దక్షిణాన చెన్నై అరక్కోణంలో ఇలా తుపాను ప్రభావం ఉండే అవకాశమున్న ప్రతీ చోటా వాయుసేన అప్రమత్తంగా ఉన్నారు.

ఐరాసలో 'మెమోరియల్ వాల్'

ఐక్యరాజ్యసమితి: విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన శాంతిదూతల గౌరవార్థం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో 'మెమోరియల్ వాల్' నెలకొల్పాలని కోరుతూ భారత్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాన్ని ఐరాస సాధారణ సభ(యూఎన్‌జీఏ) బుధవారం ఆమోదించింది. భారత్ ప్రతిపాదన పట్ల ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ఐరాసలో భారత ప్రతినిధి రుచిరా కాంబోజ్ 'మెమోరియల్ వాల్ ఫర్ ఫాలెన్ యునైటెడ్ నేషన్స్ పీస్‌కీపర్స్' పేరిట ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బంగ్లాదేశ్, కెనడా, చైనా, డెన్మార్క్, ఈజిప్ట్, ఫ్రాన్స్, ఇండోనేషియా, జోర్డాన్, నేపాల్, రువాండా, అమెరికా తదితర 18 దేశాలు బలపర్చాయి. దాదాపు 190 సభ్యదేశాలు మద్దతిచ్చాయి. ఐరాస శాంతిదళంలో భారత్ గణనీయమైన పాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం భారత్ నుంచి 6,000 మందికిపైగా జవాన్లు, పోలీసులు ఈ శాంతిదళంలో పనిచేస్తున్నారు. శాంతిదళంలో పనిచేస్తూ ఇప్పటిదాకా 177 మంది భారత జవాన్లు, పోలీసులు అమరులయ్యారు. ఏ ఇతర దేశానికి చెందినవారూ ఇంతమంది చనిపోలేదు. శాంతిదళానికి జవాన్లు, సైనికులను అందించడంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. తీర్మానాన్ని ఐరాస సాధారణ సభ ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్లలో వాల్ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది.

బోరిస్ కావాలనే తప్పుదోవ పట్టించారు



లండన్: బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ పార్లమెంట్‌ను ఉద్దేశపూర్వకంగా పదేపదే తప్పుదోవ పట్టించారని పార్లమెంటరీ కమిటీ ఆరోపించింది. ప్రధానిగా ఉండగా కోవిడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసంలో జరిగిన విందుల గురించి తనకు తెలియదనడంపై ఈ వ్యాఖ్యలు చేసింది. కోవిడ్ సమయంలో జరిగిన విందులనే పార్టీ గేట్ కుంభకోణంగా పేర్కొంటున్నారు. 'సభను ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించిన జాన్సన్ తీవ్రమైన ధిక్కారానికి పాల్పడ్డారని భావిస్తున్నాం. ఈ ధిక్కారం మరింత తీవ్రమైంది'అని పార్లమెంట్ హక్కుల కమిటీ పేర్కొంది. పార్లమెంటరీ కమిటీ సభ్యులు తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపిస్తూ జాన్సన్ ఇటీవల ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో జాన్సన్ చేసిన వ్యాఖ్యలపైనా కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు ఆయన్ను 90 రోజుల పాటు బహిష్కరించాలని సూచించింది. రాజీనామా చేసినందున..మాజీ సభ్యులకిచ్చే పాస్‌ను జాన్సన్‌కు ఇవ్వొద్దని పేర్కొంది.

తల్లి, ఐదుగురు చిన్నారులు సజీవదహనం

కుషినగర్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్ జిల్లాలో బుధవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటికి నిప్పంటుకుని ఇంట్లో నిద్రిస్తున్న తల్లి, అయిదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారులంతా 1–10 ఏళ్లలోపు వారే. ఉర్ధా గ్రామానికి చెందిన సంగీత, ఆమె అయిదుగురు పిల్లలు ఇంట్లో పడుకోగా, ఆమె భర్త, అతడి తల్లిదండ్రులు ఆరు బయట నిద్రించారు. గాఢ నిద్రలో ఉండగా అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. మంటలు అంటుకోవడంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలింది. సంగీత భర్త వారిని కాపాడేందుకు ప్రయత్నించినా మంటల తీవ్రత కారణంగా వీలు కాలేదు.సంగీతతోపాటు ఏడాది నుంచి 10 ఏళ్ల వరకు వయస్సున్న చిన్నారులు మంటలకు ఆహుతయ్యారు. ఫైరింజన్ వచ్చే సరికే ఈ ఘోరం జరిగిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

బడుగు వర్గాలపై ప్రధాని మోదీ కక్ష సాధింపు


న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్(ఓఎంఎస్ఎస్) కింద రాష్ట్రాలకు ఇచ్చే బియ్యం, గోధుమలను ఇకపై ఇవ్వకుండా కేంద్రం నిలిపివేయడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గురువారం తప్పుపట్టారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడంతో ప్రధాని మోదీ మనోవేదనకు గురవుతున్నారని, అందుకే బడుగు వర్గాల ప్రజలపై కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పేదల వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ సీనియర్ నేత రణదీప్ సూర్జేవాలా ఆరోపించారు. కర్ణాటకకు కేంద్రం బియ్యం ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడాన్ని మోదీ సహించలేకపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్రాలకు సెంట్రల్ పూల్ నుంచి బియ్యం, గోధుమల పంపిణీని కేంద్రం నిలిపివేసింది. పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు ఇస్తామని హామీ ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వం దీనివల్ల నష్టపోనుంది.

రెండు క్షిపణులను పరీక్షించిన ఉత్తరకొరియా

సియోల్: అమెరికా, దక్షిణ కొరియాల సంయుక్త సైనిక విన్యాసాలు ముగిసిన వేళ ఉత్తర కొరియా గురువారం రెండు తక్కువ శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించింది. ఉభయ కొరియాల సరిహద్దుల్లో భారీగా కొనసాగిన అయిదో విడత సైనిక విన్యాసాలపై ఉత్తరకొరియా గుర్రుగా ఉంది. ఇటువంటి రెచ్చగొట్టే చర్యలపై తాము ఏదో ఒక రీతిలో తప్పక స్పందిస్తామని ఆ దేశ సైన్యం ఇప్పటికే ప్రకటించింది. తాజాగా, గురువారం సాయంత్రం ఆ దేశ రాజధాని ప్రాంతం నుంచి తూర్పు సముద్ర జలాలపైకి రెండు స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు గుర్తించామని దక్షిణ కొరియా సైన్యం ప్రకటించింది.

801 గ్రాముల బరువు ● 13.37 సెం.మీ.ల పొడవు

గిన్నిస్ రికార్డుకెక్కిన కిడ్నీ స్టోన్



కొలంబో: ఈ నెల ఒకటో తేదీన శ్రీలంక రాజధాని కొలంబోలో సైనిక ఆసుపత్రిలో ఓ రోగి కిడ్నీ నుంచి అతిపెద్ద రాయిని డాక్టర్లు విజయవంతంగా బయటకుతీశారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటిదాకా బయటపడ్డ కిడ్నీ స్టోన్స్‌లో ఇదే పెద్ద రాయిగా రికార్డుకెక్కింది. ఈ రాయి బరువు 801 గ్రాములు, పొడవు 13.37 సెంటీమీటరు. ఇది రెండు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టడం గమనార్హం. 2004లో భారతదేశంలో 13 సెంటీమీటర్ల పొడవున్న కిడ్నీ స్టోన్‌ను, 2008లో పాకిస్తాన్‌లో 620 గ్రాముల బరువున్న రాయిని బయటకు తీశారు. శ్రీలంకలో వెలికితీసిన రాయి ఆ రెండింటినీ అధిగమించింది.

హెగ్డేవార్, సావర్కర్ చాప్టర్ల తొలగింపు

బెంగళూరు: ఆరు నుంచి పదో తరగతి వరకు కన్నడ, సాంఘిక శాస్త్రాల పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాల్లో మార్పులకు కాంగ్రెస్ నేతృత్వంలోని కర్ణాటక రాష్ట్ర మంత్రి మండలి గురువారం ఆమోదముద్ర వేసింది. కేబినెట్ నిర్ణయాల మేరకు ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు కేబీ హెగ్డేవార్, హిందూత్వ సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్ తదితరులకు సంబంధించిన పాఠ్యాంశాలను స్కూలు సిలబస్ నుంచి తొలగిస్తారు. సంఘ సంస్కర్త, విద్యావేత్త సావిత్రీభాయ్ పూలే సంబంధ పాఠ్యాంశాలు, ఇందిరా గాంధీకి నెహ్రూ రాసిన లేఖలు, అంబేడ్కర్ కవితలు తదితరాలను గతంలో బీజేపీ సర్కార్ తొలగించింది. వాటినే మళ్లీ కలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం చేసిన సవరణలను పూర్తిగా రద్దుచేయాలని కేబినెట్ భేటీలో మంత్రులు నిర్ణయించారు. 'విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సర సిలబస్‌లోనూ మార్పులు ఉంటాయి' అని కేబినెట్ వివరాలను మంత్రి వెల్లడించారు.

మా పేర్లూ తీసేయండి

న్యూఢిల్లీ: తమ అభిప్రాయాలతో ఏమాత్రం పనిలేకుండా ఇష్టానుసారంగా స్కూల్ పాఠ్యాంశాలను తొలగిస్తున్నారంటూ జాతీయ విద్యా, పరిశోధనా శిక్షణ మండలి(ఎన్సీఈఆర్‌టీ)కి 33 మంది విద్యావేత్తలు తాజాగా లేఖ రాశారు. పాఠ్యపుస్తకాల అభివృద్ధి కమిటీ(టీడీసీ) సభ్యత్వ జాబితాలో ఉన్న తమ పేర్లను తొలగించాలంటూ ఎన్సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ సక్లానీకి లేఖ రాశారు. 'ఎలాంటి హేతుబద్ధత లేకుండా పాఠ్యాంశ భాగాలను తీసేసి భారీ మార్పులు చేశారు. స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగ రూపకల్పన తదితర కీలకాంశాలను పాఠ్యాంశాలుగా రూపొందించాం. ఒరిజినల్ టెక్స్ట్‌కు సంబంధంలేనంతగా మార్పులు చేశారు. ఇవి మేం రాసిన పుస్తకాలే అని చెప్పుకునేందుకు, వీటితో అనుబంధం ఉందని భావించేందుకు మాకు కష్టంగా ఉంది. మా సమష్టి సృజనాత్మక కృషిని డోలాయమానంలో పడేశారు' అని లేఖలో పేర్కొన్నారు.



లెబనాన్‌లో ద్రవ్యోల్బణం.. కష్టజీవుల ఆగ్రహానికి నిదర్శనమీ చిత్రం. పొదుపు మొత్తాల ఉపసంహరణపై బ్యాంక్‌లు ఆంక్షలు విధించడంతో గిన్నె, అప్పడాల కర్ర, చెంచాలతో ఓ పెద్దావిడ బ్యాంక్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం. గురువారం బీరుట్‌లోని బిబ్లోస్ బ్యాంక్ బయట తీసిందీ ఫొటో.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 16 । జూన్ । 2023

మైనారిటీ కమిషన్ సభ్యుడిగా హిమాన్షు బాప్నా



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడిగా జైన సమాజ్‌కు చెందిన హిమాన్షు బాప్నా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.



లొకేషన్ ఆధారంగా 1930 రెస్పాన్స్!

సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన వారికి సహాయం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన 1930 నెంబర్ హెల్ప్‌లైన్ సాంకేతిక పరిజ్ఞానం అప్‌డేట్ అయింది. -8లో

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
38.6°	26.9°

న్యూస్‌రీల్

ఎన్టీపీసీతో ఉస్మానియా ఆస్పత్రి ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: వైద్య పరికరాల ఏర్పాటుకు సహకరించే దిశగా ఉస్మానియా జనరల్ ఆస్పత్రితో ఎన్టీపీసీ చేతులు కలిపింది. ఈ మేరకు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ఉస్మానియా ఆస్పత్రితో ఒప్పందం చేసుకుంది. ఇది రోగులకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంలో సహాయపడుతుందని ఎన్టీపీసీ ప్రతినిధులు, ఉస్మానియా ఆస్పత్రి అభివృద్ధి సూపరింటెండెంట్ బి.నాగేందర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీకి చెందిన సవ్యసాచి పాధి పాల్గొన్నారు.

'అది విష్ణుకుండినుల నాటి వైద్య శాసనమే'

సైదాబాద్: నల్లగొండ జిల్లా పానగల్లులోని మ్యూజియంలో భద్రపరిచిన 5వ శతాబ్దానికి చెందిన రాగి ఫలకం వైద్యశాసనానికి చెందినదిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ అధికారులు గుర్తించారు. సైదాబాద్‌లోని సంస్థ ఇన్‌చార్జి డాక్టర్ జీపీ ప్రసాద్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ జి.వెంకటరత్నం బృందంతో గురువారం మ్యూజియంలోని శాసనాన్ని పరిశీలించారు. 5వ శతాబ్దం నాటి విష్ణుకుండినుల వంశానికి చెందిన గోవింద వర్మ రాజు ఎర్రమడలు, పెంకపారు గ్రామాలను జబ్బుపడిన వారికి మందులు సరఫరా చేయడానికి దానం చేసినట్లుగా శాసనంలో వివరించినట్లు అధికారులు తెలిపారు. అధికారుల బృందంలోని నిపుణులు శాసనం ఛాయా చిత్రాలు, ఎస్టాంపేజ్‌లను సేకరించారు. పురాతన కాలంలో రాజులు, చక్రవర్తులు ప్రజారోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని ఈ శాసనం ద్వారా తెలుస్తోందని సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్ అభిప్రాయపడ్డారు.

'ఫైలు కదలాలంటే చేయి తడపాల్సిందే'

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏలో అవినీతి బాగా పెరిగిందని, లంచాలు ఇస్తే తప్ప ఫైళ్లు కదలడం లేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవైపు హెచ్‌ఎండీఏలో భారీగా ఫీజులు, మరోవైపు పెద్దఎత్తున వసూలు చేస్తున్న లంచాలతో భూముల ధరలు సైతంపెరుగుతున్నాయని పేర్కొంది. హెచ్‌ఎండీఏలో అడుగడుగునా లంచావతారాలే ఉన్నారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి తెలిపారు. లంచాలను అరికట్టాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. 'హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. నగరం చుట్టుపక్కల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సగటు నగర జీవి ఇంటిస్థలం కొనుక్కునే పరిస్థితి లేదు. భూముల ధరలు బాగా పెరగడానికి ఈ లంచాలు కూడా ఒక కారణం'అని లేఖలో పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏలో పనిచేసే అధికారులు, సిబ్బంది భూమి విలువను బట్టి లంచాల రేటును నిర్ణయిస్తున్నట్లు ఆరోపించారు.









దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రవీంద్ర భారతిలో పల్లె ప్రగతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిదేళ్లలో పల్లెసీమల్లో వచ్చిన మార్పులను తెలిపే పలు నమూనా సెట్టింగులు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. - గన్‌ఫౌండ్రీ

పట్నంలో పల్లె!



'లక్ష' పాట్లు!

రూ.లక్ష ఆర్థిక చేయూతకు పడరాని తిప్పలు

- దరఖాస్తుల కోసం ఉరుకులు పరుగులు
- తహసీల్ కార్యాలయాలకు ధ్రువీకరణ పత్రాల తాకిడి
- రద్దీగా మీ సేవ కేంద్రాలు.. సర్వర్ డౌన్ సమస్య.. బ్రోకర్ల దందా



సాక్షి, సిటీబ్యూరో: బీసీ కుల వృత్తిదారులు ఆర్థిక చేయూత 'రూ.లక్ష' కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా వెనుకబడిన వర్గాల కులవృత్తులు, చేతివృత్తి దారులకు వంద శాతం సబ్సిడీ కింద రూ.లక్ష ఆర్థిక రుణ సాయం ప్రకటించడంతో ఆశలు చిగురించాయి. దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా మారడంతో ఉరుకులు పరుగులు ప్రారంభమయ్యాయి. మీ సేవ కేంద్రాల వద్ద కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునే జనం తాకిడి పెరిగింది. ఒకేసారి సర్వర్‌పై భారం పడి నెమ్మదిగా నడవడంతోపాటు చిటికీమాటికీ మొరాయిస్తోంది. అర్జీదారులు ఆన్‌లైన్ నమోదు అనంతరం స్థానిక తహసీల్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. రెవెన్యూ సిబ్బంది ఇతరాత్ర పనుల్లో బిజీగా ఉండటం, మరోవైపు సర్వర్ సాంకేతిక సమస్యలతో ధ్రువీకరణ పత్రాల ఆమోదం మొరాయిస్తోంది. గత వారం రోజులుగా తహసీల్ ఆఫీసుల వద్ద ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు కాస్తున్నా.. ఫలితం లేకుండా పోతోంది. సందట్లో సడేమియా మాదిరిగా బ్రోకర్లు ధ్రువీకరణ పత్రాలు త్వరగా జారీ చేయిస్తామని దరఖాస్తుదారుల వద్ద ఇష్టానుసారం దండుకుంటున్నారు.

సర్వర్ ట్రబుల్

ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ సర్వర్ ముప్పుతిప్పలు పెడుతోంది, దరఖాస్తులు స్వీకరించేందుకు బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించినప్పటికీ దరఖాస్తుల ప్రక్రియ మాత్రం నత్తలకు నడక నేర్పిస్తోంది. మీ సేవ, ఈ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుదారులు చేసేందుకు ఒకే సారి పోటీ పడుతుండటంతో సర్వర్ ట్రబుల్ ఇస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 వరకు మాత్రమే గడువు ఉండటంతో ఆందోళన చెందుతున్నారు.

15 కులాలకు చేయూత

వెనుక బడిన వర్గాలకు చెందిన 15 కులాలకు ఆర్థిక సహాయం వర్తించనుంది. నాయి బ్రాహ్మణ, రజక, సాగర, ఉప్పర, శాలివాహన, జాసుల, కాంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి,బలిజ, మేదర, వెడ్డెర, అరెకటిక, మేరా, ఎంబీసీ కులాలకు వర్తించనుంది.

చార్జీల బాదుడు

మీ సేవ కేంఅద్రాల నిర్వాహకులు ఇష్టానుసారం చార్జీలను బాదేస్తున్నారు. నిబంధనల ప్రకారం కుల, ఆదాయ, ఆర్థిక చేయూత ఇతరత్రా దరఖాస్తు చేసుకునేందుకు రుసుం రూ.45 ఉంటుంది. ఒకేసారి దరఖాస్తుల తాకిడి పెరగడంతో ఒక దరఖాస్తుకు రూ.150 నుంచి 250 వరకు వసూలు చేయడం సర్వసాధారణంగా తయారైంది. మీ సేవ రసీదుపై రూ. 45 ఉన్నప్పటికి వసూళ్లు మాత్రం అధికంగా ఉంటున్నాయని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

సవాలక్ష కొర్రీలు

ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం సవాలక్ష కొర్రీలు తప్పడం లేదు. వాస్తవంగా రూ. లక్ష ఆర్థిక సహాయం కోసం అర్హస్‌కు చెందిన కుటుంబాలకు వార్షికాదాయం 2 లక్షలు మించకూడదు. రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు మాత్రమే ఆదాయ ధ్రువీకరణ పత్రానికి అర్హులు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకొని తహసీల్దార్ కార్యాలయాల్లో వాటి పత్రులు సమర్పించి చక్కర్లు చేస్తున్నా.. సకాలంలో మంజూరైన దఖాలాలు మాత్రం కనిపించడం లేదు. కుల ధ్రువీకరణ పత్రాల పరిస్థితి ఇదే విధంగా తయారైంది.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఎన్నికల అధికారి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌తో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు, ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. వ్యాపార కేంద్రాలు, మాల్స్, ప్రధాన మార్కెట్లు తదితర ప్రాంతాల్లో ఓటర్లను చైతన్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లకు చెందిన ప్రజలు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ చొరవ తీసుకోవాలన్నారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (హైసియా), క్రెడాయ్, ట్రెడా, ఫిక్కీ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులతోనూ వికాస్‌రాజ్ సమావేశమయ్యారు.

నగరంలో నకిలీ మందుల తయారీ

గడువు ముగిసిన 11 వేల కిలోల ముడి సరుకు పట్టివేత

- డ్రగ్స్ ఇండియా మహావీరే యజమాని ఉమేష్ బాబూలాల్ అరెస్టు
- రూ.కోటి విలువ చేసే నకిలీ మందులు స్వాధీనం



ఎస్ఓటీ ఎల్బీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఔషధాల తయారీ ముడి సరుకులు



నిందితుడు ఉమేష్

సాక్షి, సిటీబ్యూరో: ఔషధాల తయారీకి అవసరమైన ముడి సరుకులను అక్రమంగా తరలించి, నిల్వ చేసిన గోదాంపై రాచకొండ పోలీసులు దాడులు చేసి నిందితుడిని పట్టుకున్నారు. రూ.కోటి విలువ చేసే గడువు ముగిసిన 11 వేల కిలోల ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్ఓటీ) ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.



- గుజరాత్‌కు చెందిన ఉమేష్ బాబూలాల్‌కు నగరంలోని కొత్తపేట ఫణిగిరి కాలనీలో డ్రగ్ ఇండియా మహావీరే పేరుతో ఫార్మాస్యూటికల్ కంపెనీ ఉంది. చైతన్యపురి ఠాణా పరిధిలోని మారుతీనగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని గోదాం ఏర్పాటు చేశాడు. ఔషధాల తయారీలో వినియోగించే ముడి సరుకులను కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి నగరానికి అక్రమంగా దిగుమతి చేసుకొని గోదాంలో నిల్వ ఉంచాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, ఉప్పల్ డ్రగ్ అధికారులు గోదాంపై దాడులు చేశారు. డిక్లోఫెనాక్ సోడియం, పారాసెటమాల్, నికోటినామైడ్, ఆస్కార్బిక్ ఆమ్లం, నియాసినామైడ్, ఎసిటమైనోఫెన్, ఆల్బెండజోల్‌తో పాటు గడువు ముగిసిన క్రాస్కార్మెలోస్ సోడియం, మైక్రో క్రెస్టలైన్ సెల్యులోజ్, డై కాల్షియం ఫాస్ఫేట్, కేవా ఫ్లేవర్స్, ఫెర్రస్ సల్ఫేట్, మెగ్నీషియం స్టిరేట్, స్టార్చ్, డ్రై అల్యూమినియం హైడ్రాక్సైడ్ జెల్, లైసిన్ ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఉమేష్‌ను అరెస్టు చేసి డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు అప్పగించారు.

ఎవరికి విక్రయించేందుకు?

నిందితుడు ఉమేష్‌ను పోలీసులు విచారించగా.. స్థానికంగా ఔషధ తయారీ సంస్థలకు విక్రయించేందుకే ఈ ముడి సరుకులను దిగుమతి చేసుకున్నట్లు వెల్లడించినట్లు తెలిసింది. గత పదేళ్లుగా ఈ దందా నిర్వహిస్తుండటంతో నిందితుడి నెట్‌వర్క్ భారీగానే ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కస్టడీలోకి తీసుకొని విచారిస్తే.. పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు. కొన్ని ముడి సరుకులకు ఎలాంటి లేబుల్ లేకపోవటంతో పాటు పొడర్ రూపంలో ఉన్నాయి. వీటిలో మత్తు పదార్థాలు ఉండొచ్చని అనుమానించిన పోలీసులు పరీక్షల నిమిత్తం శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పోలీసులు స్వాధీనం వాటిల్లో 2019లో గడువు ముగిసిన ముడి సరుకులు కూడా ఉండటం గమనార్హం.

డ్రగ్స్ కంట్రోల్ ఎక్కడ?

నగర శివారు ప్రాంతాలలో మందులను తయారు చేసి మార్కెట్లోకి వదులుతున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న మెడికల్ షాపులు, ఔషధ తయారీ సంస్థలు, ముడి సరుకుల సరఫరాలపై నిఘా ఉంచాల్సిన డ్రగ్ కంట్రోల్ విభాగం నిద్ర మత్తులో జోగుతుండటంతో అక్రమార్కుల ఆగడాలు కొనసాగుతున్నాయి. పోలీసుల తనిఖీలకు చిక్కకుండా లారీలు, ట్రక్‌లలో తరలిస్తూ.. ఎవరికీ అనుమానం రాకుండా పండ్లు, కూరగాయలు, దాణా వంటి ఇతరత్రా ఉత్పత్తుల మాటున ఈ ముడి సరుకుల సంచులను ఉంచి, అక్రమంగా సరఫరా చేస్తున్నారు. కాటేదాన్, పాశమైలారం, బాలానగర్, ఉప్పల్ వంటి పారిశ్రామిక వాడలలో మూతపడిన కంపెనీలు, చిన్నాచితకా ఫార్మా కంపెనీలలో అక్రమంగా నకిలీ మందులను తయారు చేస్తున్నారు.

అంతా గోల్‌మాల్!

హెచ్‌ఎండీఏ ప్లాట్‌లలో నిబంధనలు బేఖాతర్

- సదుపాయాలు లేకుండానే భూముల విక్రయం
- ఆన్‌లైన్‌లో ఊరించి ఉసూరుమనిపించి
- తొర్రూరు, బాచుపల్లి, మేడిపల్లిల్లోని లే అవుట్ల దుస్థితి ఇదీ..



బాచుపల్లిలోని హెచ్‌ఎండీఏ ప్లాట్లు

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా ఒక రియల్టర్ వెంచర్ వేసి ప్లాట్‌లను విక్రయించాలంటే రోడ్లు, పారిశుధ్యం, వీధిదీపాలు, పార్కులు, మంచినీటి సదుపాయం తదితర మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేయాల్సిందే. నిబంధనల మేరకు నిర్ణీత గడువు లోగా వసతులు కల్పిస్తేనే హెచ్‌ఎండీఏ నుంచి అన్ని అనుమతులు లభిస్తాయి. అప్పటి వరకు వెంచర్‌లోని కొన్ని ప్లాట్‌లను హెచ్‌ఎండీఏ వద్ద తనఖా పెట్టాల్సి ఉంటుంది. కానీ.. హెచ్‌ఎండీఏ లే అవుట్‌లకు మాత్రం ఈ నిబంధనలు వర్తించడం లేదు. పూర్తిస్థాయిలో కనీస సదుపాయాలు అభివృద్ధి చేయకుండా ఉప్పల్ భగాయత్‌లో మూడోసారి బిడ్డింగ్‌కు సన్నాహాలు చేపట్టడం పట్ల స్థానికంగా అభ్యంతరాలు వస్తున్నాయి. హయత్‌నగర్ సమీపంలోని తొర్రూరు, ఔటర్‌రింగ్ రోడ్డుకు దగ్గర్లో ఉన్న బాచుపల్లి, ఉప్పల్ సమీపంలోని మేడిపల్లిలో సైతం ఎలాంటి సదుపాయాలు లేకుండానే హెచ్‌ఎండీఏ గోల్‌మాల్ చేసి ప్లాట్‌లను విక్రయించిందని ప్లాట్‌ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి రోడ్లతో మాయ..

- భూముల అమ్మకాల ద్వారా హెచ్‌ఎండీఏ రూ.వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. వివిధ ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏకు ఉన్న వందల ఎకరాల భూముల్లో ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా స్థలాలను విక్రయించారు. హెచ్‌ఎండీఏ స్వయంగా ఏర్పాటు చేసినవి కావడంతో నగరవాసులతో పాటు ఎన్నారైలు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా నమ్మకంతో కొనుగోలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ భూములు విక్రయించిన తరవాత స్థల యజమానుల నమ్మకాన్ని మాత్రం హెచ్‌ఎండీఏ అధికారులు వమ్ము చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- నిర్ణీత గడువు లోపు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి పైపులైన్‌లు, పార్కులు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం మట్టి రోడ్లతో కాలయాపన చేస్తున్నారని బాచుపల్లి హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో ప్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వెంచర్‌లో 133 ప్లాట్‌లను ఏర్పాటు చేశారు. వాటిలో 131 ప్లాట్‌లను విక్రయించగా రూ.148.77 కోట్ల మేర ఆదాయం లభించింది. అలాగే మేడిపల్లిలో మొత్తం 85 ప్లాట్‌లలో 78 ప్లాట్‌లను విక్రయించారు. రూ.111.5 కోట్లు లభించింది. ఈ రెండు లే అవుట్‌లలో ఇప్పటి వరకు మట్టి రోడ్లు తప్ప ఎలాంటి సదుపాయాలు లేవు.

తొర్రూరులో రాళ్లే మిగిలాయి...

హయత్‌నగర్ సమీపంలోని తొర్రూరు లే అవుట్‌లో అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, సింగపూర్ తదితర దేశాల్లో ఉంటున్న వందలాది మంది ఎన్నారైలు ప్లాట్‌లను కొనుగోలు చేశారు. గతేడాది మార్చి నుంచి మూడు దశల్లో 750 ప్లాట్‌లను హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించింది. ఒక్కో ప్లాట్‌కు రూ.కోటి నుంచి రూ.1.2 కోట్ల వరకు చెల్లించి కొనుగోలు చేశారు. మొదటి దశ అమ్మకాలలో 18 నెలల్లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. 15 నెలలు గడుస్తున్నా ఎలాంటి అభివృద్ధి జరగలేదని ప్లాట్‌ల యజమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పట్టించుకోవట్లే..



ఇప్పటి వరకు చాలాసార్లు అధికారులను కలిశాం. ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికిప్పుడు పనులు ప్రారంభించినా మౌలిక వసతులు అభివృద్ధి చేసేందుకు 6 నెలలు పడుతుంది.

– కొండ్రు పురుషోత్తం, తొర్రూరు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఇక బల్దియాలో కొత్త పాలన !

నేటి నుంచే వార్డు వ్యవస్థ

- స్థానికంగానే సమస్యల పరిష్కారం
- కార్యాలయాలను ప్రారంభించనున్న ప్రజాప్రతినిధులు
- కాచిగూడలో ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో నేటినుంచి సరికొత్త పాలన అందుబాటులోకి రానుంది. ఇప్పటి వరకు ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాలు, సర్కిల్ కార్యాలయాలుగా మూడంచెల్లో ఉన్న బల్దియా పాలనలో కొత్తగా స్థానికంగానే సమస్యలు పరిష్కారమయ్యేలా వార్డు పాలన అందుబాటులోకి రానుంది. జీహెచ్‌ఎంసీలో వార్డుల వారీగానే కార్పొరేటర్ల ఎన్నికలు జరిగినప్పటికీ, పాలన మాత్రం వార్డుల వారీగా లేదు. పాలన వికేంద్రీకరణలో భాగంగా నాలుగో అంచెగా ఇకనుంచి వార్డు పాలన అందుబాటులోకి రానుంది. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలు పారిశుద్ధ్యం, దోమలు, రోడ్లపై గుంతలు, వెలగని వీధిదీపాలు తదితర సమస్యల్ని స్థానికంగానే పరిష్కరించుకోగలుగుతారు. వాటికోసం సర్కిల్, జోనల్ కార్యాలయాల దాకా తిరగాల్సిన అవసరం ఉండదు. ఒక్కో పనికి ఒక్కో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. అంతేకాదు.. ఏ పని ఎంత సమయంలో పూర్తి కావాలో సిటిజన్ చార్టర్ సైతం అమలు చేయనున్నారు.

- గ్రేటర్ వ్యాప్తంగా వార్డు కార్యాలయాలను శుక్రవారం ఉదయం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, కార్పొరేటర్లు తదితర ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు. మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ కాచిగూడ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మోండా మార్కెట్ డివిజన్ రెజిమెంటల్ బజార్‌లో, కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలో, గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజార్‌లో..
- హోంమంత్రి మహమూద్‌అలీ అజాంపురాలో, మేయర్ విజయలక్ష్మి బంజారాహిల్స్, హిమాయత్‌నగర్, లింగోజిగూడ, రామంతాపూర్‌లలో వార్డు కార్యాలయాలను, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అమీర్‌పేట బీకేగూడ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది.

నేడు, రేపు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు



హిమాయత్‌నగర్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నగరానికి రానున్న నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను విధిస్తున్నట్లు సిటీ పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆంక్షలు, ట్రాఫిక్ మళ్లింపులు చేస్తున్నట్లు అడిషనల్ సీపీ (నేరాలు, శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు.. 17న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయన్నారు. సీటీఓ జంక్షన్, పీఎన్‌టీ ఫ్లైఓవర్, జంక్షన్, హెచ్‌పీఎస్ స్కూల్ ఔట్‌గేట్, బేగంపేట ఫ్లైఓవర్, గ్రీన్‌ల్యాండ్స్ జంక్షన్, మొనప్ప జంక్షన్, యశోద హాస్పిటల్ రోడ్, ఎంఎంటీఎస్, వివి స్టాట్యూ జంక్షన్, పంజాగుట్ట జంక్షన్, ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. సికింద్రాబాద్ నుంచి వయా బేగంపేట మీదుగా అమీర్‌పేట, మెహిదీపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు ఈ రూట్‌లో రాకుండా అప్పర్ ట్యాంక్‌బండ్ పై నుంచి వెళ్లేందుకు మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. రాజ్‌భవన్ రోడ్, మొనప్ప జంక్షన్, వీవీ స్టాచ్యూ (ఖైరతాబాద్) ఈ మార్గాల్లో రెండు వైపులా రోడ్ క్లోజ్ ఉంటుంది. పంజాగుట్ట రాజ్‌భవన్ క్వార్టర్స్ రోడ్డులో వాహనాలకు అనుమతి లేదు. సీటీఓ జంక్షన్, మినిస్టర్ రోడ్డులో వచ్చే వాహనాలను రసూల్‌పురా జంక్షన్ వద్ద కొంత సమయం పాటు నిలిపివేస్తారు. పంజాగుట్ట, గ్రీన్ ల్యాండ్స్ మీదుగా బేగంపేట ఎయిర్‌పోర్టు మీదుగా వచ్చే వాహనాలను ప్రకాష్‌నగర్ టీ జంక్షన్ వద్ద కొంత సమయం నిలుపుదల చేస్తారు. ఈ రూట్‌లలో ప్రయాణించే వాహనదారులు ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ రూట్‌లలో వెళ్లాలని అడిషనల్ సీపీ (నేరాలు, శాంతిభద్రతలు) విక్రమ్ సింగ్ మాన్ వివరించారు.

పీవీ ఎక్స్‌ప్రెస్ వే పై కారు బోల్తా





రాజేంద్రనగర్: వేగంగా దూసుకువచ్చిన ఓ కారు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై పల్టీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడడం విశేషం. కారు ధ్వంసమైనప్పటికీ అందులో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలు కూడా కాలేదు. వివరాల్లోకి వెళితే.. మెహిదీపట్నం నుంచి ఓ క్యాబ్ డ్రైవర్ గురువారం ఉదయం తన కారులో ప్రయాణికుడిని తీసుకుని శంషాబాద్ వైపు వెళ్తున్నాడు. ఎక్స్‌ప్రెస్‌వే పై 215 పిల్లర్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు ప్రయాణికుడిని స్థానికులు బయటికి తీసి రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. అతివేగం కారణంగానే కారు అదుపు తప్పిందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కారణంగా వాహనాల రాకపోకలు స్తంభించాయి. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రమాదానికి గురైన వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌తో పాటు ప్రయాణికుడికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఇతర వాహనంలో వెళ్లిపోయారు. ఈ ఘటనపై రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ పోలీసులు తెలిపారు.

మిలటరీ మద్యం అక్రమంగా విక్రయం

- పరిచయస్తులైన అధికారుల నుంచి ఖరీదు
- నగరంలోని పలువురికి అమ్ముతున్న వైనం
- యువకుడి అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: మిలటరీలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది కోసం కేటాయిస్తున్న డ్యూటీ ఫ్రీ మద్యాన్ని బయటి మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న యువకుడిని ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను దాదాపు ఎనిమిది నెలలుగా ఈ దందా చేస్తున్నాడని, నిందితుడి నుంచి 14 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు గురువారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ యాదవ్ ఇంటర్మీడియట్ వరకు చదివాడు. ఆపై ఉత్తరాఖండ్, మహారాష్ట్రల్లోని కొన్ని ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేశాడు. ఈస్ట్ మారేడ్‌పల్లిలో జేఆర్ స్పోర్ట్స్ స్టోర్‌లో అతడి సోదరుడు భాగస్వామిగా ఉన్నాడు. అతడి సూచనమేరకు నగరానికి వలసవచ్చిన రాజ్ కుమార్ సఫిల్‌గూడలో ఉంటూ జేఆర్ స్పోర్ట్స్ స్టోర్‌లో పని చేస్తున్నాడు. ఈ దుకాణానికి వచ్చే మిలటరీ అధికారులు, సిబ్బందితో ఇతడికి పరిచయం ఏర్పడింది. ప్రతి నెల డ్యూటీ ఫ్రీ లిక్కర్ కోటా ఉంటుందని తెలుసుకున్నాడు. మద్యం తాగని వారి నుంచి వాటిని ఖరీదు చేసి, బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. మార్కెట్‌లో ఉన్న మద్యం కంటే ఇది తక్కువ రేటు ఉండటంతో అనేక మంది ఖరీదు చేస్తున్నారు. ప్రతి నెలా 7–25 తేదీల మధ్యలో మిలటరీ వారి నుంచి మద్యం తీసుకుని విక్రయించడాన్ని రాజ్ కుమార్ ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఎనిమిది నెలలుగా సాగుతున్న ఈ దందాపై నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు కె.శ్రీకాంత్, బి.అశోక్‌రెడ్డి, పి.జ్ఞానదీప్ వలపన్ని గురువారం రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

రూ. 50 లక్షలతో కొరియర్ బాయ్ పరార్

బంజారాహిల్స్: స్నేహితుడికి ఇవ్వాల్సిన రూ. 50 లక్షల నగదుతో కొరియర్ బాయ్ పరారైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో ఉంటున్న శైలేందర్ సింగ్ బగ్గాకు అమన్ ప్రీత్ సింగ్ అనే ఎలక్ట్రికల్ సామాగ్రి సరఫరా చేసే స్నేహితుడు ఉన్నాడు. ఈ నెల 14న అమన్ ప్రీత్‌సింగ్ తన స్నేహితుడు బగ్గాకు ఫోన్ చేసి రూ. 50 లక్షలు ఇవ్వాలని దానిని తీసుకునేందుకు అంగాడియా కొరియర్ సర్వీసెస్ ప్రతినిధి శర్మ వస్తాడని చెప్పాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే శర్మ బగ్గాకు ఫోన్ చేసి తాను సంతోష్ అనే వ్యక్తిని పంపిస్తున్నానని రూ. 20 నోటు మీద ఓ సీరియల్ నెంబర్ ఉంటుందని ఆ నెంబర్ చూసి ఆయనకు రూ.50 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. బంజారాహిల్స్‌లోని బగ్గా ఇంటికి వచ్చిన సంతోష్ రూ.20 నోటుపైన సీరియల్ నంబర్ చూపించి రూ.50 లక్షలు తీసుకుని వెళ్ళాడు. ఆ తర్వాత శర్మ, సంతోష్‌ల ఫోన్ నెంబర్లు స్విచ్ఛాఫ్ కాగా సదరు నగదు అమన్ ప్రీత్‌సింగ్‌కు చేరలేదని తేలింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శర్మ, సంతోష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లొకేషన్ ఆధారంగా 1930 రెస్పాన్స్!

- ఒకప్పుడు టెలికాం సర్కిల్ బేస్డ్ సేవలు
- ఇబ్బంది పడిన అనేక మంది బాధితులు
- ప్రస్తుతం లొకేషన్ విధానానికి అప్‌డేట్
- ఈ కీలక మార్పుతో 'ఇతరులకు' ఊరట



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన వారికి సహాయం చేసేందుకు కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) ఏర్పాటు చేసిన 1930 నెంబర్ హెల్ప్‌లైన్ సాంకేతిక పరిజ్ఞానం అప్‌డేట్ అయింది. కొద్ది రోజుల క్రితం వరకు టెలికం సర్కిల్ ఆధారంగా ఫోన్ కాల్స్ రూట్ అవుతుండగా... ప్రస్తుతం అది లొకేషన్ ఆధారితంగా మారింది. దీంతో ఓ రాష్ట్రంలో తీసుకున్న ఫోన్ నెంబర్‌తో మరో రాష్ట్రంలో ఉంటున్న బాధితులకు భారీ ఊరట లభించింది.

అహర్నిశలూ అందుబాటులో ఉండేలా...

ఆర్థికంగా నష్టపోయిన సైబర్ క్రైమ్ బాధితులు ఎంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే అంత ఎక్కువ రికవరీకి ఆస్కారం ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఠాణాకు వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు కొంత సమయం పట్టడంతో పాటు పని వేళలు అంశమూ ప్రభావం చూపుతుంది. దీంతో సైబర్ నేరగాళ్లు తాము కాజేసిన మొత్తాన్ని వివిధ బ్యాంకు ఖాతాలు, వాలెట్స్‌లోకి మార్చడమో, డ్రా చేయడమో జరిగేది. ఆపై కేసు నమోదై, నిందితుడు చిక్కినా రికవరీలు సాధ్యమయ్యేవి కాదు. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సైబర్ నేరాల్లో బాధితులకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1930 నెంబర్‌తో హెల్ప్‌లైన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రానికి సంబంధించి బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) ఉన్న తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధీనంలో పని చేస్తోంది.

తీవ్ర జాప్యంతో పాటు ఇబ్బందులు...

ఈ నెంబర్‌కు బాధితుడు చేసే ప్రతి ఫోన్ కాల్ తొలుత గుర్‌గావ్‌లో ఉన్న ప్రధాన కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అక్కడి నుంచే దేశంలోని ఆయా ప్రాంతాల్లోని స్థానిక కాల్ సెంటర్ల రూట్ అవుతుంది. ఇదంతా కొన్ని సెకన్ల సమయంలోనే పూర్తవుతుంది. ఓ ఫోన్ కాల్‌ను ఏ ప్రాంతానికి రూట్ చేయాలనేది కొన్ని రోజుల క్రితం వరకు టెలికం సర్కిల్ ఆధారంగా జరిగేది. అంటే హెల్ప్‌లైన్‌కు కాల్ చేసిన బాధితుడు వినియోగిస్తున్న ఫోన్ నెంబర్ ఏ రాష్ట్రం నుంచి జారీ అయిందో ఆ రాష్ట్రంలోని కాల్ సెంటర్‌కు రూట్ అయ్యేవి. మహారాష్ట్రలో తీసుకున్న ఫోన్ నెంబర్‌ను ఆ వ్యక్తి వేరే రాష్ట్రంలోనూ ఉంటూ వాడుతుండొచ్చు. అయితే ఈ విధానం వల్ల కాల్ మాత్రం మహారాష్ట్రకే రూట్ అయ్యేది. ఈ కారణంగా బాధితుడి నుంచి విషయం తెలుసుకుని మళ్లీ మరో కాల్ సెంటర్‌కు బదిలీ చేయడంతో కొంత జాప్యం, ఇబ్బందులు ఉండేవి. ఈ విషయాన్ని కొందరు బాధితులు ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ద్వారా ఎంహెచ్‌ఏ గుర్తించింది.

సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి...

ఈ తరహా బాధితులు ఫిర్యాదు చేయడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఏర్పడుతున్న జాప్యాన్ని నివారించడానికి ఎంహెచ్‌ఏ గుర్‌గావ్‌లోని ప్రధాన కంట్రోల్ రూమ్ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేసింది. దీన్ని అప్‌డేట్ చేయడం ద్వారా ఫోన్ చేసిన బాధితుడి ఫోన్ నెంబర్‌కు సంబంధించిన టెలికాం సర్కిల్ కాకుండా అతడు ఉన్న లొకేషన్ గుర్తించేలా చేయగలిగింది. దీంతో బాధితుడు ఎక్కడ నుంచి కాల్ చేస్తున్నాడో ఆ రాష్ట్రానికి సంబంధించిన సెంటర్‌కే ఈ కాల్ రూట్ అవడం ప్రారంభమైంది. ఫలితంగా ఫోన్ చేసిన వ్యక్తికి ఇబ్బంది, జాప్యం రెండూ తగ్గాయి. 1930కు కాల్ చేసిన ఇతర నేరాల బాధితుల ఫోన్లు ఆయా ఠాణాలకు, 100కు ఫోన్ చేసిన సైబర్ నేర బాధితుల కాల్స్ 1930కు బదిలీ అయ్యేలా మార్పులు చేశారు. దేశంలోని అన్ని కాల్ సెంటర్లలో ఈ మార్పుచేర్పులు అమలులోకి వచ్చాయి. ఉదాహరణకు తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లిన వ్యక్తి అక్కడ సైబర్ నేరం బారినపడి ఫోన్ చేస్తే... ఆ ప్రాంతంలోని కాల్ సెంటర్‌కే వెళ్లేందుకు ఈ విధానం ఉపకరిస్తుంది.

సగానికి పైగా స్టేటస్ కాల్సే...

బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న 1930 కాల్ సెంటర్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండటానికి 30 మందిని కేటాయించారు. వీరు తమకు వచ్చే ఫోన్ కాల్స్‌ను నిర్వహించడానికి ఎక్సోటెల్ అనే సాఫ్ట్‌వేర్ వాడుతున్నారు. ఈ కాల్ సెంటర్‌కు నిత్యం వస్తున్న ఫోన్లలో 60 శాతం స్టేటస్ కాల్సే ఉంటున్నాయి. అంటే... గతంలో ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన వ్యక్తి తన ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో, పోగొట్టుకున్న నగదు ఏమైందో తెలుసుకోవడానికి ఫోన్లు చేస్తున్నారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు ఈ స్టేటస్‌ను బాధితులు తెలుసుకోవడానికి మరో విధానం అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. మరోపక్క సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీలకు సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రంలో ఏర్పడిన టీఎస్‌సీఎస్‌బీకి కేంద్రం ఐదు రాష్ట్రాల సమన్వయం బాధ్యతలు అప్పగించింది. దీంతో కర్ణాటక, గోవా, రాజస్థాన్, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అధికారులకూ సైబర్ నేరాల విషయంలో అవసరమైనప్పుడు ఈ బ్యూరో సేవలు అందిస్తుంది.

మహిళ ఫొటో మార్ఫింగ్ చేసి బెదిరింపులు

లోన్ యాప్ నిర్వాహకుల దారుణం

బంజారాహిల్స్: లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్న ఒక మహిళ ఫొటోను మార్ఫింగ్ చేసి నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడటంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకృష్ణ నగర్‌కు చెందిన మహిళ ఈ నెల 9న ×క్విక్ ఈజీ మనీ₹ అనే లోన్ యాప్ ద్వారా రూ. 5000 రుణంగా తీసుకుంది. ఇందుకోసం తన ఆధార్, పాన్ కార్డ్ వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అందజేసింది. 15వ తేదీలోగా డబ్బులు తిరిగి చెల్లించాలన్న యాప్ నిర్వాహకుల సూచన మేరకు ఆమె 14నే రుణాన్ని తిరిగి చెల్లించింది. అందుకు సంబంధించి ఆమె ఫోన్‌కు మెసేజ్ కూడా వచ్చింది. కాగా యాప్‌కు చెందిన ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి డబ్బులు తమకు అందలేదని, డబ్బులు చెల్లించాలంటూ బెదిరింపులకు దిగాడు. అంతేగాక ఆమె ఫొటోను మార్ఫింగ్ చేసి పలు నెంబర్ల నుంచి ఆమె వాట్సాప్ నంబర్‌కు పంపాడు. డబ్బులు చెల్లించకపోతే వాటిని సోషల్ మీడియా లో పెడతానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు తన భర్తతో కలిసి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫుల్‌టైం జాబ్ అంటూ స్వాహా

– నగర వాసికి రూ.43 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: పార్ట్‌టైం జాబ్ కంటే ఫుల్‌టైం జాబ్‌తోనే రూ. కోట్లు సంపాదించొచ్చంటూ సైబర్ నేరగాళ్లు నగర వాసికి టోకరా వేశారు. చిన్నపాటి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్న అతను మరిన్ని డబ్బులు సంపాదించాలనే ఆశతో సైబర్ నేరగాళ్ల వలలో పడ్డాడు. వాట్సాప్ ద్వారా పరిచయమైన గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో కూర్చుని యూ ట్యూబ్‌లో తాము పంపే లింకులను ఓపెన్ చేసి జస్ట్ లైక్, కామెంట్, షేర్ చేస్తే సరిపోతుందన్నారు. తొలి రోజుల్లో లైక్‌కు రూ.200, కామెంట్‌కు రూ.500, షేర్‌కు రూ.1000 చొప్పున ఇచ్చి ఆశ చూపారు. ఆ తర్వాత ఇన్వెస్ట్‌మెంట్ వైపు దారి మళ్లించారు. తాము సూచించిన యాప్‌లలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయన్నారు. పెట్టుబడికి కూడా తొలి రోజుల్లో లాభాలు ఇచ్చి నమ్మకం కలిగించారు. ఆ తర్వాత పలు దఫాలుగా రూ.43లక్షలు కాజేసి వారు మరిన్ని లక్షలు కావాలంటూ డిమాండ్ చేశారు. ఎట్టకేలకు మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కృష్ణసాయి వివేక్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: కారు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఆంధ్రప్రదేశ్ తునికి చెందిన బత్తుల కృష్ణ సాయి వివేక్ (23) తన స్నేహితుడు శివతో కలిసి గురువారం తెల్లవారుజామున బైక్‌పై కైత్లాపూర్ నుంచి వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కూకట్‌పల్లి పోలీసులు వారిని చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కృష్ణ సాయి వివేక్ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

డిప్యూటీ స్పీకర్ బావమరిదినని చెప్పుకుంటూ..

- పలువురికి టోకరా
- ఉద్యోగం, డబుల్ బెడ్రూమ్‌లు ఇప్పిస్తానంటూ మోసాలు
- దాదాపు రూ.కోటికి పైగా వసూలు
- నిందితుడిపై కేసు నమోదు

బౌద్ధనగర్: డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఎక్సైజ్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసి దాదాపు రూ.కోటికి పైగా వసూలు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదైన సంఘటన గురువారం వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సీతాఫల్‌మండీ, ఇందిరానగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌గౌడ్ తాను డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ బావమరిదినని చెప్పుకునేవాడు. ఈ నేపథ్యంలో 2019లో వారాసీగూడకు చెందిన మల్లేశ్వరరావు కుమార్తెకు ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 13 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత వారాసీగూడ, సీతాఫల్‌మండి ప్రాంతాలకు చెందిన సుమన్ రాజు, వంశీల వద్ద రూ. 20 లక్షలు, నారాయణ వద్ద రూ.13.50 లక్షలు, ప్రశాంత్ వద్ద రూ. 12 లక్షలు, రాఘవేంద్ర వద్ద రూ. 12.50 లక్షలు తీసుకుని నకిలీ ఆఫర్ లెటర్లు ఇచ్చాడు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని వేణుగోపాల్ గౌడ్ నుంచి రూ. 5 లక్షలు వసూలు చేశాడు. రోజులు గడుస్తున్నా ఉద్యోగానికి సంబంధించి సమాచారం అందకపోవడంతో తాము శ్రీనివాస్‌గౌడ్‌ను నిలదీయగా తాను పద్మారావుగౌడ్ బంధువునని బెదిరిస్తున్నాడని బాధితులు పేర్కొన్నారు. మూడేళ్లుగా శ్రీనివాస్‌గౌడ్ ఇంటి చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని, పద్మారావుగౌడ్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌గౌడ్‌పై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దోమల మందు తాగి చిన్నారి మృతి

అంబర్‌పేట: దోమల మందు తాగి 18 నెలల చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఎల్లయ్యకు అంబర్‌పేట మున్సిపల్ కాలనీకి చెందిన శ్రావణితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె శరణ్య (18 నెలలు) ఉంది. ఎల్లయ్య తన భార్య, కూతురితో కలిసి ఈ నెల 10న అంబర్‌పేట మున్సిపల్ కాలనీకి వచ్చాడు. భార్య, కుమార్తెను అత్తగారింట్లో వదిలి ఉద్యోగానికి వెళ్లాడు. ఈ నెల 12న రాత్రి అతడి చిన్న మామ ఫోన్ చేసి నీ కూతురు శరణ్య దోమలమందు తాగి అస్వస్థతకు గురికావడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపాడు. ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల సూచనమేరకు చిన్నారిని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్న చిన్నారి గురువారం మృతిచెందింది. చిన్నారి మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు తెలిపారు.

యువతిపై జిమ్ ట్రైనర్ లైంగికదాడి

ఫిలింనగర్: జిమ్‌కు వచ్చిన ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఆమెపై లైంగికదాడికి పాల్పడిన జిమ్ ట్రైనర్ పై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... టోలిచౌకీ ప్రాంతంలో ఆసిమ్ అనే యువకుడు జిమ్ నిర్వహిస్తున్నాడు. ఏడాదిగా జిమ్‌కు వస్తున్న యువతిపై కన్నేసిన అతను ఆమెపై గురువారం లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

మహిళ దుర్మరణం, భర్తకు గాయాలు

ఘట్‌కేసర్: కారు బైక్‌ను ఢీకొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక బైపాస్ రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడకు చెందిన నాజియా బేగం (35), భర్త రహీంతో కలిసి భువనగిరి వైపు నుంచి ఉప్పల్ వైపు వెళుతున్నారు. యంనంపేట్ చౌరస్తా వద్ద రోడ్డు పక్కన బైక్‌ను ఆపి నీళ్లు తాగుతుండగా భువనగిరి నుంచి ఉప్పల్ వైపు వస్తున్న కారు వీరిని ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన నాజియా బేగం అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాయనపడిన రహీంను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ విశ్వ విద్యాలయం హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 225 మందికి పైగా ఉన్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీసును క్రమబద్ధీకరించాలని, అదే విధంగా రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న దాదాపు 1335 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు గురువారం అధ్యాపకసంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ప్రాణప్రదాత దేవకీ శ్రీసాయి

దక్షిణ భారత దేశంలోనే అతి చిన్న వయస్కురాలిగా గుర్తింపు



రాంగోపాల్‌పేట్ : పద్నాలుగు నెలల పసిపాప ప్రాణప్రదాతగా నిలిచింది. తాను కన్నుమూస్తూ మరో ఇద్దరికి అవయవదానం చేసింది. దక్షిణ భారత దేశంలోనే అతి పిన్న వయసులో అవయవదానం చేసి చరిత్రలో నిలిచిపోయింది. ముక్కుపచ్చలారని ఆ చిన్నారి అవయవదానానికే స్ఫూర్తిగా మారింది. కొత్తపేటకు చెందిన శ్రీకాంత్, సంతోషి దంపతులకు కవల పిల్లలు. వారిలో ఒక పాప దేవకీ శ్రీసాయి. 14 నెలల చిన్నారి. గత ఆదివారం అకస్మాత్తుగా డీ హైడ్రేషన్‌కు గురికావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులు చికిత్స అందించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న చిన్నారి దేవకీ దురదృష్టవశాత్తు గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రీమ్ డెత్‌తో మృతి చెందింది. ఆ తర్వాత కిమ్స్ ఆస్పత్రిలోని అవయవదాన సమన్వయకర్తలు పాప తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అవయవదానం చేసేందుకు అంగీకరించడంతో జీవన్‌దాన్ బృందం పాప ఆర్గాన్స్‌ను తీసుకెళ్లారు. తమ బిడ్డను కాపాడుకోలేకపోయినా ఏ తల్లి బిడ్డ రూపంలోనైనా బతికే ఉంటుందనే సంతోషం మాత్రం మిగిలిందని పాప తల్లి సంతోషి పేర్కొన్నారు. జీవన్‌దాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్‌ఛానల్ ద్వారా అవసరం ఉన్న చోటుకు అవయవాలను తరలించినట్లు జీవన్‌దాన్ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా...

నేడు కుంకుమార్చన పూజలు

బంజారాహిల్స్: హిమాయత్‌నగర్‌లోని టీటీడీ బాలాజీ టెంపుల్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం భవన్‌లో ఈ నెల 16వ తేదీన ఉదయం 10 గంటలకు కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. టీటీడీ హైదరాబాద్, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా ఈ పూజలు నిర్వహిస్తాయని అన్నారు.

నేడు వెంగళరావునగర్ వార్డు కార్యాలయం ప్రారంభం

వెంగళరావునగర్ : వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ రహమత్‌నగర్ వీడియోగల్లీలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్టు స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఆమె జీహెచ్‌ఎంసీ సెంట్రల్ జోనల్ కమిషనర్ శంకరయ్యను కలిసి ఆయా ఏర్పాట్లపై చర్చించారు.

దరఖాస్తు గడువు పెంచాలి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవడానికి తేదీని పొడిగించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు డి.కుమారస్వామి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి మంత్రి హరీశ్‌రావులకు విజ్ఞప్తి చేశారు. గురువారం జరిగిన బీసీ కులాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అన్ని బీసీ కులాలు ఒకేసారి తహసీల్దార్ కార్యాలయంలో కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయా పత్రాలు ఇవ్వటంలో సమయం పడుతుందని ఒకటి,రెండు రోజుల్లో ఇచ్చే అవకావం ఉండదని ఆయన తెలిపారు. ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు తీసుకోవడానికి సమయం పడుతుందని దరఖాస్తు గడువు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

35వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న గంజి ఈశ్వరలింగం..

బంజారాహిల్స్: సామాజిక సేవకు వయసు అడ్డంకి కాదని కొంత మంది నిరూపిస్తున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మ నేత్ర అవయవ శరీరదాన ప్రోత్సాహకుల సంఘం అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం (64) ఈఎస్ఐ బ్లడ్ సెంటర్‌లో 35వసారి రక్తదానం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆయన వయసును కూడా పక్కనపెట్టి ఈ రక్తదానం చేశారు. మరొకరి ప్రాణాలు కాపాడాలనే సత్సంకల్పంతో రక్తదానం చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఆపదలోఉన్న వారిని ఆదుకోవాలి



కూరగాయల బండిని అందిస్తున్న కృష్ణవేణి, కుసుమ

శ్రీనగర్‌కాలనీ: ఆపదలో ఉన్నవారిని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని శ్రీమాతా సేవా సమితి అధ్యక్షురాలు కుసుమ కోరారు. ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన అమీన్ అనే వికలాంగుడికి గురువారం స్థానికంగా నివాసం ఉండే లెక్చరర్ కృష్ణవేణి, చంద్రగౌడ్ సహాయంతో కూరగాయల బండిని అందించి స్వయం ఉపాధి కల్గించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ 1104 యూనియన్ నాయకులు సర్వేశ్వర్, ఏఏఓ కృష్ణం శ్రీనివాసరెడ్డి, నేతలు జవహర్, గీత, నిరూష, సాయిలు, వీరేందర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు



బంజారాహిల్స్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఖైరతాబాద్ నియోజక వర్గం బీజేపీ నేత బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తాను చేపట్టిన మంత్రిత్వ శాఖలకు వన్నె తెస్తూ దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసేలా సాంస్కృతిక శాఖ విజయవంతంగా నిర్వహిస్తూ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిని సైతం కిషన్‌రెడ్డి పరుగులు పెట్టిస్తున్నారని అభినందించారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవను కొనసాగించాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీ బాటపై ప్రచారం నిల్

- మొక్కుబడిగా కార్యక్రమాలు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలో అధికారుల నిర్లక్ష్యం
- ప్రాజెక్ట్ ఆఫీసర్, సూపర్‌వైజర్ల నిఘా పూర్తిగా కరువు



ఫిలింనగర్ జ్ఞానీజైల్ సింగ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

బంజారాహిల్స్: ప్రైవేట్ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యా పేరిట చిన్నారులపై ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్నది. అలాంటి పరిస్థితులకు తావులేకుండా ఆట, పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించడం అంగన్‌వాడీ కేంద్రాలకు లక్ష్యంగా నిర్దేశించారు. ఇక్కడి విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. కేంద్రాల సేవలను వివరించేందుకు సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ(ఐసీడీఎస్) అధికారులు అంగన్‌వాడీ బాటలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. చిన్నారుల నమోదు పెంపు లక్ష్యంగా కార్యాచరణ ప్రకారం తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తూ సేవలపై విస్తృత ప్రచారం చేయాలని, రోజుకొక కార్యక్రమంతో బస్తీల్లోకి వెళ్ళాలని టైమ్ టేబుల్ నిర్దేశించారు. అయితే ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలో మాత్రం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగుతున్నది. వారం క్రితం తూతూ మంత్రంగా అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీలు చేపట్టి చేతులు దులుపేసుకున్నారు. షెడ్యూల్‌లో ఇచ్చిన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో విఫలమవుతున్నారు. అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టి చిన్నారులను కేంద్రాల్లో చేర్చే విధంగా ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికను రూపొందించి అమలు జరపాలని ఆదేశాలు జారీ చేసింది. ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలో ఉన్న 141 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం ఏ మాత్రం ముందుకు సాగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సంబంధిత అధికారి ఎవరో కూడా అంతుబట్టకుండా ఉంది. సూపర్‌వైజర్లు సైతం కనిపించకుండా పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయిదేళ్ళలోపు బాల, బాలికలను గుర్తించి కేంద్రాలకు రప్పించేలా చర్యలు చేపట్టాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు విడతలుగా ప్రత్యేక కార్యాచరణ ప్రకారం ముందుకు సాగే విధంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మొదటి విడతలో విఫలం....

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3 నుంచి 12 వరకు ఐసీడీఎస్ అధికారులు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఒకే ఒక ర్యాలీతో సంబంధిత అధికారులు సరిపెట్టారు. తల్లిదండ్రులకు అవగాహన, బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం ఆవశ్యకత, సామూహిక అన్నప్రాసన, అక్షరాభ్యాసం , చిన్నారులకు ప్రదర్శనకు సంబంధించిన పురోగతిపై ప్రదర్శన, మహిళలకు, పిల్లలకు క్రీడా పోటీలు, మహిళా శిశు సంక్షేమ శాఖ పథకాలపై ప్రచారం, మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించాలని సూచించారు. బడిబయట చిన్నారులను గుర్తించి పాఠశాలలకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సేవల ప్రచారంపై ఆదరణ లభిస్తుందని అధికారులు అంచనా వేయగా ఖైరతాబాద్‌లో ఈ బడిబాట విఫల ప్రయోగంగా నిలిచింది.

రెండో విడత సైతం తూతూ మంత్రంగా...

- అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో విడతలో ఈ నెల 14న ఇంటింటికి చేపట్టి అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సేవలపై రెండున్నరేళ్ళ నుంచి అయిదేళ్ళలోపు చిన్నారుల తల్లిదండ్రులకు పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ విషయంలో అంగన్‌వాడీ కేంద్రాలు చేతులెత్తేశాయి.
- ఈ నెల 15న అయిదేళ్ళు పైబడిన చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి ధృవీకరణ పత్రాలు, ప్రవేశ పత్రాలు పంపిణీ చేసి కొత్తగా చిన్నారుల నమోదు, ప్రీ స్కూల్‌కు సంబంధించిన సేవలపై వివరించాల్సి ఉంటుంది. 141 అంగన్‌వాడీ కేంద్రాల్లో పట్టుమని పది కేంద్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టలేదు.
- ఈ నెల 16న పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. చిన్నారులకు ప్రగతి పత్రాలు కూడా ఇవ్వాలి. చిన్నారుల చేత మంచి అలవాట్లకు సంబంధించి ప్రదర్శన ఇప్పించాలి. తర్వాత ఇంటింటికి తిరగాలి.
- ఈ నెల 17న స్థానికంగా సామాజిక భవనాలు పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యత, ఆవశ్యకత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సంసిద్ధ యాప్‌పై అవగాహన, చిన్నారులు తయారుచేసిన బోధనా భ్యాసన సామాగ్రి ప్రదర్శించాలి.
- ఈ నెల 19న ప్రవేశాలు మొదలైనట్లు బస్తీల్లో ప్రచారం నిర్వహించాలి. సామాజిక మాధ్యమాల్లో అంగన్‌వాడీ కాలపట్టిక, కార్యకలాపాలకు చెందిన పుస్తకాలు, సంసిద్ధ యాప్ వెబ్ పోర్టల్‌పై అవగాహన కలిగించాలి.
- ఈ నెల 20న అక్షరాభ్యాసం అంగన్‌వాడీ బాట కార్యక్రమం ముగుస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్షణాల్లో సమాచారం ...

- ఈఈల చేతుల్లో 'సెట్' వాకీటాకీలు



వాకీటాకీ సెట్‌లో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఈఈ విజయ్ కుమార్

బంజారాహిల్స్: సాధారణంగా ప్రభుత్వ యంత్రాంగంలో పోలీసుల వద్ద మాత్రమే వాకీటాకీలు కనిపిస్తుంటాయి. కానీ ఇప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారుల వద్ద కూడా వాకీటాకీలు కనిపించనున్నాయి. రానున్న వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు సరికొత్త టెక్నాలజీ ఉపకరణాలతో విధులకు సిద్ధమయ్యారు. వర్షాకాలంలో జీహెచ్‌ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే ఆయా నోడల్ అధికారులకు చేరవేసేందుకు జీహెచ్‌ఎంసీ ప్రతి సర్కిల్‌కు వాకీటాకీ సెట్‌లను అందించింది. ఈ వాకీటాకీ సెట్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు కమాండ్ కంట్రోల్‌సెంటర్, ఈవీడీఎం విభాగాలకు అనుసంధానమై ఉంటుంది. దీంతో వర్షాలు వచ్చినప్పుడు పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేందుకు ఉన్నతాధికారులు ఈ సెట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఈఈ విజయ్‌కుమార్‌తో పాటు, సర్కిల్–17 ఈఈ ఇందిరా భాయిలకు అందజేశారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు వరదలు, నాలాలు పొంగినప్పుడు వెంటనే కమాండ్ కంట్రోల్ నుంచి వచ్చే సందేశాలను క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే ఏఈలు, మాన్‌సూన్ బృందాలు, డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకునేందుకు ఈ వాకీటాకీలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

కేబీఆర్ పార్కులో వీధికుక్కలు



బంజారాహిల్స్: వీధుల్లో ఉండాల్సిన కుక్కలు పార్కుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. నియంత్రించే నాధుడు కరువడంతో రోజురోజుకు వీటి ఆగడాలు పెరిగిపోతుండగా జాతీయ పక్షికి రక్షణ లేకుండా పోతున్నది. బంజారాహిల్స్‌లోని ప్రతిష్టాత్మక కేబీఆర్ పార్కులో ప్రతిరోజూ నాలుగైదు వీధి కుక్కలు దర్జాగా వాక్‌వేలోనే తిరుగుతూ వాకర్లను వెంటాడుతున్నాయి. అంతేకాదు జాతీయ పక్షి నెమళ్ళ వెంట పడుతూ వాటిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల ఓ మహిళా వాకర్ వీధి కుక్కల బెడదపై సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసింది. పార్కులో కుక్కల గోల ఏంటంటూ నిలదీసింది. వాకర్లతో పాటు నెమళ్ళకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. ఇంత జరిగినా పార్కు సిబ్బందిలో, అధికారుల్లో చలనం కరువైంది. యథేచ్ఛగా వీధి కుక్కలు సంచరిస్తూనే ఉన్నాయి.

జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో....

కేబీఆర్ పార్కులోనే కాకుండా పార్కును ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలోనూ వీధి కుక్కల బెడద తీవ్రమైంది. వీటిని నియంత్రించే యంత్రాంగం దాదాపుగా కరువైంది. వీటిని పట్టుకోవడానికి వచ్చే సిబ్బందిపై కొంత మంది వాకర్లు విరుచుకుపడుతూ వాటిని తీసుకెళ్ళద్దంటూ అడ్డు పడుతుండటంతో వాక్‌వేలో పాతికకుపైగా కుక్కలు సంచరిస్తున్నాయి. సరైన నిఘా లేకపోవడంతో వీటి సంతతి రోజురోజుకు పెరిగిపోతున్నది. జీహెచ్‌ఎంసీ సంబంధిత విభాగం వెటర్నరి అధికారుల వీధి కుక్కల బెడదపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పదోన్నతుల్లో బీసీ ఇంజినీర్లకు తీవ్ర అన్యాయం



బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణంకు వినతిపత్రం ఇస్తున్న సమ్మయ్య

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో గత కొన్ని సంవత్సరాలుగా పదోన్నతుల్లో బీసీ కులాలకు చెందిన ఇంజినీర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ ఇంజినీర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షులు దేవళ్ల సమ్మయ్య, సెక్రటరీ జనరల్ సతీష్ కొట్టే, కంపెనీ ప్రెసిడెంట్ కె.రాజులు మాట్లాడుతూ .. విద్యుత్ సంస్థల్లో ఉన్నతస్థాయి నిర్ణయాధికార పోస్టుల్లో బీసీ ఇంజనీర్స్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కేవలం ఒక్కరే బీసీ ఇంజనీర్ ఉన్నారని అదికూడా ప్రాధాన్యత లేని శాఖలో నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాతృస్వామ్య పాలనతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చు.

లిబర్టీ: ప్రస్తుత సమాజంలో పితృస్వామ్య వ్యవస్థనే ఇంకా ఆధిపత్యం కొనసాగిస్తోందని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ వెల్లడించారు. గురువారం మాతృస్వామ్య పాలన అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతీయ వ్యవస్థలో అనాదిగా స్వామి వ్యవస్థ ఆధిపత్యంగా కొనసాగుతుందన్నారు. మాతృస్వామ్య పాలన సాగితే దేశం రాష్ట్ర పురోగతి సాధిస్తుందని తెలిపారు. రాజులు మారినా రాజ్యాలు మారిన పితృస్వామ్య వ్యవస్థ మాత్రం ఇంకా కొనసాగిపోవడం బాధాకరమన్నారు. విజిఆర్ నారగోని మాట్లాడుతూ తరాలు మారుతున్న పితృస్వామ్య వ్యవస్థ కొనసాగుతుందని అన్నారు.

జలమండలి లోగోతో వాటర్ ట్యాంకర్ నిర్వహణ

- పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: జలమండలి లోగోను వినియోగిస్తూ వాటర్ ట్యాంకర్‌ను నడుపుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బంజారాహిల్స్ జలమండలి సెక్షన్ మేనేజర్ కె. శివ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం. 1/3 నాగార్జున సర్కిల్ చౌరస్తాలో ఉన్న 8-2-470 మహేశ్వరి టవర్స్‌లో కొంత కాలంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. అయితే ఈ నీళ్ళు వాటర్ వర్క్స్‌కు సంబంధించిన మున్సిపల్ వాటర్ అని మొదట్లో ఫిర్యాదులు రాగా ఆ మేరకు వీటిని పరీక్షించేందుకు జలమండలి క్వాలిటీ వింగ్‌కు నీటిని పంపించారు. ఇవి మున్సిపల్ వాటర్ కాదని బోర్ వాటర్ అని తేలింది. అయితే టీఎస్ 12 యూసీ 8762 నెంబర్ ట్యాంకర్‌పై జలమండలి లోగోను ఏర్పాటు చేసి సుధీర్ కుమార్ అనే వ్యక్తి గత కొన్నేళ్ళుగా ఈ కాంప్లెక్స్ నుంచి నీటిని తరలిస్తూ విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. ఈ నెంబర్‌తో కూడిన వాటర్ ట్యాంకర్‌ను జలమండలి ఐటీ వింగ్ బ్లాక్‌లో పెట్టింది. అయినా సరే నిబంధనలకు విరుద్ధంగా సదరు వాటర్ ట్యాంకర్ యజమాని దర్జాగా ట్యాంకర్‌పై వాటర్‌వర్క్స్ లోగో ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తూ సంస్థ పేరునుదుర్వినియోగం చేస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా మేనేజర్ ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు నిబంధనలు ఉల్లంఘించి వాటర్ ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న సుధీర్‌కుమార్‌పై క్రిమినల్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మసీదు స్థలం కబ్జాకు యత్నం'

రహమత్‌నగర్(బోరబండ) : బోరబండ ఎస్ఆర్ఆర్ పురం సైట్3 మసీదు-ఏ-ఇబ్రహీం-గుల్షని స్థలంలో జరుగుతున్న ఆక్రమణ ప్రయత్నాలు అరికట్టాలని మత పెద్దలు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం సైట్3లో వారు మాట్లాడుతూ.. 2007లో బోరబండ ఎస్ఆర్ ఎన్‌పురం జమా మసీదు ఇబ్రహీం ట్రస్ట్‌ను రిజిస్ట్రేషన్ చేయించి ఎండిగా ఇషాక్ గుల్షనీని ఎన్నుకున్నామన్నారు. అయితే 2022లో చైర్మన్ మృతి చెందడంతో 2023లో ట్రస్ట్ చైర్మన్‌గా సయ్యద్ మక్సూద్‌ను ఎన్నుకున్నామన్నారు. అయితే పాత చైర్మన్ ఎండీ ఇషాక్ గుల్షనీ కుమారుడు ఇస్తేహక్ గుల్షని మసీదుకు వచ్చే నెలవారి ఆదాయం దాదాపు రూ1.40 లక్షలు గత ఏడు సంవత్సరాలుగా తన సొంతానికి వాడుకుంటున్నాడని ఆరోపించారు. దానికితోడు మసీదుకు చెందిన స్థలాన్ని కబ్జా చేయాలని యత్నిస్తున్నట్లు వారుతమ ఫిర్యాదులో పెర్కొన్నారు. పోలీసులు స్పందించి మసీదు స్థలం ఆక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాల కోరారు.

సిద్ధమైన వార్డు కార్యాలయాలు



జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి డివిజన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటైన వార్డు కార్యాలయాలు నేటి నుంచి తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్‌తో కలిసి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల వార్డు కార్యాలయాలను ఆయన పరిశీలించారు. వార్డు కార్యాలయాల్లో అధికారులకు, పౌరులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు.

మురుగును దాటేదెలా..?



మహాత్మా గాంధీనగర్ బస్తీలో పొంగుతున్న మురుగు..

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని మహాత్మగాంధీనగర్ బస్తీలో మురుగు సమస్య స్థానికులను తీవ్రంగా వేధిస్తోంది. మహాత్మగాంధీనగర్ బస్తీకి ఎగువున ఉన్న బసవతారకం బస్తీ వైపు నుంచి మురుగు నీరు కిందికి ఎటువంటి పైప్‌లైన్లు లేకుండా నేరుగా వస్తుండటంతో రోడ్డంతా మురుగుమయంగా మారుతున్నది. ఈ సమస్యను పలుమార్లు స్థానికులు సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక పక్క నాలా, మరో పక్క ఈ మురుగు సమస్యతో స్థానికులు తీవ్ర నరకాన్ని చూస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించడంతో పాటు మరో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని న్యూసీఐబి క్వార్టర్స్‌లో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గాంధీనగర్‌లో రూ.15లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులతో పాటు గాంధీనగర్ అధ్యక్షుడు అంజయ్య, రాకేష్, వికేష్, రాజ్‌కుమార్, మహేందర్‌బాబు, మహేష్‌యాదవ్, ప్రవీణ్, గజ్జల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటిహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మేచినేని



మేచినేని శ్రీనివాసరావును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

బంజారాహిల్స్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బంజారాహిల్స్‌కు చెందిన సీనియర్ బీజేపీ నేత మేచినేని శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ బీజేపీ నేతలు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు గురువారం బంజారాహిల్స్‌లోని ఆయన కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేచినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సమష్టిగా కృషి చేసి కాషాయా జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తనకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి, డాక్టర్ లక్ష్మణ్‌కు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రాఘవరెడి, బద్దం మహిపాల్ రెడ్డి, వినయ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు నేతల అభినందనలు



ఇన్‌స్పెక్టర్‌ను అభినందిస్తున్న వెంగళరావునగర్ కాలనీనేతలు

వెంగళరావునగర్: ఇటీవల నూతనంగా ఏర్పాటైన మధురానగర్ పోలీసుస్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన బి.శ్రీనివాస్‌ను గురువారం వెంగళరావునగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటుగా ఎస్ఐలు యుగంధర్, బాల్‌రాజ్‌లకు శాలువాలు కప్పి బొకేలను అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీనేతలు మాట్లాడుతూ కాలనీలో చిల్లర దొంగతనాలు, ఇతర సమస్యలు ఇటీవల ఏర్పడుతున్నాయని, ఆకతాయిల బెడద ఉందన్నారు. కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్ల కోసం క్యూ



బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు జోరుగా సాగుతున్నాయి. ప్రతిరోజూ కొత్త అడ్మిషన్ల నమోదుతో ఉపాధ్యాయులు బిజీగా ఉంటున్నారు. ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు నూతన అడ్మిషన్ల కోసం తమ పిల్లలను తీసుకొని తల్లిదండ్రులు బారులు తీరుతున్నారు. ప్రతిరోజూ 25కుపైగా కొత్త చేరికలు జరుగుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని గతి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సైతం కొత్త అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు క్యూలు కడుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎస్టీటీ నగర్ హైస్కూల్‌లో నూతన చేరికలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధి కారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు.గురువారం ఆల య ప్రాంగణంలో ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్ పాలక మండలి సభ్యులతో కలిసి ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కల్యాణానికి దాదాపుగా 12 లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశ ముందన్నారు. మంత్రి తలసాని ఇది వరకే అన్ని శాఖల అధికారులతో కో ఆర్డినేషన్ సమావేశం పెట్టి ఏర్పాట్లపై సమీక్షించారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. వీఐపీ పాసులు మినహా ఎలాంటి పాసులు జారీ చేయడం లేదని ఒక్క పాసుపై ఇద్దరిని మాత్రమే అనుమతిస్తారన్నారు. వీఐపీ పాస్‌లు ఉన్న వారు మధ్యాహ్నం 2 గంటల లోపు దర్శనం పూర్తి చేసుకోవాలని కోరారు.

ఆడిటర్ సహా.. విశాఖ ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్

4 గంటల్లోనే కథ సుఖాంతం

- రెండ్రోజుల క్రితం ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లో చొరబడిన దుండగులు
- అతడితోనే ఫోన్ చేయించి తల్లిని రప్పించిన కిడ్నాపర్లు
- ఆమె ద్వారా ఆడిటర్ జీవీని పిలిపించి నిర్బంధం
- ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బు ఇవ్వాలంటూ బెదిరింపులు
- రూ.1.75 కోట్లు ఇచ్చినా.. ఇంకా కావాలంటూ డిమాండ్
- గురువారం ఉదయం వెలుగులోకి వచ్చిన కిడ్నాప్ వ్యవహారం
- సినీ ఫక్కీలో కిడ్నాపర్లను నాలుగు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

దొండపర్తి (విశాఖ దక్షిణ)/విశాఖ విద్య: విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య, కుమారుడితో పాటు ప్రముఖ ఆడిటర్ జీవీ కిడ్నాప్ వ్యవహారం గురువారం సంచలనం రేకెత్తించింది. సినీ ఫక్కీలో దుండగులు ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లోకి చొరబడి.. ముగ్గురి మెడపై కత్తిపెట్టి డబ్బులు డిమాండ్ చేశారు. 48 గంటల పాటు నిర్బంధించారన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. కానీ, పోలీసులు నాలుగు గంటల్లోనే కిడ్నాపర్ల ఆచూకీని కనిపెట్టి సినిమా స్టైల్లో వెంబడించి రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్‌లను అరెస్టుచేయడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. వారి చెర నుంచి ఎంపీ ఎంవీవీ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) సురక్షితంగా బయటపడ్డారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో మరో ఐదుగురి పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు. వివరాలివీ..


నిందితుడు హేమంత్ కుమార్ (ఫైల్)

కిడ్నాప్ జరిగింది ఇలా..

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు శరత్ రుషికొండ ప్రాంతంలో తారకరామ లేఅవుట్‌లో ఉంటున్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం కొందరు దుండగులు ఆ ఇంట్లోకి చొరబడ్డారు. లోపల శరత్ ఒక్కడే ఉండడంతో అతడిని నిర్బంధించి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకున్నారు. ఇంకా డబ్బు కావాలని దాడిచేశారు. తన వద్ద లేదని చెప్పినా వినలేదు. దీంతో మరుసటి రోజు బుధవారం శరత్‌తో లాసెన్స్ బే కాలనీలో ఉంటున్న తల్లి జ్యోతికి ఫోన్ చేయించారు. తన ఆరోగ్యం బాగోలేదని, ఇంటికి రావాలని బలవంతంగా చెప్పించారు. అది నిజమని నమ్మిన అతడి తల్లి జ్యోతి కంగారుగా బుధవారం కొడుకు ఇంటికి వచ్చారు. ఆమెను కూడా బంధించి ఆమె వద్ద ఉన్న బంగారు నగలను కాజేశారు. భారీగా డబ్బులు కావాలన్న ఉద్దేశంతో ఎంపీతో సన్నిహితంగా ఉండే ప్రముఖ ఆడిటర్ జీవీకి జ్యోతితో ఫోన్‌చేసి రప్పించారు. జీవీని కూడా నిర్బంధించి రూ.2 కోట్లు కావాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని ముగ్గురి మెడపై కత్తిపెట్టి బెదిరించారు. దీంతో జీవీ తనకు తెలిసిన వారికి ఫోన్‌చేసి రూ.1.75 కోట్లు సమకూర్చి వారికి అందించారు. అయినప్పటికీ వారిని విడిచిపెట్టకుండా ఇంకా డబ్బులు కావాలని కిడ్నాపర్లు డిమాండ్ చేశారు. మధ్యలో ఎంపీ తన కుమారుడు శరత్‌కు ఫోన్‌చేసినప్పటికీ కిడ్నాపర్ల సూచనల మేరకు మామూలుగానే మాట్లాడి ఫోన్ పెట్టేశారు.

ఎంపీ ఎంవీవీకి అనుమానం వచ్చి..

ఐటీ రిటర్నుల పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న ఎంపీ ఎంవీవీ.. ఆడిటర్ జీవీకి బుధవారం మధ్యాహ్నం నుంచి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. అతడి సన్నిహితులకు ఫోన్‌చేయగా.. శ్రీకాకుళం వెళ్లినట్లు చెప్పారు. అక్కడి వారికి ఫోన్‌చేసి ఆరాతీస్తే శ్రీకాకుళం కూడా రాలేదని సమాచారమిచ్చారు. జీవీకి ఏమైందన్న ఆందోళనతో ఎంపీ విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మకు ఫోన్‌చేసి అతని నంబర్‌ను ట్రాక్ చేయాలని కోరారు. పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా జీవీ రుషికొండలోనే ఉన్నట్లు గుర్తించారు. అతని డ్రైవర్‌తో పాటు మరికొంత మంది ద్వారా సమాచారం సేకరించి సాంకేతికత సాయంతో విచారణ చేపట్టారు. దీంతో కిడ్నాప్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

సినీ ఫక్కీలో ఛేజ్ చేసి..

మరోవైపు.. రెండ్రోజులుగా ముగ్గురిని ఇంట్లోనే నిర్బంధించిన విషయాన్ని పోలీసులు గుర్తించే అవకాశం ఉందని గ్రహించిన కిడ్నాపర్లు వారిని అక్కడ నుంచి విజయనగరం వైపు తరలించేందుకు ప్రయత్నించారు. శరత్‌కు చెందిన ఆడి కారులో వారిని ఎక్కించుకుని పద్మనాభం నుంచి ఎస్.కోట మీదుగా విజయనగరం వెళ్లేందుకు బయల్దేరారు. పోలీసులు అప్పటికే మొబైల్స్, ఇతర టెక్నాలజీల ఆధారంగా ప్రతి ప్రాంతంలోనూ చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. వారు ఆనందపురం మీదుగా పద్మనాభం వైపు వెళ్తున్నట్లు తెలుసుకుని వారి కారును వెంబడించారు. ఆనందపురం మండలం పందలపాక గ్రామానికి వారి కారు చేరుకోగానే ముందు నుంచి పద్మనాభం సీఐ బృందం, వెనుక నుంచి పీఎంపాలెం సీఐ బృందాల వాహనాలు అడ్డగించాయి. అయినప్పటికీ కిడ్నాపర్లు కారు ఆపకుండా ముందుకు వెళ్లే ప్రయత్నంలో పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. వెంటనే కారులో ఉన్న కిడ్నాపర్లు రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్‌కుమార్, రాజేష్‌లు బయటకు దిగి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఎంపీ కుటుంబ సభ్యుల కోసం ఆరా తీశారు. అయితే, వారిని బాకురుపాలెం ప్రాంతంలోనే విడిచిపెట్టినట్లు చెప్పడంతో మరో పోలీస్ బృందం వారికోసం గాలింపు చేపట్టింది. ఇంతలో వారు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నట్లు తెలుసుకుని వారిని సురక్షితంగా కమిషనరేట్‌కు తరలించారు.

వ్యవసాయంలో దేశం స్వయం సమృద్ధి

- ఆహార ధాన్యాలను ఎగుమతి చేస్తున్నాం
- వాతావరణ మార్పులపై జీ–20లో చర్చిస్తాం
- కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్
- హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన జీ–20 సమావేశాలు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ (ఎడమ)

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయంలో భారతదేశం స్వయంసమృద్ధి సాధించిందని కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ వెల్లడించారు. వ్యవసాయంలోని వివిధ రంగాలలో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడానికి జీ–20 దేశాలతో కలిసి పనిచేయడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ హెచ్ఐసీసీ నోవాటెల్‌లో మూడు రోజుల పాటు జరగనున్న జీ–20 వ్యవసాయ మంత్రుల సమావేశం గురువారం ప్రారంభమైంది. జీ–20 సభ్య దేశాలు, ఆహ్వాన దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు, మంత్రులు, డైరెక్టర్ జనరల్‌లు సమావేశానికి హాజరయ్యారు. కేంద్ర వ్యవసాయ సహాయ మంత్రి కైలాష్ చౌదరి ప్రదర్శనను ప్రారంభించడంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఎగ్జిబిటర్లు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సాధించిన విజయాలను ప్రదర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మాట్లాడారు. భారతదేశం ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయిలో ఉందన్నారు. వాతావరణ మార్పులు, పంటల వైవిధ్యంపై సమావేశాల్లో చర్చిస్తామన్నారు. రైతులు ఎక్కువ ఆదాయాన్ని పొందేందుకు, నష్టాలను తగ్గించడానికి ప్రభుత్వం పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలు అమలు చేశామన్నారు. ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయాన్ని కూడా ప్రోత్సహిస్తున్నాయని, వీటి అమలు కోసం ఇప్పటివరకు రూ. 1500 కోట్లు ఖర్చు చేశామన్నారు. వాతావరణ మార్పుల వల్ల జరిగే పంట నష్టాలను తగ్గించేందుకు భారతదేశం వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలను అభివృద్ధి చేస్తోందని తోమర్ అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రపంచ ప్రయోజనాల కోసం మన జ్ఞానాన్ని, అనుభవాన్ని జీ–20 దేశాలతో పంచుకుంటామన్నారు. అనేక వ్యవసాయోత్పత్తులలో భారతదేశం ప్రపంచంలో మొదటి లేదా రెండో స్థానంలో ఉందన్నారు. శుక్రవారం వివిధ దేశాలకు చెందిన వ్యవసాయ మంత్రులతో ప్రారంభ సెషన్ జరగనుంది. ముగింపు రోజు శనివారం జీ–20 వ్యవసాయ మంత్రులు వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రకటనతో పాటు రోడ్ మ్యాప్‌ను విడుదల చేస్తారని తోమర్ తెలిపారు.

ఎగ్జిబిషన్లలో స్టాళ్లు...

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో వేస్ట్ టు వెల్త్ మేనేజ్‌మెంట్, పోస్ట్ హార్వెస్ట్, స్మార్ట్ అండర్ ప్రెసిషన్ అగ్రికల్చర్, అగ్రి ఇన్నోవేషన్స్, వాల్యూ చైన్ మేనేజ్‌మెంట్ మొదలైన రంగాల్లో 71 స్టాల్స్ ఏర్పాటు చేశారు. వాటిల్లో 15 స్టాళ్లను ఐకార్ ఏర్పాటు చేసింది. ఏడు స్టాళ్లను ఇతర మంత్రిత్వ శాఖలు ప్రదర్శించాయి. 9 స్టాల్స్‌ను ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సాధించిన విజయాలను ప్రదర్శించేందుకు ఏడు స్టాల్స్‌ను కేటాయించారు. ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం తర్వాత, సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో వ్యవసాయ డిప్యూటీల సమావేశానికి, ఆ తర్వాత ప్యానెల్ చర్చలు జరిగాయి.

'మార్గదర్శి' చరాస్తులు రూ.242.03 కోట్లు అటాచ్

- వీటిలో 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, డిపాజిట్లు
- చిట్టీల మొత్తం చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్న 'మార్గదర్శి'
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకు సీఐడీ కఠిన చర్యలు
- మొత్తం రూ.1,035.53 కోట్ల అటాచ్‌మెంట్‌కు నిర్ణయం
- ఇంతకు ముందు రూ.793.50 కోట్ల చరాస్తులు అటాచ్



సాక్షి, అమరావతి: ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంసీఎఫ్ఎల్)పై మరిన్ని కఠినచర్యలకు సీఐడీ ఉపక్రమించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన రూ.242.03 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. వాటిలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ 40 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన పెట్టుబడులు, బ్యాంకుల్లో డిపాజిట్లు కూడా ఉన్నాయి. సీఐడీ వినతి మేరకు హోంశాఖ గురువారం ఇందుకు సంబంధించి అనుమతి జారీ చేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొన్నాళ్లుగా చందాదారులకు చిట్టీల మొత్తాన్ని చెల్లించడంలో జాప్యం చేస్తోంది. దీంతో చందాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సీఐడీ కఠిన చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన రూ.793.50 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. తాజాగా రూ.242.03 కోట్లతో కలిపి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన మొత్తం రూ.1,035.53 కోట్ల చరాస్తులను అటాచ్ చేసేందుకు సీఐడీ సన్నద్ధమవుతోంది.

అగమ్యగోచరంగా మార్గదర్శి

కేంద్ర చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీల్లో వెల్లడైంది. ఆ శాఖ ఫిర్యాదు మేరకు సీఐడీ విభాగం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసింది. ఆ సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావును ఏ–1గా, ఎండీ చెరుకూరి శైలజ కిరణ్‌ను ఏ–2గా, బ్రాంచి మేనేజర్లను ఏ–3గా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. సీఐడీ అధికారులు చేసిన సోదాల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ దశాబ్దాలుగా పాల్పడుతున్న ఆర్థిక అక్రమాలు ఆధారాలతో సహా బట్టబయలయ్యాయి. కాగా మరోవైపు కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర చిట్స్ రిజిస్ట్రార్ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు స్పష్టం చేశారు. ఆ చట్టం ప్రకారం చందాదారుల సొమ్మును ఇతర అవసరాలకు మళ్లించకూడదు. ఏ బ్రాంచి చందాదారుల సొమ్మును అదే నగరం/పట్టణంలోని జాతీయ బ్యాంకులోని ఖాతాలో జమ చేయాలి. కానీ రామోజీరావు చందాదారుల సొమ్మును హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలించి, అక్కడి నుంచి సొంత కంపెనీలలోకి మళ్లిస్తున్నారు. ఆ సంస్థల ద్వారా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లలో పెట్టుబడిగా పెడుతున్నారు. ఇది కేంద్ర చట్టానికి విరుద్ధం. కేంద్ర చట్టాన్ని పాటించేందుకు ససేమిరా అంటున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ గత ఏడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీలను వేయడం లేదు. దాంతో ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల వరకు టర్నోవర్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో పాత చందాదారులకు చిట్టీ పాటల మొత్తాన్ని చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. దీనిపై ఇప్పటికే పలువురు చందాదారులు చిట్స్ రిజిస్ట్రార్, సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ కోసం మార్గదర్శి చిట్‌ఫండ్స్ చరాస్తులను జప్తు చేయాల్సిన అవసరం ఉందని సీఐడీ భావించింది. అగ్రిగోల్డ్ కంపెనీ తరహాలో రాబోయే రోజుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం చేతులెత్తేస్తే చందాదారుల సొమ్మును వారికి తిరిగి చెల్లించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ చరాస్తులను అటాచ్ చేసేందుకు అనుమతి కోరుతూ సీఐడీ విభాగం త్వరలోనే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనుంది.

అధికారంలోకొస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

కర్ణాటక తరహాలో అమలు చేస్తాం: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కర్ణాటక తరహాలోనే తెలంగాణలో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి చెప్పారు. అలాగే పేదలు ఇళ్లు కట్టుకొనేందుకు రూ.5 లక్షలు ఇస్తామని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని హామీ ఇచ్చారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా నేత కంది శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి రేవంత్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ ఎన్నికల హామీలను వెంటనే నెరవేరుస్తామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్‌తోపాటు షాద్‌నగర్, ఉప్పల్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో ఆయా జిల్లాల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నగర వార్తలు

'ప్రభుత్వ విధానాలపై యువత పోరాడాలి'

హిమాయత్‌నగర్: పాలకుల అనాలోచిత విధానాల కారణంగానే దేశవ్యాప్తంగా ప్రజల జీవన ప్రమాణాలు నానాటికి దిగజారుతున్నాయని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. తిరుమలై రామన్ అన్నారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలపై విద్యార్థులు పోరాటాలు చేపట్టాల్సిన అవసరముందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పరిస్థితులు నెలకొన్నాయని, రిక్రూట్‌మెంట్ బోర్డ్ పోటీ పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించలేక విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రభుత్వంపై నమ్మకం పోయిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె. ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ అంశంపై ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నెర్లకంటి శ్రీకాంత్, కనుకుంట్ల శంకర్, లింగం రవి, వెంకటేశ్వర్లు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ సిటిజన్లకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి



మాట్లాడుతున్న మహేష్ భగవత్

పంజగుట్ట: దేశంలో అత్యధిక సీనియర్ సిటిజన్లు ఉన్న కేరళలో సీనియర్ సిటిజన్లకు హెల్త్‌కార్డులు ఇస్తున్నారని అదే విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సీనియర్ సిటిజన్స్ సమస్యలు వాటి పరిష్కారాలు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ భాస్కర్ రావు, మహేష్ భగవత్, ప్రొఫెసర్ కోదండ రామ్, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, పాతూరి సుధాకర్ రెడ్డి, శైలజ, రఫత్ అలీ, నరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ భాస్కర్ రావు మాట్లాడుతూ .. సీనియర్ సిటిజన్స్ ఇంట్లోనే ఉండకుండా బయటికి వెళితే కొత్త మిత్రులు ఏర్పడతారన్నారు. జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. 70 శాతం సీనియర్ సిటిజన్లు గ్రామాల్లోనే ఉంటున్నారని వారికి ప్రభుత్వం ఆరోగ్య కార్డులు ఇవ్వాలని కోరారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ వయస్సుపై పడిందని డిప్రెషన్‌కు గురికారాదన్నారు. నిత్యం పక్కవారిని పలకరిస్తూ, గార్డెనింగ్ చేస్తూ, పేదవారికి సాయం చేస్తూ ఉండాలన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ .. తెలంగాణ ఉద్యమంలో సీనియర్ సిటిజన్ల పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. గ్రంథాలయాలు వాడుకున్న చోట సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంగా, స్థానిక సమస్యలపై స్పందిస్తున్నారన్నారు. ప్రభుత్వం వృద్ధాప్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అందరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ .ఎంతో మంది బిడ్డలు ఉన్నా అనాథలుగా చెట్లు, గుడి మెట్లు, బస్టాండ్‌లలో తలదాచుకుంటున్నారన్నారు. సీనియర్ సిటిజన్లకు వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శైలజ మాట్లాడుతూ ..రాష్ట్రంలో ప్రస్తుతం 50 లక్షల వరకు సీనియర్ సిటిజన్లు ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం వీరికోసం తీసుకువచ్చిన ప్రత్యేక చట్టాన్ని అందరూ ఉపయోగించుకోవాలన్నారు. పిల్లలపై ఆస్తులు బదలాయింపు చేసే సమయంలో కొంత మనపేరిట ఉంచుకోవాలని, ఇలాంటి విషయాల్లో అవగాహన కల్పించాలన్నారు. పంజాబ్, ఢిల్లీ తర్వాత తెలంగాణలో ఆస్థిని పిల్లలకు రాసిచ్చిన తర్వాత కూడా తిరిగి తీసుకునే హక్కు ఉందన్నారు. నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా జన్మను సార్థకం చేసుకోవాలని, కాలనీ వాసులతో కలిసి ఉండాలని సూచించారు.

హెచ్‌సీయూ ఫ్యాకల్టీకి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు


హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సయ్యద్ ఫజులుల్లా

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ రీసెర్చ్, క్రిటిక్స్‌లో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు గురువారం హెచ్‌సీయూ ఓ ప్రకటన విడుదల చేసింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్‌లోని ఉర్దూ విభాగం ప్రొఫెసర్ సయ్యద్ ఫజులుల్లా పరిశోధన, విమర్శకుల్లో లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు(2018కి డాక్టర్ మోహియుద్దీన్ ఖాద్రీ జోర్ అవార్డు)ను తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల రాష్ట్ర హోంశాఖామంత్రి మహ్మద్ మహమూద్ అలీ, ఇతర ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఆయన అవార్డు స్వీకరించారు. అవార్డు కింద సర్టిఫికెట్, మెమెంటో, రూ.50వేల నగదు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను వర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

ఉద్దేశ పూర్వకంగానే యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారు


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉద్దేశపూర్వకంగానే పాలకులు రాష్ట్రంలోని యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో 3179 ప్రొఫెసర్ పోస్టులు ఉండాల్సి ఉండగా కేవలం 818 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవ్ ఉస్మానియా యూనివర్సిటీ లెగసీ(సోల్), సోషల్ డెమొక్రటిక్ ఫోరం, విద్యా పరిరక్షణ వేదికల సంయుక్త ఆధ్వర్యంలో సేవ్ ఉస్మానియా యూనివర్సిటీ అంశంపై సమావేశం జరిగింది. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీకి రూ.2 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. యూనివర్సిటీలో కనీస సౌకర్యాలను మెరుగుపరచడంలో రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీ పాలక మండలి విఫలమైందన్నారు. నిజాం కళాశాలలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సులను రద్దు చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారులు ప్రతి 15 రోజులకోసారి ఢిల్లీ, ముంబై వెళ్లడం వెనుక ఆంతర్యం ఏమిటో స్పష్టం చేయాలన్నారు. మన ఐఏఎస్‌లు రాష్ట్రాభివృద్ధికి కాకుండా వ్యాపార దృష్టితో పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ప్రొఫెసర్లు ఉంటేనే రీసర్చ్ గ్రాంట్‌లు మంజూరవుతాయన్నారు. ప్రపంచమంతా ఐటీ వైపు అడుగులు వేస్తుండగా మన యూనివర్సిటీల్లో బల్లలు, చాక్‌పీసులు కూడా లేవన్నారు. యూనివర్సిటీలు పతనం కావడం అంటే సామాజిక మార్పుకు గొడ్డలి పెట్టు అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులు వీసీని కలిసే స్థితిలో లేరన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థుల ఫీజులను రూ.20 వేలకు పెంచడం దారుణమన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వీసీలు నియంతలుగా వ్యవహరించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. యూనివర్సిటీ స్కాలర్ ఆజాద్ మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, వీసీ బీఆర్ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారన్నారు. వర్సిటీలో ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ప్రశ్నిస్తే పోలీసులతో తరిమికొట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.వెయ్యి కోట్లకు బడ్జెట్ పెంచాలని పోరాటం చేస్తుండగా వీసీ అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ఫీజుల పెంపుపై ప్రశ్నిస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తామని కల్లబొల్లిమాటలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీ, స్కాలర్ కోట శ్రీనివాస్, క్రాంతిరాజు, ఖలీదాపర్వీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం

యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సెన్



రాయదుర్గం: భారత్– అమెరికా దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగు పడుతున్నాయని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లార్సెన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని హెచ్‌కే శేర్వానీ సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్ (హెచ్‌కేఎస్‌సీడీఎస్) ఆధ్వర్యంలో గురువారం ఒమర్ ఖాలీది హాల్‌ను వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జెన్నీఫర్ లార్సెన్ మాట్లాడుతూ.. డాక్టర్ ఖాలీది జీవితం కెరీర్ భారత్, యునైటెడ్ స్టేట్స్ మధ్య అకడమిక్, సోషల్ సర్కిల్స్‌లో వారధిగా పని చేశాయన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడడంలో ఖాలీది చేసిన కృషిని ఆమె కొనియాడారు. 'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ.. ఖాలిదీ కుటుంబం విరాళంగా అందించిన వివిధ భాషల్లోని మాన్యు స్క్రిప్టులు, పుస్తకాలతో కూడిన హాల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, అలియా ఖాలీది తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే మొదటి డబ్ల్యూటీసీ మెషీన్ ప్రారంభం


డబ్ల్యూటీసీ మెషీన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో మొదటిసారిగా బంగారం ఏటీఎం మెషీన్లను ఏర్పాటు చేసిన జెమ్‌ఓపెన్ క్యూబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నగరం వేదికగా మరో వినూత్న ఆవిష్కారానికి శ్రీకారం చుట్టారు. సంస్థ ఆధ్వర్యంలో బుధవారం హైటెక్‌సిటీలోని అవాసా హోటల్ వేదికగా ప్రపంచంలోనే మొదటి డబ్ల్యూటీసీ మెషీన్‌ను ప్రారంభించారు. ప్రముఖ సినీనటుడు మంచు మనోజ్, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ , బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ జిల్లెళ్లమూడి రమాదేవి పలువురు ఐపీఎస్ అధికారుల సమక్షంలో డబ్ల్యూటీసీ మెషీన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చేవెళ్ల లోక్‌సభ సభ్యుడు రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.., మానవ ప్రమేయం లేకుండానే ఈ డబ్ల్యూటీసీ యంత్రాలు పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో టీ, కాఫీ వాటర్ బాటిల్స్, బిస్కెట్లు పంపిణీ చేస్తుందన్నారు. తన ఆఫీసు కోసం మొదటి డబ్ల్యూటీసీ మెషీన్‌ను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇలాంటి వినూత్న ఆవిష్కరణను మార్కెట్‌లోకి తీసుకువచ్చిన సంస్థ డైరెక్టర్ వెంకట్ యాదవ్, సిఈఓ, ఆవిష్కర్త వినోద్ కుమార్‌లను మంచు మనోజ్ అభినందించారు. అవసరమైన పోషకాహారాన్ని అందించడానికి, రేషన్‌ను దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మెషీన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. దీనిని ఆటోమేటిక్ టీ షాప్ అని కూడా పిలుస్తారు, ఇది మానవ ప్రమేయం లేకుండా 24/7 పని చేస్తుంది, నిరుద్యోగ యువతకు మంచి ఆదాయంతో పాటు స్వయం ఉపాధికి ఉత్తమంగా పనిచేస్తుందని డైరెక్టర్ వెంకట్ యాదవ్ పేర్కొన్నారు. దీనికి ప్రపంచ వ్యాప్తంగా చైనా, జర్మనీ తదితర దేశాల్లో కూడా పేటెంట్ లభించిందని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ సీఈఆర్ఐ డైరెక్టర్ కెఎస్ఎన్ రావు, వసంత కార్ప్ చైర్మన్ వజ్జా శ్రీనివాసరావు, టిర్పో చైర్మన్ కేశవ రెడ్డి, సీవీఆర్ గ్రూప్ సీఈఓ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీకి 'న్యాక్ ఎ డబుల్ ప్లస్ గ్రేడ్'


గండిపేటలోని సీబీఐటీ కళాశాల

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలకు న్యాక్ ఎ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) పరిశీలన అక్రిడిటేషన్, మూల్యాంకన ప్రక్రియ తదితర ఏడు ప్రమాణాలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఉన్నత విద్యా సంస్థ ప్రధాన విధులు, కార్యకలాపాలు, పాఠ్యాంశాలు, బోధన, అభ్యాసం, మూల్యాంకనం, పరిశోధన, ఆవిష్కరణలు, విస్తరణ, మౌలిక సదుపాయాలు, వనరులు, విద్యార్థుల పురోగతి, పాలన నాయకత్వం, సంస్థాగత విలువలు అనే అంశాలపై పరిశీలన చేసి గ్రేడ్‌లను ఇస్తారన్నారు. వాటన్నింటిపై మే నెలలో 24,25 తేదీలలో కళాశాలను సందర్శించి పరిశీలించారన్నారు. వారి నివేదిక ఆధారంగా గురువారం తమ కళాశాలకు మూడవ సైకిల్‌లో ఏ ప్లస్ ప్లస్‌తో గుర్తింపు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సదరు గ్రేడ్ సాధించటం గొప్ప విజయమని అందుకు సహకరించిన కళాశాల యాజమాన్యం, సలహాదారులు, డైరెక్టర్లు, విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యాషన్






చీరకట్టు హుందాతనం మనకు సుపరిచితమే.
సంప్రదాయ వేడుకలైతే డిజైనర్ బ్లౌజ్‌ల హంగామా
క్యాజువల్ లుక్ కి ప్లెయిన్ బ్లౌజ్‌తో మ్యాచింగ్
మార్పులెన్ని చేసినా శారీ డ్రేప్ సెల్యూట్ చేయిస్తుంది.
క్యాజువల్‌గానూ, పార్టీవేర్‌గానూ
మురిపించే శారీ టాప్స్‌తో ఇప్పుడు స్టైలిష్‌గా వెలిగిపోతోంది.

శారీ టాప్స్




ఫ్రాక్
టైప్ టాప్, ఓవర్‌కోట్,
పెప్లమ్, లాంగ్ అండ్ షార్ట్ స్లీవ్స్,
కాలర్‌నెక్, రౌండ్‌నెక్ డిజైన్స్‌తో ఈ
శారీ టాప్స్ ఆధునికపు హంగుకు
అద్దమయ్యాయి. కార్పొరేట్ లుక్‌కి
క్లాసిక్ మార్కులు కొట్టేస్తూ
కనువిందు చేస్తున్నాయి.

కాటన్ శారీస్‌కు కరెక్ట్‌గా నప్పే ఈ టాప్స్ క్యాజువల్, కార్పొరేట్ లుక్‌తో ఆకట్టుకుంటున్నాయి.

ఫ్రాక్ టైప్ టాప్ పెప్లమ్ బ్లౌజ్‌కి దగ్గర పోలిక ఉంటుంది. వదులుగా ఉండటం వల్ల సౌకర్యంగానూ ఉంటుంది.

పట్టెడ అంచు చీర... ఈ పేరు విన్నారా?

మనింట్లో ఓ తొంభై ఏళ్ల నానమ్మ కానీ అమ్మమ్మ కానీ ఉందా? ఉంటే ఆమెన దగండి ఓ మాట. వాళ్ల యువ తరాన్ని ఆకట్టుకున్న చీరలేమిటి అని. ఎంతో ఉత్సాహంగా ఇప్పుడు మనం వినని ఎన్నో పేర్లు చెబుతారు. ఓ పది రకాల పేర్లు చెప్పి 'ఇప్పుడా నేత ఎక్కడ వస్తోంది. వచ్చినా ఈ తరంలో ఆ చీరలెవరు కట్టుకుంటారు. నేయడమే మానేసినట్లున్నారు' అని నిరుత్సాహంగా ముగిస్తారు. సరిగ్గా అలాంటి చీరలకు పూర్వ వైభవం తెస్తున్నారు కర్నాటకకు చెందిన హేమలత. హ్యాండ్‌లూమ్ లవర్స్ వార్డ్‌రోబ్‌లు రెండు వందల ఏళ్ల నాటి చేనేతలతో అలరారుతున్నాయి.

ఎటు కట్టినా ఓకే!

హేమలత... యూఎస్‌లోని కన్సాస్ యూనివర్సిటీలో ఉన్నత విద్య పూర్తి చేశారు. ఆమెకు మన చేనేత కళలో దాగిన సమున్నత జ్ఞానం మీద దృష్టి పడింది. ఒక దానికి ఒకటి విభిన్నంగా దేనికది ఒక శాస్త్రబద్ధమైన గ్రంథంలాంటి చేనేతల మీద అధ్యయనం మొదలు పెట్టారామె. నిఫ్ట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో ఇదే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్నారు. గిరిజనులు నివసించే ప్రదేశాల్లో విస్తృతంగా పర్యటించారు. వారి నేత తీరును పరిశీలించారు. ఈ క్రమంలో హేమలతా జైన్ 85 ఏళ్ల దేవదాసిని కలిశారు. ఆమె దగ్గరున్న పట్టెడ అంచు చీర రెండు వందల ఏళ్ల నాటి చేనేత కళ. ఈ చీరకు రెండు కొంగులుంటాయి. చీరను రెండు వైపులా కట్టుకోవచ్చు. రివర్సబుల్ శారీ అన్నమాట. పదవ శతాబ్దంలో గజేంద్రఘర్ జిల్లాలోని గ్రామాల్లోని చేనేత కారులు ఈ చీరలను నేసేవారు. అలాంటి చీరలిప్పుడు మార్కెట్‌లో లేవు. ఈ తరంలో ఎవరి దగ్గరా లేవు. ఆ చీరను చూపించి మరొక చీర తయారు చేయించాలంటే ఆ రకమైన నేత నేసే చేనేతకారులు కూడా లేరన్న మరో వాస్తవం తెలిసి వచ్చిందామెకు. అలాంటి అంతరించిపోతున్న డిజైన్‌లు 45 వరకు ఉన్నాయి.


పట్టెడ అంచు చీర నేస్తున్న యువతి


హేమలతా జైన్

అక్షరాల మగ్గం

అందమైన చేనేత అంతరించిపోవడానికి మూలకారణం అర్థమైంది. పరిష్కారంగా 'పునర్జీవన' పేరుతో ట్రస్ట్ ప్రారంభించి గడచిన తరానికి చెందిన నలుగురు చేనేతకారులతో అనుసంధానం చేశారు. కర్నాటక వస్త్ర ప్రపంచాన్ని ఒకప్పుడు రాజ్యమేలిన 'గోమి తేని, హుబ్లీ, అన్నెహెజ్జె, సదా పాట, సుధా కాడి, లకుండి, గుజ్జు, ధోత్రా వంటి పద్నాలుగు రకాలకు పునరుజ్జీవం పొందాయి. ఆమె ప్రయత్నం ఇంకా కొనసాగుతోంది. ఇప్పుడు 55 మంది చేనేతకారులు పునర్జీవతో కలిసి పని చేస్తున్నారు. వారందరికీ నెలనెలా స్థిరమైన ఆదాయం వచ్చే ఏర్పాటు చేశారామె. ఉపాధికి భరోసా దొరకడంతో ఈ చేనేతలను నేర్చుకునే కొత్త తరం తయారవుతోంది. ఒక కళలో కొత్తతరం నైపుణ్యం సంపాదిస్తోంది అంటే... ఆ కళ మరో రెండు తరాల వరకు నిలిచి ఉంటుందని అర్థం. చేనేత కళను శాస్త్రబద్ధంగా గ్రంథస్తం చేయని రోజుల్లో తండ్రి నుంచి కొడుకుకు వారసత్వంగా మాత్రమే కొనసాగేది. ఈ తరం చేనేత కారులు ఈ కళలన్నింటినీ గ్రంథస్థం చేయగలుగుతున్నారు. మగ్గం మీద దిద్దుకునే శాస్త్రం అక్షరరూపం దాలుస్తోంది. వీటన్నింటినీ హేమలత పరిశోధన గ్రంథంగా రూపుదిద్దనున్నారు. కాబట్టి ఇది ఇక శాశ్వతంగా నిలిచి ఉంటుంది. హేమలత చేపట్టిన బృహత్కార్యం కర్నాటక చేనేతలను పరిరక్షిస్తోంది.

బ్యూటిప్స్

నిగనిగల కురుల కోసం...

- రెండు గుడ్ల సొనను తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమంలో అలోవెరా జ్యూస్‌ను కూడా కలపాలి. దీనిని మాడు నుంచి జుట్టు చివర్ల వరకు పట్టించి అరగంట తరువాత గోరువెచ్చటి నీటితో ఏదైనా మైల్డ్ షాంపూ పెట్టుకుని తలస్నానం చేయాలి. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల గుడ్డులోని ప్రొటీన్, అలోవెరాలోని మెరుపు అంది కేశాలు దృఢంగా ఒత్తుగా ఆరోగ్యంగా పెరుగుతాయి.
- కొన్ని ఉల్లిపాయ ముక్కలను మెత్తగా గ్రైండ్ చేసి రసం తీసుకోవాలి. ఇందులో చిటికెడు కర్పూరం పొడిని కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి గంట తరువాత బేబీషాంపుతో తలస్నానం చేయాలి.. వారానికి రెండు సార్లు ఇలా చేస్తుంటే తలలోని పేలు పోయి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.



కిచెన్ టిప్స్

- కూరల్లో పెరుగు వేసేటప్పుడు గరిటెతో తీసి నేరుగా వంటలో కలిపేయకూడదు. పెరుగును ఒక కప్పులో వేసి స్పూన్‌తో చిలికి సమంగా కలిసిన తర్వాత కూరలో వేయాలి. అప్పుడే గ్రేవీ అంతటికీ ఒకేరకమైన చిక్కదనం వస్తుంది.
- గసగసాలను మసాలా రుబ్బడానికి ముందు పది నిమిషాల సేపు వేడి నీటిలో నానబెట్టాలి. ఇలా చేస్తే గసాలు మెత్తగా మెదుగుతాయి, మసాలా మృదువుగా, కొద్దిపాటి జిగురుగా కూడా వస్తుంది.
- పాలు మాడకుండా ఉండాలంటే కాచే ముందు గిన్నెలో కొద్దిగా చన్నీరు పోసి వంపేయాలి. పొడిగా ఆరిన గిన్నెలో నేరుగా పాలు పోసి కాచినప్పుడు పాలు అడుగుపట్టి మాడిపోతాయి.
- అల్లం, వెల్లుల్లి మసాలాను నిల్వ చేయాల్సి వస్తే అందులో కొద్దిగా ఉప్పు, టీ స్పూన్ వేడి నూనె కలపాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టకపోయినా సరే రెండు రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఫ్రిజ్‌లో పెడితే వారం రోజుల వరకు రంగు మారకుండా అప్పుడే తాజాగా ఉంటుంది.
- రైజిన్స్ (కిస్‌మిస్)ని గట్టి మూత ఉన్న డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే నెలలపాటు తాజాగా ఉంటాయి. ఫ్రిజ్‌లో నుంచి తీసిన తర్వాత రైజిన్స్‌ని ఒక స్ట్రెయినర్‌లో వేసి వేడి నీరు పోస్తే చల్లదనం తగ్గి మృదువుగా మారడంతోపాటు దుమ్ము వదిలి శుభ్రపడతాయి కూడా.
- కొత్తబియ్యంతో అన్నం ముద్ద అవుతుంటుంది. బియ్యం ఉడికేటప్పుడు నీటిలో కొద్దిగా నిమ్మరసం లేదా కొన్ని చుక్కల నూనె లేదా నెయ్యి వేస్తే అన్నం ముద్దకాదు, ప్రతి మెతుకు విడిగా ఉంటుంది. పులిహోర కోసం అన్నం వండేటప్పుడు ఈ చిట్కా తప్పని సరిగా పాటించాలి.
- చోలే కర్రీ చేయాలంటే పచ్చి శనగలను రాత్రంతా నానబెట్టాలి. ఒకవేళ రాత్రి నానబెట్టడం మర్చిపోతే ఉదయాన్నే నీటిని మరిగించి అందులో పచ్చిశనగలను ఓ గంట సేపు నానబెట్టి ఆ తర్వాత ఉడికిస్తే మెత్తగా ఉడుకుతాయి. రాజ్మా గింజలకూ ఇదే పద్ధతి.







వంటిల్లు

టేస్టీగా.. వెరైటీగా...

తియ్యని బ్రేక్‌ఫాస్ట్,
కమ్మని లంచ్,
కరిగిపోయే డిజర్ట్,
కారంగా, కరకరలాడే
డిన్నర్ డిష్‌లతో
ఈ వారం వంటిల్లు
వచ్చేసింది...

స్వీట్ ఇడ్లీ



కావలసినవి: బియ్యం రవ్వ – కప్పు; పనస తొనలు – మూడు కప్పులు ; పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – అరకప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నెయ్యి – టేబుల్ స్పూను.

తయారీ: ● పనసతొనలను విత్తనాలు తీసేసి ముక్కలుగా తరగాలి. ● ఈ ముక్కలకు.. కొబ్బరి తురుము, బెల్లం తరుగులను జోడించి నీళ్లుపోయకుండా మెత్తగా రుబ్బుకోవాలి. ● ఈ మిశ్రమంలో బియ్యం రవ్వ, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి. మిశ్రమం కాస్త చిక్కగానే ఉండాలి. ● ఇడ్లీప్లేటుకు నెయ్యి రాసి మిశ్రమాన్ని వేసి సన్నని మంటమీద ఇరవై నిమిషాలు ఉడికిస్తే స్వీటిడ్లీ రెడీ. నెయ్యి లేదా తేనెతో సర్వ్ చేసుకుంటే చాలా రుచిగా ఉంటుంది.

మంగోలీసియస్ డిజర్ట్



కావలసినవి: మామిడి పండ్లు – రెండు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు, బాదం పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; జీడిపప్పు పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తా పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సేమియా – అరకప్పు; పాలు – నాలుగు కప్పులు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ● మామిడి పండు తొక్క, టెంక తీసేసి, ముక్కలుగా తరిగి ప్యూరీలా గ్రైండ్ చేయాలి. ● టేబుల్ స్పూను నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్‌ను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ● ఇదే బాణలిలో మిగతా నెయ్యి వేసి సేమియాను దోరగా వేయించాలి. ● సేమియా వేగాక, పాలు పోసి పదినిమిషాలు కాగనివ్వాలి. ● పాలు మరిగాక చక్కెర వేసి కరిగేంత వరకు తిప్పి దించేసి చల్లారనివ్వాలి. ●చల్లారిన పాల మిశ్రమంలో మామిడి పండు ప్యూరీ, డ్రైఫ్రూట్స్ వేసి కలిపి రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. ● అరగంట తరువాత బయటకు తీసి ఒకసారి కలుపుకుని సర్వ్ చేసుకోవాలి.

పల్లి పలయం చికెన్



కావలసినవి: చికెన్ ముక్కలు – అరకేజీ; సాంబారు ఉల్లిపాయలు (చిన్నవి) – పది; వెల్లుల్లి రెబ్బలు – పది; నూనె – రెండు టేబుల్ స్పూన్లు; ఎండు మిర్చి – 12 ; పసుపు – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; పచ్చి కొబ్బరి ముక్కలు – పావు కప్పు (సన్నగా తరగాలి); కరివేపాకు – ఐదు రెమ్మలు; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను.

తయారీ: ● చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ● ఉల్లిపాయలు, వెల్లుల్లి తొక్కతీసి ముక్కలుగా తరిగి పేస్టుచేసి పక్కనపెట్టుకోవాలి. ● స్టవ్ మీద బాణలి పెట్టి నూనె వేయాలి. కాగిన నూనెలో ఎండుమిర్చిని చిన్నముక్కలుగా చేసి వేయాలి. ● మిర్చి వేగాక, ఉల్లి, వెల్లుల్లి పేస్టుని వేసి పచ్చి వాసన పోయేంత వరకు వేయించాలి. ● ఇప్పుడు చికెన్, పసుపు, కరివేపాకు, రుచికి సరిపడా ఉప్పువేసి తిప్పాలి. ఐదు నిమిషాల తరువాత కొబ్బరి ముక్కలు వేసి కలపాలి. ● మూతపెట్టి సన్నని మంట మీద చికెన్‌లో వచ్చిన నీరంతా ఇగిరి పోయే వరకు ఉడికించాలి. ● దాదాపు అరగంట తరువాత చికెన్ ముక్కలు చక్కగా పొడిపొడిగా వేగుతాయి. ఇప్పుడు కొత్తిమీర చల్లుకుని దించేస్తే పల్లిపలయం చికెన్ ఫ్రై రెడీ.

సూకా మటన్



కావలసినవి: మటన్ ముక్కలు – అరకేజీ; అల్లం వెల్లుల్లి పేస్టు – ఒకటిన్నర టీస్పూన్లు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు; వెల్లుల్లి రెబ్బలు – పదిహేను; టొమాటో తరుగు – అరకప్పు; పసుపు – పావు టీస్పూను; కారం – రెండు టీస్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

సుక్కా మసాలా: ధనియాలు – టీస్పూను; సోంపు – టీస్పూను ; జీలకర్ర – అరటీస్పూను; ఎండు మిర్చి – రెండు; మిరియాలు – అరటీస్పూను (వీటన్నింటిని వేయించి పొడిచేసుకోవాలి)

తాలింపు కోసం: నూనె – రెండు టేబుల్ స్పూన్లు, దాల్చిన చెక్క – అరంగుళం ముక్క; లవంగాలు – రెండు; యాలకులు – రెండు ; బిర్యానీ ఆకు – ఒకటి; కరివేపాకు – రెండు రెమ్మలు.

తయారీ: ● మటన్ ముక్కలను శుభ్రంగా కడిగి ప్రెజర్ కుకర్ గిన్నెలో వేయాలి. దీనిలో.. పసుపు, పావు టీస్పూను కారం, కొద్దిగా ఉప్పు వేసి కలపాలి. కొద్దిగా నీళ్లుపోసి, మీడియం మంట మీద ఆరు విజిల్స్ రానిచ్చి పక్కన పెట్టుకోవాలి.

● బాణలిలో నూనె వేసి కాగాక, కరివేపాకు తప్పించి తాలింపు దినుసులు ఒక్కొక్కటిగా వేసి వేయించాలి. ఇవన్నీ వేగాక ఉల్లితరుగు, తురిమిన వెలుల్లిని వేసుకోవాలి. ● ఉల్లి మిశ్రమం బ్రౌన్ కలర్‌లోకి మారాక టొమాటో తరుగు వేయాలి. ● టొమాటో పచ్చివాసన పోయాక ఉడికించిన మటన్, కారం, మసాలా పొడి వేయాలి. ● పది నిమిషాలు వేగాక కరివేపాకు, రుచికి సరిపడా ఉప్పు వేసి తిప్పాలి. నూనె పైకి తేలేంత వరకు వేయిస్తే సూకా మటన్ రెడీ.

యువ



● ఇంగ్లిష్ ఇడియమ్స్

రాక్ యువర్ బ్రెయిన్స్/ రాక్ యువర్ బ్రెయిన్

ఏదైనా పేరు, సంఘటన గుర్తు చేసుకోవడానికి, మరేదైనా విషయంలోగానీ మెదడుకు గట్టిగా పనిచెప్పే సందర్భంలో వాడతారు.

ఉదా: ఐయామ్ ర్యాకింగ్ మై బ్రెయిన్. బట్ ఐ జస్ట్ కాంట్ థింక్ ఆఫ్ హిజ్ నేమ్.



బాల్‌పార్క్ ఫిగర్/ ఏ బాల్‌పార్క్ ఎస్టిమేట్

ఏదైనా పని, నిర్మాణానికి సంబంధించి 'ఇంత ఖర్చు ఉండవచ్చు' అని సుమారుగా చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు.

ఉదా: వుయ్ డోన్ట్ నో ది ఎగ్జాక్ట్ కాస్ట్. బట్ ఏ బాల్‌పార్క్ ఫిగర్ వుడ్ బీ ఎరౌండ్ సిక్స్ మిలియన్ డాలర్స్

జంప్ ఔట్ ఆఫ్ స్కిన్

ఏదైనా ఆకస్మిక, ఆశ్చర్యకరమైన సంఘటన జరిగినప్పుడు వాడుతారు. ఉదా: ది లౌడ్ నాయిస్ మేడ్ మీ జంప్ ఔట్ ఆఫ్ మై స్కిన్

ఉత్తమ చిత్ర పురుషోత్తమన్

మోస్ట్ పాపులర్

న్యూయార్క్‌లోని టైమ్స్‌స్క్వేర్ బిల్‌బోర్డ్‌పై ప్రదర్శించిన ఆ ఆర్ట్‌వర్క్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది. సెల్‌ఫోన్స్‌తో ఫొటోలు తీసుకొంటూ 'వావ్' అన్నారు. ప్రేక్షకులే కాదు కళావిమర్శకులు కూడా 'బ్రహ్మాండం' అన్నారు. ఆ ఆర్ట్‌వర్క్‌ను సృష్టించింది బెంగళూరుకు చెందిన అజయ్ పురుషోత్తమన్...


● అజయ్ పురుషోత్తమన్

బెంగళూరులోని ఒక ఎడ్వర్‌టైజింగ్ కంపెనీలో ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అజయ్ పురుషోత్తమన్‌కు చిన్నప్పుడు చాలామంది పిల్లలలాగే బొమ్మలు వేయడం అంటే ఇష్టం. కార్టూన్ క్యారెక్టర్లు అంటే బోలెడు ఇష్టం. తన అభిమాన క్యారెక్టర్‌లను గీయడంలో ప్రాక్టిస్ చేస్తుండేవాడు. ఈ ఆసక్తి స్కూల్ రోజుల నుంచి కాలేజి రోజుల వరకు వచ్చింది.

2డీ ఆర్ట్, త్రీడి ఆర్ట్‌లతో ప్రయోగాలు చేస్తుండేవాడు. తనకు తెలిసిన కథలను యానిమేషన్ మరియు త్రీడి మోడలింగ్‌లోకి తీసుకువచ్చాడు.

ఎన్నో సొంత ప్రాజెక్టులు చేసేవాడు.

నాన్-ఫంగిబుల్ టోకెన్స్ (ఎన్‌ఎఫ్‌టీ)లు చిత్రకళ, సంగీతం, క్రీడా ప్రపంచంలోకి వచ్చాక ఎన్నో అవకాశాలకు దారులు తెరుచుకున్నాయి. ఈ అవకాశాన్ని, ట్రెండ్‌ను అందిపుచ్చుకొని మన దేశంలోని 'మోస్ట్ పాపులర్ ఎన్‌ఎఫ్‌టీ క్రియేటర్'లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నాడు అజయ్ పురుషోత్తమన్. తనకు వచ్చే కంటెంట్ ఐడియాలతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీ మొదలుపెట్టాడు. తనలోని సృజనకు సంబంధించి అవతలి కోణాన్ని చూపెట్టే ప్రయత్నం చేశాడు. తాను రూపొందించిన ఎన్‌ఎఫ్‌టీలను రకరకాల డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై అమ్మకం మొదలు పెట్టాడు. తన ఆర్ట్ మన దేశానికి మాత్రమే పరిమితం కావాలని అజయ్ అనుకోలేదు. 'అక్కడ ఏం జరుగుతుంది' అంటూ అంతర్జాతీయ ఆర్ట్‌పై దృష్టి పెట్టాడు. ట్రెండ్ ఏమిటో తెలుసుకున్నాడు. హాలివుడ్ కలెక్షన్స్‌కు శ్రీకారం చుట్టాడు. అంతర్జాతీయంగా ప్రసిద్ధులైన గాయకుల త్రీడీ బాటిల్ ఆర్ట్‌ను రూపొందించాడు. ప్రయాణాలు అంటే అజయ్‌కు ఇష్టం. ఎందుకంటే స్థానిక సంస్కృతి, సంప్రదాయలను తెలుసుకోవచ్చు. అలా తెలుసుకున్నది తన కళలోకి వచ్చి చేరుతుంది. బలాన్ని ఇస్తుంది.

న్యూయార్క్‌లో జరిగే 'ఎన్‌ఎఫ్‌టీ ఎన్‌వైసీ' ప్రదర్శన 'ఎన్‌ఎఫ్‌టీ'పై ఆసక్తి, ఉత్సాహం ఉన్న వారిని ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చే వేదిక. ఈ ఉత్సవానికి అజయ్ హాజరు కానప్పటికీ అతడి చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. ప్రశంసలు అందుకున్నాయి.

'మన ఆర్ట్‌ను ప్రపంచ వేదిక మీదికి తీసుకువచ్చినందుకు సంతోషంగా ఉంది' అంటాడు అజయ్. న్యూయార్క్ టైమ్స్‌స్క్వేర్ బిల్‌బోర్డ్‌పై తన ఆర్ట్‌వర్క్ ప్రదర్శించడం అజయ్ పురుషోత్తమన్‌ని ఎంతో సంతోషానికి గురిచేసింది. మొదట దీని గురించి విన్నప్పుడు 'కలా నిజమా!' అనుకున్నాడు.

ఆ దృశ్యాన్ని కళ్లారా చూడాలనుకున్నాడు. సన్నిహితుల సహాయంతో న్యూయార్క్‌కు వెళ్లి 'ఇంతకు మించిన ఆనందం ఏమున్నది!' అనుకున్నాడు.

గత సంవత్సరం అజయ్ మొదలుపెట్టిన 'టాయ్ స్టోరీస్ ప్రొఫైల్' చాలామందిని ఆకట్టుకుంది. ఈ యానిమేషన్ సిరీస్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక హిప్-హప్ పాటకు డ్యాన్స్ చేస్తాడు. 'షోలే' సినిమాలోని క్యారెక్టర్లు అన్నీ కలిసి ఒక పాటకు డ్యాన్స్ చేస్తాయి! నిజజీవితంలోని ప్రముఖ వ్యక్తులు ఈ సిరీస్‌లోని క్యారెక్టర్లు. ప్రతి క్యారెక్టర్‌కు తనదైన ప్రత్యేకత ఉంటుంది. రాబోయే ప్రాజెక్ట్‌ల విషయానికి వస్తే వెబ్3, ఎన్‌ఎఫ్‌టీకి సంబంధించి ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్ కోసం అర్జెంటీనా ఆర్టిస్ట్‌తో కలిసి పనిచేస్తున్నాడు.

'ఇది సవాళ్లతో కూడిన ప్రయాణం' అంటున్నాడు అజయ్. సాధారణ ఆర్టిస్ట్ నుంచి అంతర్జాతీయ స్థాయికి చేరుకున్న అజయ్ పురుషోత్తమన్ ఆ సవాళ్లను అధిగమించి మరింత పేరు తెచ్చుకోవాలని ఆశిద్దాం.

వివో ఎక్స్ ఫ్లిప్



డిస్‌ప్లే: 6.74 అంగుళాలు
ఓఎస్ : ఆండ్రాయిడ్ 13
ఫ్రంట్ కెమెరా : 32 ఎంపీ
బ్యాటరీ : 4400 ఎంఏహెచ్
కనెక్టివిటీ : 5జీ డ్యూయల్ సిమ్
బరువు : 198గ్రా. మోమరీ: 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్

● టెక్.. టాక్

గో ప్రొ హీరో 11 కెమెరా



- సినిమాటిక్ 5.3కె60 + 2.7కె240 వీడియో
- రీఛార్జబుల్ బ్యాటరీ
- వాటర్ ప్రూఫ్
- ఆటోమేటిక్ హైలెట్ వీడియో
- లార్జర్ న్యూ ఇమేజ్ సెన్సర్
- హైపర్‌స్మూత్ 5.0 స్టెబిలైజేషన్
- డ్యూయల్ ఎల్‌సీడీ స్క్రీన్స్

గూగుల్‌లో కొత్త ఎడిటింగ్ ఆప్షన్స్

ఫొటోస్.గూగుల్.కామ్‌లో కొత్త ఎడిటింగ్ ఆప్షన్స్...



పోట్రాయిట్‌లైట్	: లైట్ సోర్స్‌ను ఎడ్జెస్ట్ చేసుకోవచ్చు.
పోట్రాయిట్ బ్లర్	: బ్లర్‌డ్ బ్యాక్‌గ్రౌండ్‌ను క్రియేట్ చేయడానికి.
కలర్ పాప్	: బ్యాక్‌గ్రౌండ్ కలర్‌ను ఫేడింగ్ చేయడం ద్వారా ఫొటోలో ముందువైపు రంగును ప్రత్యేకంగా కనిపించేలా చేయడం.
హెచ్‌డీఆర్	: బ్రైట్‌నెస్, ఇమేజ్‌లోని కాంట్రాస్ట్ లెవెల్స్‌ను బూస్ట్ చేయడానికి.
స్కై	: ఎన్నో రకాల కలర్ స్కీమ్స్‌ను ఎంచుకోవచ్చు.

గార్మిన్ వాచ్



అమెరికన్ మల్టీ స్పోర్ట్ వాచ్ బ్రాండ్ గార్మిన్ కొత్త ఆప్షన్‌లతో ఫెనిక్స్ 7 ప్రో, ఎఫిక్స్2 ప్రో సిరీస్‌లను తీసుకు వచ్చింది. వీటిలో కొత్త మ్యాపింగ్, ట్రైనింగ్ ఫీచర్స్, హ్యాండ్-ఫ్రీ ఫ్లాష్‌లైట్‌లు, హార్ట్‌రేట్ సెన్సర్‌లు ఉన్నాయి. ఎఫిక్స్2 మోడల్స్: 42ఎంఎం, 47 ఎంఎం, 51 ఎంఎం

● ఆర్ట్ అండ్ కల్చర్

సూపర్ మోడల్



అయిదు అడుగుల తొమ్మిది అంగుళాల ఎత్తు ఉండే ఆండ్రియా కెవిచూసా పదిహేను సంవత్సరాల వయసులో మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టి, పదిహేడు సంవత్సరాల వయసు వచ్చేసరికి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఎంతోమంది ప్రముఖులతో, ఎన్నో ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్స్ చేసింది.

నాగాలాండ్‌కు చెందిన ఆండ్రియాకు సూపర్ మోడల్ లెనో కెన్స్ రోల్‌మోడల్. నాగాలాండ్ మూలాలు మోడలింగ్‌లో ఆండ్రియాకు స్పెషల్ లుక్ ఇచ్చాయి. 'మోడల్‌లింగ్‌లో ఎంతో మంది పరిచయం అవుతుంటారు. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. ప్రశంసను ఎలా ఆనందంగా స్వీకరిస్తామో, విమర్శను కూడా అలాగే ఆమోదించాలి. సలహాలు తీసుకోవాలి. మనకంటూ పేరు రావడం మంచిదేగానీ కాళ్లు మాత్రం నేలమీదే ఉండాలి. పరిణతితో కూడిన మనస్తత్వం ఈ ఫీల్డ్‌లోనే కాదు మన జీవితం మొత్తం ఉపయోగపడుతుంది' అంటుంది ఆండ్రియా 'అనేక్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఆండ్రియా. ఈ సినిమాలో తాను పోషించిన బాక్సర్ పాత్ర కోసం బాక్సింగ్‌లో కఠిన శిక్షణ తీసుకుంది. బైక్ రైడింగ్ నేర్చుకుంది. తన హిందీని మెరుగుపరుచుకుంది. డ్యాన్స్, యాక్షన్ ట్రైనింగ్ క్లాస్‌లకు హాజరైంది. ఈ శ్రమ వృథా పోలేదు. ఆమె నటప్రతిభ డైరెక్టర్, రైటర్ అనుభవ్ సిన్హాకు ఎంతో నచ్చింది. ఒక పెద్ద దర్శకుడి నుంచి ప్రశంస అందుకోవడాన్ని మించిన పెద్ద అవార్డ్ ఏముంటుంది! 'నా ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. వివక్షపూరిత మాటలు ఎన్నో విన్నాను. వాటిని పట్టించుకొని ఉంటే ఎక్కడో ఆగిపోయేదాన్ని' అంటుంది 22 సంవత్సరాల ఆండ్రియా కెవిచూసా.

● గేమింగ్

అర చేతిలో నరకం



యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ 'ఫైనల్ ఫాంటసీ-16' ఈ నెల 22న విడుదల అవుతుంది. 'వాలిస్టియా' అనే కాల్పనిక ప్రపంచంలో జరిగే గేమ్ ఇది. ఎన్నో శక్తులు ఈ ప్రపంచంపై ఆధిపత్యం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. ఈ ప్రపంచంలో ఒకవైపు కారాగారాలు, మరో వైపు విశాలమైన బహిరంగ క్షేత్రాలు ఉంటాయి. గేమ్‌లో 'స్టోరీ మోడ్' 'నార్మల్ మోడ్'లు ఉంటాయి. ఈ గేమ్‌లో ప్రొటాగనిస్ట్ పేరు...క్లైవ్. ఈ క్లైవ్‌కు 'వాలిస్టియా' ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలపై పట్టు ఉంటుంది. 'అంచనాలకు తగినట్లుగా కాదు అంచనాలకు మించి ఆకట్టుకునేలా గేమ్‌ను తీర్చిదిద్దాం' అంటున్నాడు క్రియేటివ్ డైరెక్టర్ కజు టోయో.

జానర్స్	: యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్, ఫైటింగ్ గేమ్, ఎడ్వెంచర్ గేమ్
మోడ్స్	: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్స్	: ప్లేస్టేషన్ 5

సినిమా

పడతారండి ప్రేమలో మళ్లీ..!



● నాగ చైతన్య


● ప్రభాస్
● విజయ్ దేవరకొండ

నిన్నమొన్నటివరకూ పాన్ ఇండియా ట్రెండ్‌లో యాక్షన్ సినిమాలొచ్చాయి. అయితే ఇప్పుడు ఇండస్ట్రీలో మళ్లీ లవ్‌ట్రెండ్ మొదలైంది. యాక్షన్ సినిమాలు చేస్తున్న హీరోలు మళ్లీ వెండితెరపై ప్రేమలో పడటానికి ప్రేమకథలు వింటున్నారు. కొందరి ప్రేమకథలు ఆల్రెడీ ఆన్ సెట్స్‌లో ఉన్నాయి. ఈ వెండితెర ప్రేమికుల ప్రేమకథా చిత్రాల గురించి తెలుసుకుందాం.

● ప్రభాస్ అనగానే సినిమా లవర్స్ ఎక్కువగా 'బాహుబలి', 'ఛత్రపతి', 'మిర్చి', 'సాహో' వంటి యాక్షన్ మూవీస్ గురించి మాట్లాడుకుంటారు. కాగా ప్రభాస్ కెరీర్‌లో మంచి హిట్స్ సాధించిన 'వర్షం', 'డార్లింగ్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్' వంటి ప్రేమకథా చిత్రాలు కూడా ఉన్నాయి. అయితే గడచిన పదేళ్లల్లో ప్రభాస్ 'రాధేశ్యామ్' (2022) తప్ప అన్నీ యాక్షన్ చిత్రాలే చేశారు. ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె' సినిమాలతో యాక్షన్ మోడ్‌లోనే ఉన్నారు. మళ్లీ ఓ ప్రేమకథ చేయాలని ప్రభాస్ భావిస్తున్నారట. ఇందులో భాగంగా లవ్ స్టోరీస్ స్పెషలిస్ట్ డైరెక్టర్ హను రాఘవపూడి రెడీ చేసిన ఓ ప్రేమ కథను ప్రభాస్ విన్నారని, ఇది పీరియాడికల్ లవ్‌స్టోరీ అనీ సమాచారం.

● '100 పర్సెంట్ లవ్', 'ఏ మాయ చేసావె', 'మనం', 'ఒక లైలా కోసం', 'ప్రేమమ్', 'మజిలీ', 'లవ్‌స్టోరీ'.... ఇలా చెప్పుకుంటూ పోతే నాగచైతన్య కెరీర్‌లోని మేజర్ పార్ట్ అంతా ప్రేమతోనే నిండి పోయి ఉంటుంది. కాగా తన గత చిత్రం 'కస్టడీ'లో నాగ చైతన్య ఎక్కువగా యాక్షన్ చేశారు. అయితే చైతూ తన ప్రేమతో మరో సారి ఆడియన్స్‌ను ప్రేమలో పడేయనున్నారని తెలుస్తోంది. నాగచైతన్య హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. సూరత్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే ఓ లవ్‌స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కనుందని, ఇందులో నాగచైతన్య బోటు డ్రైవర్ పాత్ర చేయనున్నారనీ టాక్.


● అఖిల్

● 'హలో', 'మిస్టర్ మజ్ను', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'... ఇలా కొన్ని ప్రేమకథల్లో నటించారు అఖిల్. అయితే అఖిల్ గత చిత్రం 'ఏజెంట్' ఫుల్ యాక్షన్ ఫిల్మ్. దీంతో తన తర్వాతి చిత్రాన్ని లవ్ జానర్‌లోనే చేయాలనుకుంటున్నారట అఖిల్. ఈ క్రమంలోనే అనిల్‌కుమార్ అనే ఓ కొత్త దర్శకుడి కథకు అఖిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనీ, ఫ్యాంటసీ లవ్‌స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం ఉంటుందని, 'ధీర' టైటిల్‌ను పరిశీలిస్తున్నారనీ టాక్.

● హీరో విజయ్ దేవరకొండ కెరీర్‌లో ప్రేమ, మాస్ కథలు సమానంగా కనిపిస్తాయి. కానీ విజయ్‌కు ఇండస్ట్రీలో మంచి గుర్తింపును తెచ్చిపెట్టింది మాత్రం మాస్ లవ్‌స్టోరీ 'అర్జున్ రెడ్డి', క్లాస్ లవ్‌స్టోరీస్ 'పెళ్లి చూపులు', 'గీత గోవిందం' వంటి సినిమాలే. దీంతో విజయ్ మరోసారి లవ్‌స్టోరీస్‌పై ఫోకస్ పెట్టినట్లు ఉన్నారు. దర్శకుడు శివ నిర్వాణతో విజయ్ ప్రస్తుతం 'ఖుషి' అనే లవ్‌స్టోరీ చేస్తున్నారు. ఇందులో సమంత హీరోయిన్. అలాగే 'గీత గోవిందం' తర్వాత దర్శకుడు పరశురామ్‌తో మరో సినిమా చేస్తున్నారు విజయ్. ఇది కూడా ప్రేమ కథా చిత్రమేనన్నది ఫిల్మ్‌నగర్ టాక్.

● 'డీజే టిల్లు'తో మరింత పాపులారిటీని సాధించిన సిద్ధు జొన్నలగడ్డ కెరీర్‌లో 'కృష్ణ అండ్ హిజ్ లీల', 'మా వింత గాథ వినుమా' వంటి ప్రేమకథా చిత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం సిద్ధు 'డీజే టిల్లు స్క్వేర్'తో బిజీగా ఉన్నారు. అలాగే దర్శకురాలు నందినీ రెడ్డితో ఓ సినిమా కమిట్ అయ్యారు. ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కనుందని టాక్.


● సిద్ధు


● ఆనంద్ దేవరకొండ

● 'దొరసాని' వంటి ప్రేమకథతో పరిచయం అయిన ఆనంద్ దేవరకొండ ఆ తర్వాత 'హైవే' వంటి క్రైమ్ థ్రిల్లర్ చేశారు. ఆనంద్ నటించిన మరో లవ్‌స్టోరీ 'బేబీ'. ప్రేమకథా చిత్రంగా సాయిరాజేష్ తెరకెక్కించిన ఈ చిత్రం జూలై 14న రిలీజ్ కానుంది. మరికొందరు హీరోలు కూడా ఆడియన్స్‌ను ప్రేమలో పడేసేందుకు ప్రేమకథలు వింటున్నట్లు తెలుస్తోంది.

ఆత్మపరిశీలన చేసుకున్నా!

- సమంత



"ఈ ఏడాది ఎప్పుడూ చేయనన్ని పూజలు, ప్రార్థనలు చేశా. నాకు వరాలు ఇమ్మని, దీవెనలు అందించమని కాదు. శక్తిని, ప్రశాంతతను ఇవ్వమని దేవుణ్ణి ప్రార్థించా. మన ప్రార్థనలను ఆలకించడంలో భగవంతుడు కొన్నిసార్లు ఆలస్యం చేస్తాడేమో కానీ, ఎలాంటి స్వార్థం లేని శాంతి, ప్రేమ, సంతోషం, శక్తిని కోరుకుంటే కాదనడు" అని సమంత పేర్కొన్నారు. మయోసైటిస్ కారణంగా కొన్ని నెలలు షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చిన సమంత కోలుకుని సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. ప్రస్తుతం రాజ్-డీకే ద్వయం తెరకెక్కిస్తున్న 'సిటాడెల్' వెబ్ సిరీస్ షూటింగ్ కోసం సెర్బియాలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి 'సెర్ప్ ఆఫ్ సెయింట్ సావా'ను సందర్శించి ప్రార్థనలు చేశారామె. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి, మయోసైటిస్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ తన జీవిత ప్రయాణం ఎలా సాగిందో ఓ సుదీర్ఘమైన పోస్టు చేశారామె.

"మయోసైటిస్ వ్యాధి నిర్ధారణ అయి ఏడాది అవుతోంది. ఈ ఏడాదిలో ఎప్పుడూ ఊహించని కొత్త పరిస్థితుల్ని ఎదుర్కొన్నాను. నా శరీరంతో ఎన్నో పోరాటాలు చేశా. ఇష్టమైన ఆహారాన్ని బలవంతంగా వదులుకున్నా. మందులే ఆహారం అయ్యాయి. ఆలోచించడం, ఆత్మపరిశీలన చేసుకోవడంతోనే ఈ ఏడాది సరిపోయింది. వ్యక్తిగతంగానే కాకుండా వృత్తిపరమైన పరాజయాల విషయంలోనూ ఆత్మపరిశీలన చేసుకున్నా. పరిస్థితులను మెరుగుపరచమని కోరుతూ దేవుడికి ఎన్నో ప్రార్థనలు చేశా. అన్నీ మనకు అనుకూలంగానే జరగవన్న విషయం ఈ ఏడాది నేర్పించింది. ముఖ్యంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఫర్వాలేదని తెలుసుకున్నా. నా చేతుల్లో లేనిదాన్ని వదిలేయడం నేర్చుకున్నాను. కొన్నిసార్లు గొప్ప విజయాలు అక్కర్లేదు. పరిస్థితి నుంచి బయటపడటమూ ఒక విజయమే. ప్రతిదీ పరిపూర్ణం కావాలని ఎదురు చూడకూడదు.. గతాన్ని తలుచుకుంటూ అక్కడే ఆగిపోకూడదు. నన్ను ప్రేమించే వారిని ప్రేమిస్తాను.. ద్వేషానికి మాత్రం నన్ను ఇబ్బందిపెట్టే అవకాశం ఇవ్వకూడదనుకున్నా" అని పోస్ట్ చేశారు సమంత.

థియేటర్స్‌లో చూడాల్సిన సినిమా 1920

- నాగార్జున


● మహేశ్‌భట్, నాగార్జున, అవికా గోర్, కృష్ణ

"నాకు హారర్ సినిమాలు చూడాలంటే భయం. కానీ '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్' సినిమా చూడాలనిపిస్తోంది. చూడాలనిపించేలా ఈ సినిమాను చేశారు" అన్నారు నాగార్జున. అవికా గోర్, రాహుల్ దేవ్, బర్ఖా బిష్త్, డానిష్ పండోర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్'. దర్శక-నిర్మాత మహేశ్‌భట్ రచన, సమర్పణలో కృష్ణాభట్ దర్శకత్వంలో రాకేష్ జునేజా, శ్వేతాంబరీ భట్ డా.రాజ్‌కిషోర్ ఖవ్రే నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ– "మహేశ్‌భట్‌గారు చాలా స్ఫూర్తినిచ్చే వ్యక్తి. 'తెలుసా మనసా' ('క్రిమినల్') పాటను ఆయన చేయించుకున్న విధానం నాకిప్పటికీ గుర్తు ఉంది. ఇక '1920' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సినిమాలను థియేటర్స్‌లోనే చూడాలి. అవికా కెరీర్‌లో ఈ సినిమా పెద్దహిట్‌గా నిలవాలి. అలాగే ఇవాళ ఒక పెద్ద సినిమా ప్రభాస్ 'ఆదిపురుష్' రిలీజ్ అవుతోంది. ఈ సినిమా అందరినీ మళ్లీ థియేటర్‌లోకి తీసుకురావాలి.. జై శ్రీరామ్" అన్నారు నాగార్జున. "నాగార్జునగారి వల్లే '1920 హారర్స్ ఆఫ్ ది హార్ట్'ను తెలుగులో విడుదల చేస్తున్నాం. వాళ్ల నాన్నగారి విలువలు, సంస్కారాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు నాగార్జున. విలువలు, సంస్కారం కాపాడుకోవడం చాలా ముఖ్యం. '1920' సినిమా కథ ఈ అంశాల గురించే" అన్నారు మహేశ్‌భట్. "నా తొలి సినిమా 'ఉయ్యాల జంపాల' నుంచి నాగార్జునగారు నన్ను సపోర్ట్ చేస్తున్నారు. ఇప్పుడు హిందీలో నా తొలి చిత్రం '1920' సినిమా ట్రైలర్ లాంచ్‌కు ఆయన రావడం చాలా సంతోషంగా ఉంది. '1920' నా కెరీర్‌లో స్పెషల్ మూవీ" అన్నారు అవికా గోర్. "ఇదొక ఎమోషనల్ లవ్‌స్టోరీ. హారర్‌లో ఎమోషన్‌ను ప్రయత్నించడం ఇదే తొలిసారి" అన్నారు కృష్ణాభట్.

పగ.. ప్రతీకారం...


● 'దిల్' రాజు, కళాధర్ కొక్కొండ

కళాధర్ కొక్కొండ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కర్ణ'. మోనా ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. సనాతన క్రియేషన్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాత 'దిల్' రాజు విడుదల చేశారు. కళాధర్ కొక్కొండ మాట్లాడుతూ– "వాస్తవ ఘటనలతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'కర్ణ'. పగ, ప్రతీకారం నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ చిత్రంలోని ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ బీజే, కెమెరా: శ్రవణ్ జి.కుమార్.

ట్రైలర్ చూస్తే కష్టం అర్థమవుతోంది

- డైరెక్టర్ నాగ్ అశ్విన్


● నాగ్ అశ్విన్, అక్షా ఖాన్

"నా దగ్గర ఓ వెబ్ సిరీస్‌కు సుబ్రమణ్యం అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాడు. 'నెల్లూరి నెరజాణ' సినిమాను తెరకెక్కించటానికి చాలా కష్టపడ్డాడు. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే టీమ్ అందరూ ఎంత కష్టపడ్డారో అర్థమవుతోంది. ఈ సినిమా మంచి విజయం సాధించి, వారందరికీ గొప్ప జీవితాన్ని ఇస్తుందనే నమ్మకం ఉంది" అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. ఎంఎస్ చంద్ర, హరి హీరోలుగా, అక్షాఖాన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నెల్లూరి నెరజాణ'. చిగురుపాటి సుబ్రమణ్యం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ని నాగ్ అశ్విన్ విడుదల చేశారు. "'నెల్లూరి నెరజాణ' సినిమా అంతా నెల్లూరు యాసలో సాగుతుంది" అన్నారు చిగురుపాటి సుబ్రమణ్యం. "ఇంత మంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన సుబ్రమణ్యంగారికి కృతజ్ఞతలు" అన్నారు ఎంఎస్ చంద్ర, హరి, అక్షా ఖాన్.

జాగ్రత్త బిడ్డా


● కృష్ణమోహన్, సీతక్క, శ్రీకాంత్

కృష్ణమోహన్, ప్రియాంక రెవ్రి, శ్రీకాంత్ కరణం, ఎమ్వై గిరిబాబు, హీనారాయ్, రమ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'జాగ్రత్త బిడ్డా'. కృష్ణ మోహన్ దర్శకత్వంలో శ్రీకాంత్ కరణం, ఎమ్వై గిరిబాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. డిస్ట్రిబ్యూటర్ ఎమ్. అచ్చిబాబు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క 'జాగ్రత్త బిడ్డా' ట్రైలర్‌ని విడుదల చేసి, మాట్లాడుతూ–"'డీజే టిల్లు, బలగం' చిత్రాల్లా తెలంగాణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం విజయం సాధించాలి" అన్నారు. "తన చెల్లెళ్లకు జరిగిన అన్యాయానికి ఓ అన్న విధించిన శిక్ష నేపథ్యంలో రూపొందిన చిత్రమిది" అన్నారు కృష్ణ మోహన్.

ఓ వయ్యారి వన్నెలాడి..


● శివ

శివ కోన, ప్రభాకర్, కునల్ కౌశల్, నేహా దేశ్ పాండే ముఖ్య తారలుగా, ప్రాచి కెథర్, అభిలాష్ బండారి, రమ్య దినేష్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రాజుగారి కోడిపులావ్'. శివ కోన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. అనిల్ మోదుగ మరో నిర్మాత. కాగా ఈ సినిమాలోని 'సునో సునామీ' పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'ఔరౌర కన్నె కోడి.. ఓ వయ్యారి వన్నెలాడి' అంటూ ఈ పాట సాగుతుంది. సంగీత దర్శకుడు ప్రవీణ్ మని స్వరపరచిన ఈ పాటకు మల్లిక్ వల్లభ లిరిక్స్ అందించగా ఎన్సీ కారుణ్య, వైశాలి శ్రీ ప్రతాప్ పాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
311	68
62,917	18,688

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.00 గంటలకు)

నాస్‌డాక్	13,718	▲	36
డోజోన్స్	34,357	▲	378
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,628	▲	25
డాక్స్	16,290	▲	21
షాంఘై	3,252	▲	24
నికాయ్	33,486	▽	7

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,934	▽	330
బంగారం (99.5 స్వచ్ఛత)	58,698	▽	329
వెండి (కిలో)	71,062	▽	1,043

టిటాగఢ్ నుంచి వందే భారత్ రైళ్లు

- బీహెచ్ఈఎల్ కన్సార్షియంకు కాంట్రాక్ట్
- 80 స్లీపర్ రైళ్ల సెట్ తయారీ, నిర్వహణ
- కాంట్రాక్టు విలువ రూ. 24,000 కోట్లు



BHEL

న్యూఢిల్లీ: దేశీ రైల్వేలు కొత్తగా ప్రవేశపెట్టదలచిన వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ కాంట్రాక్టును టిటాగఢ్ రైల్ సిస్టమ్స్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(భెల్) కన్సార్షియం దక్కించుకుంది. తద్వారా మొత్తం 80 స్లీపర్ ట్రెయిన్ల తయారీకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వీటిని 2029కల్లా అందించవలసి ఉన్నట్లు సంయుక్త ప్రకటనలో టిటాగఢ్, భెల్ తెలియజేశాయి. మొత్తం కాంట్రాక్టు విలువను రూ. 24,000 కోట్లుగా వెల్లడించాయి. దేశీ సంస్థల కన్సార్షియంకు ఈ స్థాయి విలువలో రైల్వే శాఖ కాంట్రాక్టునివ్వడం ఇదే తొలిసారికాగా.. వందే భారత్ స్లీపర్ రైళ్ల డిజైన్, తయారీతోపాటు.. 35 ఏళ్లపాటు నిర్వహణను చేపట్టనున్నాయి. టెండర్ విధానంలో ఏకైక ఆత్మనిర్భర్ కన్సార్షియంగా టిటాగఢ్ రైల్ సిస్టమ్స్, బీహెచ్ఈఎల్ కన్సార్షియం నిలిచింది.

రెండేళ్లలో..: వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ కాంట్రాక్టును ఆరేళ్లలో పూర్తి చేయవలసి ఉన్నట్లు టిటాగఢ్ రైల్ వైస్‌చైర్మన్, ఎండీ ఉమేష్ చౌధరీ తెలియజేశారు. తొలి ప్రొటోటైప్ రైలును రెండేళ్లలోగా డెలివరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తదుపరి మిగిలిన రైళ్లను అందించనున్నట్లు వివరించారు. ప్రతీ రైలుకు 16 కోచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. తద్వారా సుమారు 887 మంది ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. గంటకు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకునేలా డిజైన్ చేయనున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగమవుతున్నందుకు గర్వపడుతున్నట్లు వ్యాఖ్యానించారు. రైళ్ల తయారీలో చివరి దశ అసెంబ్లీ, పరిశీలన, నిర్వహణ వంటివి చెన్నైలోని దేశీ రైల్వే ప్లాంటులో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

4వ నెలా.. ఎగుమతులు మైనస్!

- మేలో 10.3% క్షీణత
- విలువ 34 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు నిరాశాజనకంగా కొనసాగుతున్నాయి. వరుసగా నాలుగో నెల (మే)లోనూ అసలు వృద్ధిలేకపోగా (2022 మే నెలతో పోల్చి) 10.3 శాతం క్షీణించాయి. విలువలో 34.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

దిగుమతులు ఇలా...

ఇక వస్తు దిగుమతులు సైతం 6.6% తగ్గి 57.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు–దిగుమతుల విలువల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు 5నెలల గరిష్ట స్థాయిలో 22.12 బిలియన్ డాలర్లకు చేరింది. వాణిజ్య మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల్లో ముఖ్యాంశాలు..

- పెట్రోలియం ప్రొడక్టులు, ఆభరణాలు, ఇంజినీరింగ్ గూడ్స్, రెడీ–మేడ్ దుస్తులు, రసాయనాల రంగాల ఎగుమతుల్లో అసలు వృద్ధిలేకపోగా క్షీణత నమోదయ్యింది.
- పెట్రోలియం ప్రొడక్ట్స్ పరిశీలిస్తే, ఎగుమతులు 30 శాతం తగ్గి, 6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- చమురు దిగుమతులు మేలో 6% పడిపోయి 15.62 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- పసిడి దిగుమతులు సైతం 38.71% పడిపోయి 4 బిలియన్ డాలర్లకు చేరాయి.

రెండు నెలల్లోనూ క్షీణతే

ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్–మే) ఎగుమతులు 11.41 శాతం క్షీణించి 69.72 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు సైతం 10.24 శాతం పడిపోయి, 107 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి వాణిజ్యలోటు 37 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. భారత్ వస్తు ఎగుమతులు 2022–23లో 2021–22తో పోల్చితే 6 శాతం పెరిగి 447 బిలియన్ డాలర్లకు చేరాయి.

50 శాతం ఆదాయ వృద్ధి లక్ష్యం

అప్‌స్టాక్స్ సీఈవో రవి కుమార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్రోకరేజి సంస్థ అప్‌స్టాక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 50 శాతం ఆదాయ వృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది. 25–30 శాతం మేర లాభాల వృద్ధి ఉండగలదని అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ ఆదాయం రూ. 1,000 కోట్లు దాటగా.. బ్రేక్ ఈవెన్ సాధించింది. అప్‌స్టాక్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో రవి కుమార్ గురువారమిక్కడ విలేకరుల సమావేశం సందర్భంగా ఈ విషయాలు తెలిపారు. ప్రస్తుతం తమకు 1.1 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారని, 2030 నాటికి ఈ సంఖ్యను పది కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో క్లయింట్ల సంఖ్య గత రెండేళ్లలో 13% పెరిగిందని, వీరిలో 70% మంది యువ ఇన్వెస్టర్లేనని రవి కుమార్ చెప్పారు. డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో దేశ సగటుతో పోలిస్తే ఇక్కడ రెట్టింపు స్థాయిలో ట్రేడర్లు ఉన్నట్లు వివరించారు. అడ్వాన్స్‌డ్ ట్రేడర్ల కోసం రియల్ టైమ్ సమాచారంతో ట్రేడ్ మోడ్, ఇన్వెస్టర్ల కోసం ఇన్వెస్ట్ మోడ్ పేరిట రెండు ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. 2018 నుంచి ఇప్పటివరకూ 200 మిలియన డాలర్ల నిధులు సమీకరించామని చెప్పారు. అప్‌స్టాక్స్‌లో ప్రస్తుతం 600 మంది పైచిలుకు సిబ్బంది ఉండగా.. హైదరాబాద్‌లో దాదాపు 40 మంది ఉన్నారు. అవసరాన్ని బట్టి స్థానికంగా కార్యాలయం ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు కుమార్ తెలిపారు.

బీ న్యూ స్టోర్లలో రియల్‌మీ 11ప్రో ప్లస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్లు

హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చెయిన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రియల్‌మీ 11 ప్రో ప్లస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో గురువారం నటి వర్ష బొల్లమ్మ ఈ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేశారు. బజాజ్, టీవీఎస్ క్రెడిట్, హెచ్‌డీబీ, బీనా, క్లైవర్‌పే ద్వారా నెలవారీ వాయిదా పద్ధతిలో ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చు. జీరో ఫైనాన్స్ కూడా అందుబాటులో ఉంది. ఈ అవకాశాన్ని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని బీ న్యూ స్టోర్ సీఎండీ బాలాజీ చౌదరి కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఈఓ సాయి నిఖిలేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్‌తో పాటు రియల్‌మీ సౌతిండియా సేల్స్ హెడ్ వేణు మాధవ్‌లు పాల్గొన్నారు.



హీరో కొత్త ఎక్స్‌ట్రీమ్ బైక్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ ప్రీమియం బైక్ ఎక్స్‌ట్రీమ్ 160ఆర్ 4వీ ప్రవేశపెట్టింది. మూడు వేరియంట్లలో లభిస్తుంది. భారత్‌లో 160 సీసీ విభాగంలో అధిక వేగంతో పరుగెత్తే మోడల్ ఇదేనని కంపెనీ తెలిపింది. ధర హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో రూ.1.29 లక్షల నుంచి ప్రారంభమై రూ.1.38 లక్షల వరకు ఉంది. బీఎస్–6 రెండవ దశ, ఈ20 ప్రమాణాలకు అనుగుణంగా సింగిల్ సిలిండర్, ఆయిల్ కూల్డ్, ఫోర్–వాల్వ్ 163 సీసీ ఇంజన్‌ను పొందుపరిచారు. 5 స్పీడ్ గేర్ బాక్స్, 16.6 హెచ్‌పీ పవర్, 14.6 ఎన్ఎం టార్క్ కలిగి ఉంది. బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. జూలై రెండవ వారం నుంచి డెలివరీలు ఉంటాయి. 'ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో కొత్త శ్రేణిని నిర్వచించే ఉత్పత్తులను పరిచయం చేయబోతున్నాం. ఏడాది పొడవునా విడుదల చేసే క్రమంలో ఎక్స్‌ట్రీమ్ 160ఆర్ 4వీ మొదటిది' అని హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా ఈ సందర్భంగా తెలిపారు.

మూడు రోజుల లాభాలకు 'ఫెడ్' బ్రేక్!

- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు
- మళ్లీ 63 వేల దిగువకు సెన్సెక్స్
- 18,700 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ



ముంబై: బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో స్టాక్ సూచీలు గురువారం నష్టాలను చవిచూశాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ.., ప్రస్తుత ఏడాదిలో రెండుసార్లు పెంపు ఉండొచ్చని సంకేతాలిచ్చింది. దీంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లతో పాటు దేశీయ మార్కెట్లపై కూడా ప్రతికూల ప్రభావం కొనసాగింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి క్షీణత కూడా నిరాశపరిచింది. దీంతో సూచీల మూడు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడినట్టైంది. ఉదయం సెన్సెక్స్ 75 పాయింట్ల నష్టంతో 63,154 వద్ద, నిఫ్టీ 18 పాయింట్లు పెరిగి 18,774 వద్ద మిశ్రమంగా ప్రారంభమయ్యాయి. తొలి సెషన్‌లో ఫ్లాటుగా ట్రేడైన సూచీలు.., మిడ్ సెషన్ నుంచి నష్టాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 440 పాయింట్ల పరిధిలో 62,871 వద్ద గరిష్టాన్ని, 63,311 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 311 పాయింట్ల నష్టంతో 63 వేల దిగువన 62,917 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 18,669 – 18,794 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 68 పాయింట్లు బలపడి 18,688 వద్ద ముగిసింది. బ్యాంక్స్, ఫైనాన్స్‌తో పాటు రియల్టీ, టెక్, ఐటీ, మెటల్ షేర్లు నష్టాలను చవిచూశాయి. విస్తృత స్థాయి మార్కెట్లో ఫార్మా, ఆటో, ఎఫ్ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.30%, 0.12 శాతం చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,086 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.298 కోట్ల షేర్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 14 క్షీణించి 82.19 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కోల్‌కతాలో విలాసవంతమైన నివాస గృహ ప్రాజెక్ట్ నిర్మాణానికి స్థలాన్ని సేకరిస్తున్నట్లు తెలపడంతో గ్రోదేజ్ ప్రాపర్టీస్ నాలుగు శాతం లాభపడి రూ.1569 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఐదున్నర శాతం ర్యాలీ చేసి రూ.1589 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుంచి ఆర్డర్లు పెరగొచ్చనే అంచనాలతో భారత్ డైనమిక్స్ షేరు 2% పెరిగి రూ.1129 వద్ద స్థిరపడింది. ఇటీవలే బ్రోకరేజ్ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీ 'బై' రేటింగ్ కేటాయింపుతో పాటు షేరు టార్గెట్ ధరను పెంచింది.
- జేపీ మోర్గాన్ భారత ఐటీ రంగం రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేయడంతో ఐటీ స్టాకులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, ఎంఫసీస్ తదితర సంస్థలను 'ప్రతికూల ప్రభావ పరిశీలన' జాబితాలో చేర్చింది. ఫలితంగా విప్రో 2%, ఇన్ఫీ, కోఫోర్జ్‌లు 1% పతనమయ్యాయి. టీసీఎస్, ఎంఫసీస్ టెక్ మహీంద్రా షేర్లు అరశాతం నష్టపోయాయి.

19న తాజా గోల్డ్ బాండ్ స్కీమ్

న్యూఢిల్లీ: బంగారంలో పెట్టుబడిపెట్టాలనుకునేవారికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మొదటి ఆరు నెలల్లో రెండుసార్లు– జూన్, సెప్టెంబర్‌లో సావరిన్ గోల్డ్ బాండ్‌స్కీమ్ అందుబాటులో రానుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దీనిప్రకారం జూన్ 19 నుంచి 23వ తేదీ వరకూ అలాగే సెప్టెంబర్ 11 నుంచి 15 వ తేదీల్లో గోల్డ్ బాండ్ స్కీమ్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. గోల్డ్ బాండ్లు– షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు (స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా), స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నిర్దిష్ట పోస్టాఫీసులు, డీ–మ్యాట్ అకౌంట్‌తో గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా కొనుగోలు చేయవచ్చు.



మేఘా కంపెనీకి రూ.500 కోట్ల ఆర్డర్

రక్షణ శాఖ నుంచి అందుకున్న ఐకామ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) అనుబంధ కంపెనీ ఐకామ్ టెలి తాజాగా భారత రక్షణ శాఖ నుంచి రూ.500 కోట్ల ఆర్డర్ చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా 5/7.5 టన్నుల రేడియో రిలే కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ కంటైనర్స్ 1,035 యూనిట్లు సరఫరా చేయనుంది. రక్షణ శాఖతో ఈ మేరకు ఒప్పందం కుదిరిందని ఐకామ్ టెలి గురువారం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే డెలివరీలు ప్రారంభం అవుతాయని వివరించింది.



రక్షణ శాఖ అధికారులతో ఐకామ్ ప్రతినిధులు

సాక్షి స్పోర్ట్స్



అమెరికా మేజర్ లీగ్ క్రికెట్‌లో రాయుడు

ఇటీవల ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పిన భారత క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు వచ్చే నెలలో అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ టి20 టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాయుడు మేజర్ లీగ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఐపీఎల్‌లోని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు యాజమాన్యానిదే టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టు. జూలై 13 నుంచి 30 వరకు జరిగే మేజర్ లీగ్ టోర్నీలో ముంబై ఇండియన్స్ న్యూయార్క్ జట్టు, లాస్ ఏంజెలిస్ నైట్‌రైడర్స్, సియాటెల్ ఒర్కాస్, వాషింగ్టన్ ఫ్రీడమ్, శాన్‌ఫ్రాన్సిస్కో యునికార్న్ జట్లు కూడా పోటీపడనున్నాయి.

సెమీఫైనల్లో బోపన్న జోడీ

స్టుట్‌గార్ట్‌లో జరుగుతున్న బాస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6–1, 7–5తో ముసెట్టి–సొనెగో (ఇటలీ) జంటపై గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

ఆగస్టు 31 నుంచి ఆసియా కప్ టోర్నీ

పాకిస్తాన్‌లో 4, శ్రీలంకలో 9 మ్యాచ్‌లు



న్యూఢిల్లీ: ఎట్టకేలకు ఆసియా కప్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆధ్వర్యంలో జరగనున్న ఈ టోర్నీని 'హైబ్రిడ్ మోడల్'లో నిర్వహించేందుకు జై షా అధ్యక్షుడిగా ఉన్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 17 వరకు ఈ టోర్నీని నిర్వహిస్తారు. పాకిస్తాన్‌లో 4 మ్యాచ్‌లు... శ్రీలంకలో 9 మ్యాచ్‌లు జరుగుతాయి. భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, నేపాల్ జట్లు టైటిల్ కోసం పోటీపడతాయి. ఆరు జట్లను రెండు గ్రూప్‌లుగా (మూడు జట్లు చొప్పున) విభజించారు. ఒక గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్, నేపాల్... మరో గ్రూప్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ జట్లున్నాయి. గ్రూప్ దశ తర్వాత రెండు గ్రూప్‌ల నుంచి రెండేసి జట్లు 'సూపర్ ఫోర్' దశకు అర్హత సాధిస్తాయి. 'సూపర్ ఫోర్' దశ తర్వాత టాప్–2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. పాకిస్తాన్‌లోని నాలుగు మ్యాచ్‌లకు లాహోర్ వేదికగా నిలుస్తుంది. శ్రీలంకలో క్యాండీ, పల్లెకెలెలో మ్యాచ్‌లు ఉంటాయి. ఈ ఏడాది వన్డే వరల్డ్ కప్ ఉండటంతో ఈసారి ఆసియా కప్‌ను వన్డే ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. అయితే మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు. గత ఏడాది టి20 వరల్డ్‌కప్ జరగడంతో ఆసియా కప్ టోర్నీని టి20 ఫార్మాట్‌లో నిర్వహించగా... ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి శ్రీలంక విజేతగా నిలిచింది.

భారత్, లెబనాన్ మ్యాచ్ 'డ్రా'



భువనేశ్వర్: ఇంటర్‌కాంటినెంటల్ కప్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ లీగ్ దశను భారత్ 'డ్రా'తో ముగించింది. భారత్, లెబనాన్ జట్ల మధ్య గురువారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 0–0తో 'డ్రా'గా ముగిసింది. ఇప్పటికే ఈ రెండు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ మ్యాచ్‌లో స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రిని 82వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా ఆడించారు. భారత్, లెబనాన్ జట్ల మధ్య ఫైనల్ ఆదివారం జరుగుతుంది.

బ్రిజ్‌భూషణ్‌కు ఊరటనిస్తూ...

- 'పోక్సో'ను తొలగించేందుకు సిద్ధమైన పోలీసులు
- ఇతర సెక్షన్లతో కేసు నమోదు





రెజ్లర్లు బజరంగ్, వినేశ్, సాక్షి మలిక్ (ఫైల్)

న్యూఢిల్లీ: రెజ్లర్లపై లైంగిపు వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై కేసు కీలక మలుపు తిరిగింది. అతనిపై నమోదైన చిన్నారులపై లైంగిక వేధింపుల రక్షణ చట్టం (పోక్సో)ను తప్పించేందుకు ఢిల్లీ పోలీసులు సిద్ధమయ్యారు. 'పోక్సో'కు సంబంధించి బ్రిజ్‌భూషణ్‌పై ఎలాంటి బలమైన ఆధారాలు లభించలేదని, ఈ కేసుకు కారణమైన మైనర్ రెజ్లర్, ఆమె తండ్రి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే ఈ నిర్ణయానికి వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'పోక్సో' ఫిర్యాదు ఫైల్‌ను మూసివేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని పటియాలా హౌస్ కోర్టును పోలీసులు కోరారు. దీనిపై జూలై 4న విచారణ జరగనుంది. వెంటనే అరెస్ట్‌కు అవకాశం ఉన్న, బెయిల్ కష్టంగా మారే, రుజువైతే కనీసం మూడేళ్ల జైలు శిక్ష పడే 'పోక్సో' కేసును తొలగించడం అంటే బ్రిజ్‌భూషణ్‌కు ఊరట లభించినట్లే.

అంతా ఎంపీకి అనుకూలంగా...

నిరసనలో పాల్గొన్న భారత అగ్రశ్రేణి రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్‌లతో కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ నెల 7న చర్చలు జరిపారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని, ఈ నెల 15లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాలని వారు డిమాండ్ చేశారు. దాంతో తగిన చర్య తీసుకుంటామని ఠాకూర్ వారికి హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే ఢిల్లీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అయితే చాలా మంది అనుమానించిన విధంగానే కంటితుడుపుగా చార్జ్‌షీట్ దాఖలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తమ పార్లమెంట్ సభ్యుడికి అండగా నిలిచింది. ఆరోపణలు వచ్చిన చాలా రోజులకు కోర్టు ఆదేశాలతో పోలీసులు కేసు దాఖలు చేయడం, కనీసం ఒక్కసారి ప్రశ్నించకుండా, విచారణకు పిలవకుండా కేసును తప్పించేందుకు సిద్ధం కావడం బ్రిజ్‌భూషణ్ ఎంత బలమైన వ్యక్తో చూపిస్తోంది. రెజ్లర్ల ఫిర్యాదు ప్రకారం 354, 354ఎ, 354డి, 506 సెక్షన్ల కింద బ్రిజ్‌భూషణ్‌పై కేసులు నమోదయ్యాయి. ఇవేవీ తీవ్రమైనవి కావు. దీనిపై ఈ నెల 22న విచారణ జరగనుంది. తాజా పరిణామాలపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. క్రీడలకు 'బ్లాక్‌డే' అంటూ పలువురు రాజకీయ నాయకులు వ్యాఖ్యానించారు. 'బేటీ దరావో, బ్రిజ్‌భూషణ్ బచావో' అనేది బీజేపీ కొత్త నినాదమని, భారత బిడ్డల వేదనకు స్పందించకుండా చెత్త బుట్టలో పడేశారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్‌కు వ్యతిరేకంగా మొత్తం వ్యవస్థను నిలబెట్టి తమ ఎంపీని వారు రక్షించుకున్నారని ఆ పార్టీ పేర్కొంది.

మరోవైపు బ్రిజ్‌భూషణ్‌పై దాఖలైన చార్జ్‌షీట్‌పై స్పందించేందుకు రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ నిరాకరించారు. తాజా పరిణామాలపై అందరం చర్చించుకున్నాకే, తమ భవిష్యత్ కార్యాచరణను వెల్లడిస్తామని సాక్షి మలిక్ భర్త సత్యవర్త్ కడియాన్ తెలిపాడు.

శ్రీకాంత్, ప్రణయ్ జోరు

- క్వార్టర్ ఫైనల్లోకి భారత స్టార్ షట్లర్లు
- వరుసగా తొమ్మిదోసారి తై జు యింగ్ చేతిలో ఓడిన సింధు



శ్రీకాంత్



ప్రణయ్

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ప్రపంచ 22వ ర్యాంకర్ శ్రీకాంత్ 21–17, 22–20తో ప్రపంచ 20వ ర్యాంకర్, భారత్‌కే చెందిన లక్ష్య సేన్‌ను ఓడించగా... ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 21–18, 21–16తో ప్రపంచ 16వ ర్యాంకర్ ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)పై గెలుపొందాడు. గతంలో లక్ష్య సేన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన శ్రీకాంత్‌కు ఈసారి గట్టిపోటీనే లభించింది. ప్రతి పాయింట్‌కు ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. అయితే కీలకదశలో శ్రీకాంత్ సంయమనంతో ఆడి పైచేయి సాధించాడు. తొలి గేమ్‌లో స్కోరు 17–17తో సమంగా ఉన్నదశలో శ్రీకాంత్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి గేమ్‌ను దక్కించుకున్నాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్ 20–14తో విజయానికి పాయింట్ దూరంగా నిలిచాడు. అయితే లక్ష్య సేన్ వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి స్కోరును 20–20తో సమం చేశాడు. వరుసగా ఆరు పాయింట్లు కోల్పోయినా శ్రీకాంత్ ఏకాగ్రత కోల్పోకుండా ఆడి వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మరో ప్రీక్వార్టర్ ఫైనల్లో భారత యువతార ప్రియాన్షు రజావత్ 22–20, 15–21, 15–21తో ప్రపంచ రెండో ర్యాంకర్ జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

మహిళల సింగిల్స్‌లో భారత పోరాటం ముగిసింది. పీవీ సింధు ప్రీక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. మూడో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో 14వ ర్యాంకర్ సింధు 18–21, 16–21తో ఓడిపోయింది. ఓవరాల్‌గా తై జు యింగ్ చేతిలో సింధుకిది 19వ ఓటమికాగా వరుసగా తొమ్మిదో పరాజయం. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చివరిసారి తై జు యింగ్‌ను ఓడించిన సింధు ఆ తర్వాత వరుసగా తొమ్మిది మ్యాచ్‌ల్లో ఈ చైనీస్ తైపీ ప్లేయర్ చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రీక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–17, 21–15తో హి జి టింగ్–జౌ హావో డాంగ్ (చైనా) జంటపై గెలిచింది.

ధీరజ్ బృందానికి కాంస్యం

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో భారత్‌కు మూడో పతకం



మెడెలిన్ (కొలంబియా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–3 టోర్నీలో భారత్ ఖాతాలో మూడో పతకం చేరింది. బుధవారం కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు కాంస్య పతకాలు సాధించాయి. గురువారం భారత పురుషుల జట్టు రికర్వ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం గెల్చుకుంది. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు బొమ్మదేవర ధీరజ్, తుషార్ ప్రభాకర్ షెల్కే, మృణాల్ చౌహాన్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతక మ్యాచ్‌లో 5–3తో చైనా జట్టుపై విజయం సాధించింది. అంతకుముందు తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత్ రెండో రౌండ్‌లో 6–2తో కెనడాపై, క్వార్టర్ ఫైనల్లో 5–1తో కొలంబియాపై గెలిచాయి. అనంతరం సెమీఫైనల్లో భారత్ 0–6తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయి కాంస్య పతకానికి పోటీపడింది. మహిళల టీమ్ రికర్వ్ విభాగంలో భజన్ కౌర్, సంగీత, తనీషా వర్మలతో కూడిన భారత జట్టు రెండో రౌండ్‌లో 3–5తో ఫ్రాన్స్ జట్టు చేతిలో ఓడిపోయింది.

'టాపర్'గా భారత్




చెన్నై: ప్రపంచకప్ స్క్వాష్ టీమ్ టోర్నీలో గురువారం జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–1తో జపాన్ జట్టును ఓడించి 'టాపర్'గా నిలిచింది. సెమీఫైనల్లో మలేసియాతో భారత్ తలపడుతుంది. జపాన్ తో తొలి మ్యాచ్‌లో భారత ప్లేయర్ అభయ్ సింగ్ 6–7, 6–7, 2–7తో టొమొటకె చేతిలో ఓడిపోయాడు. రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 2–7, 7–4, 3–7, 7–5, 7–5తో సటోమి వతనాబెను ఓడించి స్కోరును 1–1తో సమం చేసింది. మూడో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 7–6, 6–7, 7–4, 3–7, 7–5తో సుకుయెపై గెలిచి భారత ఆధిక్యాన్ని 2–1కి పెంచాడు. నాలుగో మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 7–4, 7–1, 7–1తో మిదోరికవాను ఓడించింది.

బంగ్లాదేశ్‌కు భారీ ఆధిక్యం



ఇబాదత్

మిర్పూర్: అఫ్గానిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టుపై బంగ్లాదేశ్ జట్టు రెండో రోజే పట్టు బిగించింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 362/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 20 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 382 పరుగులవద్ద ఆలౌటైంది. అనంతరం బంగ్లాదేశ్ బౌలర్లు ఇబాదత్ హొస్సేన్ (4/47), షోరిఫుల్ ఇస్లాం (2/28), తైజుల్ ఇస్లాం (2/7), మిరాజ్ (2/15) విజృంభించి అఫ్గానిస్తాన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే ఆలౌట్ చేశారు. 236 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన బంగ్లాదేశ్ ప్రత్యర్థికి ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ ఒక వికెట్ నష్టానికి 134 పరుగులు చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్ ఓవరాల్‌గా 370 పరుగుల ఆధిక్యంలో ఉంది. జకీర్ హసన్ (54 బ్యాటింగ్; 6 ఫోర్లు), నజ్ముల్ హొస్సేన్ షాంతో (54 బ్యాటింగ్; 8 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీలతో క్రీజులో ఉన్నారు.



మైక్రో బ్యాగు.. బహు బాగు

ఈ చిత్రాల్లో ఒకదానిలో చేతి వేలిపై ఏదో ఇసుక రేణువు, మరో చిత్రంలో ఓ హ్యాండ్‌బ్యాగ్ కనిపిస్తున్నాయా? ఇసుక రేణువుకు, హ్యాండ్ బ్యాగ్‌కు సంబంధమేంటి అంటారా? సింపుల్.. రెండూ ఒకటే.



ప్రఖ్యాత ఫ్యాషన్ వస్తువుల కంపెనీ మిస్చీఫ్.. ఫొటోపాలిమర్ రెసిన్‌తో ఈ మైక్రోస్కోపిక్ హ్యాండ్‌బ్యాగ్‌ను తయారు చేసింది. దీని పరిమాణం 700 మైక్రో మీటర్లు (అంటే మిల్లీమీటర్‌లో సగానికంటే ఎక్కువ). సూది రంధ్రం నుంచి సులువుగా దూరిపోగలదు. ఈ నెల 20 నుంచి దీనిని పారిస్‌లో ప్రదర్శనకు పెట్టనున్నారు. ఆ తర్వాత జూపిటర్ వేలం శాలలో వేలం వేయనున్నారు.



ఆకాశంలో పూసిన పువ్వు

లేత నారింజ రంగులో పువ్వు భలే అందంగా ఉందికదా.. అయితే ఇది అలాంటి ఇలాంటి పువ్వు కాదు. ఎక్కడో పైన ఆకాశంలో 250 కిలోమీటర్ల ఎత్తున పూసిన పువ్వు ఇది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లో చేస్తున్న ప్రయోగాలలో భాగంగా నాసా శాస్త్రవేత్తలు ఈ 'జిన్నియా'పూల మొక్కను పెంచారు. నాసా తాజాగా తమ ట్విట్టర్ ఖాతాలో ఈ ఫొటోను పోస్ట్ చేసింది. ఇందులో పువ్వు, మొక్క వెనకాల నీలి రంగులో కనిపిస్తున్నది భూమి అయితే, దాని దిగువన నలుపు రంగు అంతా అంతరిక్షం కావడం గమనార్హం.

సర్కారు స్కూలు పిల్లలకు ఫ్రీ

- రాష్ట్రపతి నిలయం సందర్శనపై పీఆర్‌ఓ కుమార్ సమ్రేశ్
- ఇతరులకు ఒక్కొక్కరికి రూ. 50 ప్రవేశ రుసుం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి నిలయం సందర్శనకు వచ్చే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్టు రాష్ట్రపతి భవన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కుమార్ సమ్రేశ్ వెల్లడించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని ఏడాది పొడవునా సందర్శనకు అనుమతిస్తూ, ఆ మేరకు మార్చి 22 నుంచి సందర్శనకు అవకాశం కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈనెల 14 వరకు రాష్ట్రపతి నిలయాన్ని దాదాపు 10 వేల మంది సందర్శకులు దర్శించారని పీఆర్‌ఓ సమ్రేశ్ తెలిపారు. రాష్ట్రపతి నిలయ సందర్శన సమాచారాన్ని ప్రజల్లోకి మరింత తీసుకెళ్లే ఉద్దేశంతో గురువారం రాష్ట్రపతి నిలయంలో ఓ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి నిలయంలో తీసుకువచ్చిన మార్పులు, బుకింగ్ తదితర వివరాలను రాష్ట్రపతి నిలయం మేనేజర్ డా.కె రజనీప్రియతో కలిసి ఆయన వెల్లడించారు.

డిసెంబర్ మినహా ఏడాది పొడవునా..

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన జరిగే డిసెంబర్ నెల మినహా ఏడాది పొడవునా సాధారణ పౌరుల సందర్శనకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి సోమవారం, ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా ఏ రోజైనా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శనకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ కోసం http://visit.rashtrapatibhavan.gov.in వెబ్‌సైట్‌లో లేదంటే నేరుగా రాష్ట్రపతి నిలయానికి వచ్చి అక్కడి రిసెప్షన్ సెంటర్‌లోనూ టికెట్ తీసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రవేశం పూర్తిగా ఉచితం అని, మిగిలిన వారికి ఒక్కొక్కరికి రూ.50 ప్రవేశ రుసుం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా సందర్శకుల బృందం 30 మందికి పైగా ఉంటే వారికి టికెట్ రుసుంలో 20 శాతం రాయితీ ఇస్తామన్నారు. సందర్శకులకు రాష్ట్రపతి నిలయంలోని విశేషాలను వివరించేందుకు 20 మంది గైడ్లను ప్రత్యేకంగా నియమించినట్టు వారు తెలిపారు.



రాష్ట్రపతి నిలయంలో మీడియాతో మాట్లాడుతున్న కుమార్ సమ్రేశ్. చిత్రంలో రజనీప్రియ తదితరులు

దేశంలోనే ఉత్తమ పల్లె జగన్నాథపురం

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామాన్ని వరించిన జాతీయ అవార్డు
- ఉత్తమ జిల్లాల కేటగిరీలో ఆదిలాబాద్‌కు మూడో స్థానం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు మంచినీటి వనరుల విభాగంలో మరో జాతీయ అవార్డు లభించింది. దేశంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జగన్నాథపురం గ్రామం నిలిచింది. ఉత్తమ జిల్లాల కేటగిరీలో ఆదిలాబాద్ జిల్లా దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. దీంతోపాటు హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లను సరిగ్గా వినియోగించుకున్న విద్యాసంస్థల కేటగిరీలో రెండో స్థానాన్ని పొందింది. ఈ నెల 17న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. తెలంగాణ మరోసారి జాతీయ స్థాయిలో అవార్డు సాధించడంపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. అవార్డు ప్రకటించిన కేంద్రానికి, ఈ అవార్డులు రావడానికి ప్రేరణగా నిలిచిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జగన్నాథపురం గ్రామ పంచాయతీకి, పాలకవర్గం, సిబ్బంది, అధికారులను మంత్రి అభినందించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 11 కేటగిరీలలో 41 మంది విజేతలను ప్రకటించింది.



జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపికైన ములకలపల్లి మండలం జగన్నాథపురం జీపీ కార్యాలయం

ఇందులో ఉత్తమ రాష్ట్రంగా మధ్యప్రదేశ్, ఉత్తమ జిల్లాగా ఒడిశాలోని గంజాం, ఉత్తమ గ్రామ పంచాయతీగా తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జగన్నాథపురం నిలిచాయి.

నీటి వనరుల నిర్వహణకు...

జలవనరులు, నదుల అభివృద్ధి గంగా పునరుజ్జీవన శాఖ అధ్వర్యంలో 2018 నుంచి జల, నీటి వనరుల నిర్వహణ అవార్డులను అందజేస్తున్నారు. 'జల సంపన్న భారత్'అనే ప్రభుత్వ దార్శనికతను సాకారం చేసేందుకు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న డ్రైవ్‌లో భాగంగా జాతీయ నీటి అవార్డులు వివిధ వ్యక్తులు, సంస్థలు చేసిన మంచి పని, ప్రయత్నాలను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తాయి. ఇది నీటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పనకు, ఉత్తమ నీటి వినియోగ పద్ధతులను అవలంబించేలా వారిని ప్రేరేపించడానికి దోహదపడుతుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.